ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 10.11.2026 | సంపుటి:13 సంచిక:110 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





లగచర్ల 'రైతన్నతో ఆత్మీయ సభ' బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ వచ్చినా..

పాలమూరు వలసలు ఆగలేదు

- కేసీఆర్ చేసిన అప్పులకు మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు చెల్లించాం
- మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని జేతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకువచ్చారు
- ఆడపిల్లల ఉన్నత చదువే ప్రభుత్వ లక్ష్యం
- మహిళా సాధికారత సాధిస్తేనే ఇది సాధ్యం
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం.. 5 లక్షల కొత్త పెన్షన్ల మంజూరు
- హకీంపేట్ 'రైతన్నతో ఆత్మీయ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రాజెక్టులు పూర్తికాలేదు

వికారాబాద్ జిల్లా బ్యూరో/ బొంరాసిపేట(జనంసాక్షి):

తెలంగాణ వచ్చినా పాలమూరులో వలసలు ఆగలేదని సీఎం రేవంత్ అనారు. ఆడపిల్లలు ఉన్నతస్థానంలో నిలదొక్కుకోవాలం టే తప్పని సరిగా చదువుకోవాలని, తమ పిల్లల ను చదివిస్తామని మహిళలంతా మాట ఇవ్వా లని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. 2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీ శ్వరులను చేయాలన్నదే తన జీవిత లక్ష్యమని ప్రకటించారు. దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రంలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, నేత, గీత కార్మికులకు కొత్తగా 4.5 లక్షల పింఛన్ల పంపిణీని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. దీపావళి పం డుగతో పాటు పుట్టిన రోజు సందర్భంగా ముఖ్య మంత్రి కొడంగల్ నియోజకవర్గంలో హకీం పేట్ ఇండస్ట్రియల్ హబ్‌లో స్వయం సహా యక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పలువురు మహిళలకు పింఛన్లు అందిం చి, రాష్ట్రంలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, నేత, గీత కార్మికు లకు సంతృప్త స్థాయిలో అందించే

మిగతా 2లో..



జనవరి 25 నుంచి జనగణన

ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ

నోటిఫికేషన్ జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో జనగణనకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ జరగనుంది. మార్చి 1 నుంచి 5 వరకు రివిజినల్ రౌండ్ నిర్వహిస్తారు. జనవరి 10 నుంచి 24 వరకు యాప్, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానంలో ప్రజలే స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం కూడా ఉంది. కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి విడతలో ఇళ్ల గణన పూర్తయింది. రెండో విడతలో జనాభా లెక్కల సేకరణ కోసం ఇప్పటికే సమావేశాలతో పాటు సిబ్బంది నియామకం, శిక్షణ ప్రక్రియ జరుగుతోంది.



హైదరాబాద్‌లో స్నోఫ్లేక్ జీసీసీ

- డేటా ఇంటెలిజెన్స్, ఏఐ, బిజినెస్ అనలిటిక్స్ రంగాల్లో సేవలు
- 275 మందికి ఉపాధి... 5 నుంచి 7 ఏళ్లలో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి
- లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి):అమెరికాలో ని జార్జియా రాష్ట్రం డులూత్ కేంద్రంగా ఎంటర్‌ప్రైజ్ డేటా ఇంటెలిజెన్స్, బిజినెస్ అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రం గాల్లో సేవలంది స్తున్న స్నోఫ్లేబీఐ హైదరా బాద్‌లో తన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేసింది. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా

మిగతా 2లో..



దిగొచ్చిన క్యాన్సర్ మందుల ధరలు

తగ్గిన 1364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్యాన్సర్ నివారణ మందుల కనీస ధరలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. 1,364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలు తగ్గా యి. దీని వల్ల పేషంట్లకు ఏటా రూ.3,540.38 కోట్లు ఆదా కానుంది. 6 70 బ్రాండ్ల ధరల్లో 50 శాతం కంటే ఎక్కువ తగ్గినట్లు

మిగతా 2లో..

కొత్త పాస్‌పోర్టు ఇవ్వండి



- బంగ్లాదేశ్‌కు హసీనా విజ్ఞప్తి
- మా దృష్టిలో హసీనా ఎప్పటికీ నేరస్థురాలే
- బంగ్లాదేశ్ న్యాయశాఖ మంత్రి అసదుజ్జమాన్ కీలక వ్యాఖ్యలు

2లో..

నాతో చర్చకు వస్తే ఒక్క జవాన్ ముందూ

మోదీ నిలబడలేరు



- 'దేశద్రోహి' ఆరోపణలపై రాహుల్ ఆగ్రహం
- తనతో బహిరంగ చర్చకు రావాలని మోదీకి సవాల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకల్లో తనపై, ప్రతిపక్షా లపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రా హుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. తమపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు రావా లని మోదీకి సోమవారం మరోసారి సవాల్ విసిరారు. ప్రధానికి గతంలో తాను విసిరిన సవాల్‌కు ఇంకా అలానే ఉందన్నారు. దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను భద్రతా సిబ్బంది నమ్మడం లేదని వారి ముఖ కవళికలు స్పష్టం చేశాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. కాగా, ఆదివారం ప్రధాని మోదీ బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రతి పక్షాలు దేశద్రోహులు, విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారాయంటూ ఆరోపిం చారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలపై రాహుల్ సోమవారం ఫైర్ అయ్యారు. దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్న వారు ఎవరు? అనే విషయంపై ప్రధాని మోదీ తనతో చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ఈ విష యంపై ఏ సమయంలోనైనా, ఏ వేదికపైనైనా మోదీతో చర్చకు తాను చర్చకు సిద్ధమేనని అన్నారు. తనతో చర్చ తర్వాత మోదీ ఒక్క జవాన్ ముందు కూడా నిలబడలేరని ఆరోపిం చారు. దీపావళి సందర్భంగా చేసిన ప్రసం గంలో ప్రధాని మోదీ చెప్పిన అబద్ధాలను జవాన్లు నమ్మలేదని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం ముప్పు ఇంకా తొలగిపోలేదని, 'దిమాగీ నక్సల్స్'

మిగతా 2లో..



కలెక్టర్‌కు జైలు శిక్ష

- విధిస్తూ హైకోర్టు సంచలన తీర్పు
- రూ.2 వేల జరిమానా విధింపు
- కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు ఆగ్రహం
- అఫిడవిట్‌లో తప్పుడు వివరాలపై ధర్మాసనం మండిపాటు
- శిక్ష అమలుపై నాలుగు వారాల స్టే జారీ

కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన కేసులో కలెక్టర్ సి. నారాయణరెడ్డికి హైకోర్టు సంచల్లో తీర్పు ఇచ్చింది. ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. శిక్షతో పాటు రూ.2,000 జరిమానా కూడా విధిస్తూ జస్టిస్ కె. లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ ఊరటనిచ్చారు.

5లో..



హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాతావరణ సదస్సు

- డిసెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో నిర్వహణ
- హాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులకూ ఆహ్వానం పంపే యోచన
- ఎల్ నినో సన్నద్ధత, హరిత పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో భాగంగా నిర్వహణ

హైదరాబాద్ (జనంసాక్షి):డిసెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాతావరణ సదస్సు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మం త్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'లో భాగంగా నిర్వ హించే ఈ సదస్సుకు దేశవిదేశాల వాతావరణ నిపు ణులతో పాటు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా ఉన్న హాలీవుడ్, బాలీవుడ్ సినీ ప్రముఖులను ఆహ్వా నించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సన్నద్ధత, వాతావరణ మార్పు లను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, హరిత పెట్టుబడులు సదస్సులో ప్రధాన చర్చాంశాలుగా ఉంటాయని పేర్కొన్నారు.సోమవారం సచివాలయం లోని తన కార్యాలయంలో సదస్సు ఏర్పాట్లపై మంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి భద్రత, వ్యవసాయం, ప్రజల జీవనోపాధిపై ఎల్ నినో చూపగల ప్రభావాన్ని సమగ్రంగా చర్చించా లన్నారు. వక్తల స్థాయి, చర్చల నాణ్యత, తెలంగా ణకు అంతర్జాతీయంగా లభించే గుర్తింపు, పెట్టుబడి అవకాశాలు, ముఖ్యంగా ఆచరణలో పెట్టగల నిర్ణయాల ఆధారంగా సదస్సు విజయాన్ని అంచనా వేయాలని సూచించారు.సమీక్షలో పర్యావరణ, అట వీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక

మిగతా 2లో..

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగా!?

దీనిని తుగ్లక్ పాలన కాకపోతే ఇంకేమి అనాలి?: కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి):

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగ్ నిర్వ హిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. డీపీ ఆర్ లేకుండానే ప్రాజెక్టులకు టెండర్లు పిలు స్తున్నారని ఆరోపించారు. కరవు పరిస్థితు ల్లోనూ బ్యూటిఫికేషన్ పనులపై ప్రభుత్వానికి అంత ప్రాధాన్యత ఎందుకు?అని ఎక్స్

మిగతా 2లో..



పండుగపూట అపశృతులు

దేశ్యాప్తంగా వేర్వేరు చోట్ల ప్రమాదాలు..

18 మంది సజీవదహనం

2లో..

ట్రంప్.. వలసదారులపై కఠినంగా వ్యవహరించా..



అలా చేసి ఉండాల్సింది కాదు

- అమెరికాకు చరిత్రలోనే ఇదొక భారీ వెనుకడుగు
- అయినా తిరిగి పుంజుకుంటాం.. గతంలో కన్నా మరింత గొప్పగా, బలంగా తయారవుతాం
- తన వలస విధానంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి):తన వలసవిధానంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిర్బంధాలు, బహిష్కరణలతో వలసదారులపట్ల తమ ప్రభుత్వం మరీ కఠినంగా వ్యవహరించిందని ఆయన అంగీకరించారు. మధ్యంతర ఎన్నికల్లో ఘోర ఓటమి నేపథ్యంలో ఆయన అమెరికా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది."నా వలస విధానం మరీ కఠినంగా ఉండి ఉండొచ్చు మరీ అంత కఠినంగా ఉండి ఉండాల్సింది కాదు. నేరగాళ్లను దేశం నుంచి వెళ్లగొట్టినందుకు మంచి మార్కులే పడ్డాయి. కానీ.. మంచి ఉద్యోగాలు చేస్తూ, పన్నులు కడుతూ, చిన్న చిన్న నిబంధనలు ఉల్లంఘించిన సామాన్యులపై కూడా అధికారులు చర్యలు తీసుకోవడం వల్ల నష్టం జరిగిందని భావిస్తున్నాను. అలాంటి వారి విషయంలో చట్టబద్ధత కల్పించేందుకు భవిష్యత్‌లో ఒప్పందం ఉండొచ్చు" అని ట్రంప్ వెల్లడించారు. అదే సమయంలో సరిహద్దును

మిగతా 2లో..

ఒప్పందం కుదిరి, హర్మూజ్ తిరిగి తెరుచుకుంటే..

ఇరాన్‌పై దాడులు ఉండకపోవచ్చు: ట్రంప్

2లో..

ఆగని ఖాకీల అవినీతి దందా

రూ.2 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కీసర ఎస్ఐ

మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఛార్జి షీట్ విషయంలో ఓ వ్యక్తికి అనుకూలంగా మార్చేం దుకు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ కొండారెడ్డి శ్రీని వాస్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుం టుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ వివరాలను హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ వెల్లడించారు. మేడ్చల్ ప్రతినిధి (జనంసాక్షి):



12లో..



88 రోజులు గడిచినా ప్రొరోగ్ ప్రకటనేది?

డీలిమిటేషన్ బిల్లు నెగ్గించుకోవడం కోసమే ఆలస్యం.. బీజేపీపై కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదాపడిన ప్పటికీ.. సమావేశాలు ముగిసినట్లు (ప్రొరోగ్ అయి నట్లు) మాత్రం ఇంకా ప్రకటన వెలువడలేదు. అలా గత 88 రోజులుగా పార్లమెంట్ వర్షాకాల సెషన్ ప్రొరోగ్ అవకుండా కొనసాగుతుండటం గమనార్హం. ఈ క్రమంలోనే 2008 నాటి రికార్డు బద్దలైంది. నాడు వరుసగా 87 రోజుల పాటు పార్లమెంట్ ప్రొరోగ్ అవలేదు.సాధారణంగా సభలను ఉభయ సభాపతులు నిరవధికంగా వాయిదా వేసిన రెండు మూడు రోజుల్లో సమావేశాలు ముగిసినట్లు రాష్ట్రపతి ప్రకటిస్తుంటారు. కానీ, ఈసారి మాత్రం ఆగస్టు 13 వ తేదీనే వర్షాకాల సమావేశాలు

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10.11.2026

నాతో చర్చకు వస్తే ఒక్క జవాన్ ముందూ మోదీ నిలబడలేరు!

పలు సంస్థలు, రాజకీయ పార్టీలలోకి చొరబడి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్న ప్రధాని మోదీ జవాన్లనుద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలో విపక్షాలపై మండిపడ్డారు. అడవుల నుంచి సాయుధ నక్సలైట్లను ఏరివేసినప్పటికీ, దిమాగీ నక్సల్స్ దేశానికి సవాల్‌గా నిలుస్తూనే ఉన్నారని అన్నారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే భద్రతా సిబ్బందికి గత ప్రభుత్వాలు స్వేచ్ఛను పరిమితం చేశాయని విమర్శించారు. తమ ప్రభుత్వం జవాన్లు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని కల్పించిందని పేర్కొన్నారు."దేశంలో నక్సలైట్లు అంతమయ్యారు. కానీ నక్సల్స్ ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. అడవుల్లో సాయుధ నక్సలైట్లు తుడిచిపెట్టుకుపోయినప్పటికీ, దిమాగీ నక్సల్స్ అనేక సంస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. నేటికీ వారు దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఈ దిమాగీ నక్సల్స్ అనేక రాజకీయ పార్టీల్లోకి, వివిధ సంస్థల్లోకి చొరబడ్డారు. మనం వారిని గుర్తించి ఓడించి, దేశ భద్రతను కాపాడుకోవాలి. గత ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో నక్సల్స్‌తో పోరాడుతున్న భద్రతా సిబ్బంది చేతులను కట్టేశాయి. నక్సలైట్లు దాడులకు పాల్పడినప్పుడు వారికి ధీటుగా సమాధానమిచ్చే స్వేచ్ఛ భద్రతా దళాలకు ఉండేది కాదు. మేము భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం" అని మోదీ వ్యాఖ్యానించారు.

ఒప్పందం కుదిరి, హర్మూజ్ తిరిగి తెరుచుకుంటే ఇరాన్‌పై దాడులు ఉండకపోవచ్చు: ట్రంప్

మూసివేయడంలో తమ ప్రభుత్వ పనితీరు బాగుందని, గత 17 నెలల్లో ఎవరూ అక్రమంగా ప్రవేశించలేదని పేర్కొన్నారు.తన విధానాలు కఠినంగా ఉన్నాయని ట్రంప్ స్వయంగా అంగీకరించి నప్పటికీ.. అమెరికా అధికారులు మాత్రం వలసల విషయంలో వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. ట్రంప్ ఇంటర్వ్యూ ఇచ్చిన సమయంలోనే

కొత్త పాస్‌పోర్టు ఇవ్వండి..

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆమె బంగ్లాదేశ్‌ను అభ్యర్థించారు. ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తన న్యాయవాది ద్వారా దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు ఓ లేఖను ఈమెయిల్ చేశారు. హసీనా పార్టీ 'అవామీ లీగ్' ఈ విషయాన్ని ధ్రువీకరించింది. లండన్‌లోని మ్యాట్రిక్స్ ఛాంబర్స్‌లోని తన న్యాయ ప్రతినిధుల ద్వారా కూడా ఆమె బంగ్లాదేశ్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.హసీనా సమర్పించిన దరఖాస్తుల ప్రామాణికతను, ఈ విషయంలో చట్టపరమైన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని బంగ్లాదేశ్ హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్ చెప్పినట్లు అధికారిక బీఎస్ఎస్ వార్తాసంస్థ తెలిపింది. ఆ పత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు హసీనాకు ఏదైనా చట్టపరమైన హక్కు ఉందా? అనే విషయాన్ని విదేశాంగ, న్యాయశాఖలు పరిశీలిస్తున్నాయని చెప్పారు. మరోవైపు.. హసీనా విజ్ఞప్తిని హాస్యాస్పదమైనదిగా విదేశాంగశాఖ సహాయమంత్రి హుమాయున్ కొబిర్ పేర్కొన్నారు. ఆమెకు మరణశిక్ష పడిందని, ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ పాస్‌పోర్టులను జారీ చేయదని వ్యాఖ్యానించారు. ఆమె నిజంగా స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే.. అప్పగింత ఒప్పందం కింద తనను అప్పగించమని భారత్‌ను కోరాలన్నారు.

మా దృష్టిలో హసీనా ఎప్పటికీ నేరస్థురాలే: బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయంపై బంగ్లాదేశ్ న్యాయశాఖ మంత్రి అసదుజ్జమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దోషిగా తేలిన హసీనాను భారత్ నుంచి స్వదేశానికి తిరిగి తీసుకురావడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే న్యూదిల్లీకి పలుమార్లు విజ్ఞప్తి లేఖలు పంపినట్లు తెలిపారు. అయినా ఎటువంటి సమాధానం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నా దృష్టిలో హసీనా ఒక నేరస్థురాలు. మా ట్రిబ్యునల్ ఆమెను దోషిగా నిర్ధారించింది. బంగ్లాదేశ్ ప్రజలలో ఇదే ఆమెకు ఉన్న గుర్తింపు.హసీనాను ఎప్పటికైనా, ఎలాగైనా బంగ్లాదేశ్‌కు తీసుకువస్తాం. తగినశిక్ష విధిస్తాం. కానీ ఈ విషయంలో న్యాయ శాఖకు ప్రత్యక్ష ప్రమేయం ఉండదు. ఎందుకంటే ఆమె మరో దేశంలో ఉన్నారు కాబట్టి దీనిని హోం మంత్రిత్వ శాఖ చూసుకుంటోంది. ఒకవేళ వారు ఆమెను మాకు అప్పగిస్తే ఎటువంటి భావోద్వేగాలకు తావులేకుండా ఈ విషయాన్ని చట్టప్రకారం పరిష్కరిస్తాం. నిబంధనలు ఉల్లంఘించేలా మేం ఏమీ చేయబోం' అని అసదుజ్జమాన్ పేర్కొన్నారు.

యుద్ధం ముగించే అన్ని ప్రయత్నాలకు సహకరిస్తాం

ఉక్రెయిన్- రష్యా శాంతి చర్చల వేళ జెలెన్‌స్కీకి మోదీ ఫోన్



న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి సంబంధించిన ఇటీవలి పరిణామాలను, తమ వైఖరిని ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ వివరించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించే లక్ష్యంతో చేసే అన్ని ప్రయత్నాలకు సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ తెలియజేశారని పేర్కొంది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలన్న వైఖరిని ఆయన పునరుద్ఘాటించారని తెలిపింది.అదేవిధంగా భారత్- ఉక్రెయిన్ మధ్య వివిధ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జెలెన్‌స్కీ, ప్రధాని మోదీ చర్చించుకున్నట్లు వెల్లడించింది. ఉక్రెయిన్ రష్యాల మధ్య శాంతి చర్చలు త్వరలోనే మళ్లీ మొదలుకానున్న వేళ ఇరువురు నేతలు మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా.. రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు తమ మధ్యవర్తిత్వంలో ఈ నెల 10, 11 తేదీల్లో అబుధాబీ వేదికగా శాంతి చర్చలు జరుగుతాయని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

మోదీ ఇప్పటికే పలుమార్లు చెప్పారు: జెలెన్‌స్కీ

మరోవైపు.. యుద్ధాన్ని ముగించేందుకు ఇదే సరైన సమయమని ప్రధాని మోదీ ఇప్పటికే పలుమార్లు చెప్పారని, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా నేరుగా ఈ మాట అన్నారని జెలెన్‌స్కీ గుర్తుచేశారు. మోదీతో ఫోన్ సంభాషణపై ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. "నల్ల సముద్రం ద్వారా ధాన్యం ఎగుమతులను రష్యా అడ్డుకోవడం గురించి మేం చర్చించాం. ఫుడ్ కారిడార్లను ఏర్పాటు చేయడంలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. సముద్ర మార్గాల దిగ్బంధనంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడటంతోపాటు కోట్లాది మంది ప్రజలు బాధపడుతున్నారనే విషయాన్ని రష్యా అర్థం చేసుకోవాలి" అని తెలిపారు.



కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఆడబిడ్డల ఆనందంలో తోడుగా ఉండాలని, ఒక సోదరుడిగా మీకు సేవ చేసే అవకాశం భగవంతుడు నాకు కల్పించారు. ఆడబిడ్డల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తా. ఈరోజు నా పుట్టిన రోజును మహిళా శక్తికి అంకితం చేస్తున్నా. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే నా జన్మ ధన్యమైనట్టే. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెడితే రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టినట్టే.." అని పేర్కొన్నారు. మీరే నా కుటుంబం. మీరేనాఆత్మబంధువులు మహిళలు ఉక్కు సంకల్పంతో ఆశీర్వదించారు కాబట్టే నాకు తెలంగాణ ముఖ్యమంత్రి హోదా, గౌరవం దక్కింది. నా సర్వశక్తులు ధారపోసి ప్రతి నిమిషం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంగా కార్యాచరణ తీసుకుని ముందుకు నడుస్తానని మాట ఇస్తున్నానని అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 70 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని పేర్కొంటూ, 2034 నాటికి ఆ సంఖ్యను కోటికి పెంచడమే కాకుండా వారందరినీ కోటీశ్వరులను చేయాలన్నదే తన జీవిత లక్ష్యమని ప్రకటించారు. ఆడబిడ్డ నిలబడితే కుటుంబం నిలబడుతుందని, అందుకే ప్రభుత్వం ప్రతి పథకం మహిళల పేరుతోనే అందజేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 25.5 లక్షల మంది పిల్లలకు రెండు జతల చొప్పున స్కూల్ డ్రెస్సులను కుట్టే పనులను మహిళలకు శిక్షణ ఇచ్చి, ఆ పనులను అప్పగించామని గుర్తుచేశారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించామని, సచివాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను మహిళలకు అప్పగించామని చెప్పారు. గడిచిన 34 నెలల కాలంలో మహిళా సంఘాలకు రూ. 79 వేల కోట్ల రుణాలపై బ్యాంకు లింకేజీ ఇచ్చామని, ఆ రుణాలపై ప్రభుత్వం రూ. 1,900 కోట్ల మేర వడ్డీ చెల్లించిందని తెలిపారు. రాష్ట్రంలో మంజూరు చేసిన 8.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను కూడా ఆడబిడ్డల పేరుతోనే అందజేశామని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్.. ఇలా ఏ పథకమైనా ఆడబిడ్డల పేరిటే ఇచ్చామని గుర్తుచేశారు. ఆడబిడ్డలు ప్రయాణ చార్జీలు నెలకు రూ. 8 నుంచి రూ. 10 వేల మేరకు ఆదా చేసుకోవాలన్న ఉద్దేశంతో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటివరకు మహిళలు 37 లక్షల ప్రయాణాలు ఉచితంగా చేయగా అందుకు ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 13 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా మహిళల కోసం ఇన్ని పథకాలు అమలు చేయలేదన్నారు. నా అభివృద్ధికి చేయూతనిచ్చిన మీ అందరి మధ్యన పుట్టిన రోజు జరుపుకోవాలని ఇక్కడకు వచ్చానని అన్నారు. ఈ ప్రభుత్వం మీది. మీకోసమే ఆలోచన చేస్తుందన్నారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ గారి జయంతి రోజున కోటి మంది ఆడబిడ్డలకు సారెగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం బలోపేతం కావాలంటే మహిళలు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి అన్నారు. బొమ్రాస్పేట్ .హకీంపేట్. దుద్యాల. బాలంపేట . కొడంగల్ లో సర్కిల్ ఆఫీస్. పోలీస్ స్టేషన్ భవనం ప్రభుత్వ జూనియర్ కళాశాల. సమీకృత మండల కార్యాలయం. పాఠశాల భవనం ఆరోగ్య ఉప కేంద్రమును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎకో పామాయిల్ పరిశ్రమ. రేడియల్ కు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమం లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రులు దామోదర రాజనర్సింహ తుమ్మల నాగేశ్వరరావు ధనసరి అనసూయ సీతక్క జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరి , ప్రభుత్వ సలహాదారు . సుదర్శన్ రెడ్డి , ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , మల్లు రవి తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన అప్పులకు మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు చెల్లించాం

మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకువచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వాన్ని విమర్శించారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో మూడోరోజూ పర్యటన కొనసాగించారు.పాలమూరు నుంచి ఎంపీగా

తెలంగాణ వచ్చినా.. పాలమూరు వలసలు ఆగలేదు

గెలిచిన కేసీఆర్ జిల్లా రుణం తీర్చుకుంటారని ఆశించామని, పాలమూరు జిల్లా నుంచి పోటీ చేసి కేసీఆర్ సీఎంగా గెలవాలని ఆశించారన్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మన గుండెల మీద తన్ని నట్టేట్లో ముంచి కృష్ణా నదిలో కలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలమూరు జిల్లా ప్రజల గుండెల మీద తన్ని గజ్వేల్‌కు వెళ్లారని, నాడు సాధించిన మక్తల్-నారాయణపేట ప్రాజెక్టును కేసీఆర్ పక్కన పెట్టారని విమర్శించారు. వికారాబాద్? జిల్లా లగచర్ల బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు.తెలంగాణ వచ్చినా పాలమూరు వలసలు ఆగలేదని, కొడంగల్‌లో కల్తీ కల్లు తాగడం తప్పలేదని, కందులు పండించడం తప్ప మరో పంట వేయడం మనకు తెలియలేదని సీఎం పేర్కొన్నారు. 2023లో ముక్కోటి దేవతలు ఏకమై కొడంగల్ ప్రజల మొక్కులు తీర్చారని, దేశం గర్వించే విధంగా సీఎం హోదా కొడంగల్ శాసనసభకు దక్కిందని వ్యాఖ్యానించారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ పథకాన్ని అడ్డుకుంటా మని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రాజెక్టు పనులు చేపడుతుంటే మీకు ఎందుకు కడుపు మంట అని నిలదీశారు. సీఎంగా ప్రమాణం చేశాక ఒక్క రోజైనా సెలవు తీసుకోకుండా పని చేస్తున్నానని స్పష్టం చేశారు.

కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి హితువు

కేటీఆర్‌కు గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టిందని, బుద్ధి ఇవ్వడానికి ఎన్నేళ్లు పడుతుందో అని, గడ్డం పెంచినా, పది జన్మలు ఎత్తినా, ఎన్నటికీ రేవంత్‌రెడ్డి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి కావాలంటే గుండె ధైర్యం, నమ్మినవారికి ప్రాణమిచ్చే త్యాగం ఉండాలన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం మూడోరోజూ పర్యటన కొనసాగించారు. ముందుగా కొడంగల్‌లోని నివాసం నుంచి ముఖ్యమంత్రి దుద్యాల మండలం పోలేపల్లికి చేరుకున్నారు. అక్కడ పోలేపల్లి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్రగా లగచర్ల బహిరంగసభా స్థలికి చేరుకున్నారు. సభావేదికగా రూ.9 వేల 50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎకో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ, నాచారం గ్రామం నుంచి కొత్వాల్‌గూడ రేడియల్ రోడ్-2 సహా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

హైదరాబాద్‌లో స్ప్లాష్‌బీఐ జీసీసీ

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం నగరంలో 515కు పైగా జీసీసీలు ఉండగా, వాటిలో మూడు లక్షల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారన్నారు. గతేడాది దేశంలోనే అత్యధికంగా 70కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించాయన్నారు. వచ్చే ఏడాదిలో కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా... ప్రపంచ స్థాయి ఉత్పత్తుల రూపకల్పన, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ప్రొడక్ట్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లోనూ కీలక పాత్ర పోషించేలా వాటిని ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. స్ప్లాష్‌బీఐ ప్రపంచవ్యాప్తంగా 39 దేశాల్లో 500కు పైగా ఎంటర్‌ప్రైజ్ సంస్థలకు సేవలందిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే 5 నుంచి 7 ఏళ్లలో హైదరాబాద్ లో 100 మిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా డేటా ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్ తో పాటు స్ప్లాష్ ఏఐ సామర్థ్యాలనూ అభివృద్ధి చేస్తుందని, ఇక్కడ కొత్తగా 275 మంది నిపుణులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్ప్లాష్‌బీఐ సీఈఓ నవీన్ మిగ్లానీ, ప్రెసిడెంట్, సీటీఓ కిరణ్ రెడ్డి పాశం తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన క్యాన్సర్ మందుల ధరలు

కేంద్రం పేర్కొంది. ఎంఆర్‌పీలో అత్యధికంగా 96.45 శాతం తగ్గింపు ఉందని తెలిపింది జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) సిఫార్సుల మేరకు 137 రకాల క్యాన్సర్ ఔషధాలపై ట్రేడ్ మార్జిన్లను పరిమితం చేసినట్లు రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఇప్పటికే వెల్లడించింది. సవరించిన ఔషధ ధరల జాబితాలను రిటెయిలర్లు, డీలర్లు, ఆసుపత్రులు తమ ప్రాంగణాల్లో, వెబ్‌సైట్లలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న విషయాన్ని రాష్ట్రాల ఔషధ నియంత్రణ అధికారులు పర్యవేక్షిస్తారు. ఎన్‌పీపీఏ వెబ్‌సైట్‌లో ధరలు చూసుకుని, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత హెల్ప్‌లైన్ నంబర్ల (1800-111-255) ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగా!?

వేదికగా ప్రశ్నించారు. దీనిని తుగ్లక్ పాలన కాకపోతే ఇంకేమి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళ్తున్న ఆయన్ని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి ఇది నిదర్శనమన్నారు.

పండుగపూట అపశృతులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

దీపావళి పండగ వేళ పలు చోట్ల చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలు రోడ్డు ప్రమాద ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపాయి. మధ్యప్రదేశ్‌లో రెండు ఇళ్లల్లో మంటలు చెలరేగి 12 మంది ప్రాణాలు కోల్పోగా.. యూపీలో ఓ కారు దగ్ధమై ఆరుగురు సజీవదహనమయ్యారు. మధ్యప్రదేశ్‌లోని సివానీ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక నగల వ్యాపారి అయిన కుందన్‌లాల్ సోనికి చెందిన మూడంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఘటన సమయంలో ఇంట్లో 10 మంది ఉండగా.. కుందన్‌లాల్, ఆయన భార్య సహా ఆరుగురు సజీవదహనమయ్యారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. ఇక కట్నీ జిల్లాలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఓ భవనంలో మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మరణించారు. ఈ భవనంలోని ఒక అంతస్తులో పూరన్ అగర్వాల్ బాణసంచా దుకాణం నిర్వహిస్తుండగా.. పైఅంతస్తులో ఆయన కుటుంబం నివాసం ఉంటోంది. నిన్న రాత్రి దుకాణంలో చెలరేగిన మంటలు భవనమంతా వ్యాపించి పూరన్, ఆయన భార్య, కోడలితో పాటు ఇద్దరు మన వరాళ్లు, రెండు నెలల మనవడు సజీవదహనమైనట్లు పోలీసులు వెల్లడించారు.

హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాతావరణ సదస్సు

ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, అటవీ శాఖ ప్రధాన సంరక్షణాధికారి వినయ్‌కుమార్, టీజీ ట్రాన్స్‌కో మేనే జింగ్ డైరెక్టర్ డి. కృష్ణభాస్కర్‌తో పాటు పలువురు ఉన్న తాధికారులు పాల్గొన్నారు.ఎల్ నినోపై ముందస్తు సన్న ద్ధతఎల్ నినో ప్రభావంతో వర్షాభావం దీర్ఘకాలం కొన సాగడం, నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతలు, సాగుకు ఇ బ్బందులు వంటి పరిణామాలకు రాష్ట్రం ముందుగానే సిద్ధం కావాలని మంత్రి చెప్పారు. తాగునీరు, విద్యుత్ అవసరాలు పెరిగే అవకాశాన్నీ దృష్టిలో ఉంచుకోవాల న్నారు. వేసవి తీవ్రంగా ఉండే నెలల్లో కరువు ప్రభావా న్ని తగ్గించేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు నెలకు దాదాపు రూ.1,000 కోట్లు సమీకరిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని గుర్తుచేశారు. రాష్ట్ర సన్నద్ధతను మెరుగుపరిచేందుకు శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా సుస్థిరమైన దీర్ఘకాలిక వ్యూహాలు రూపొందించాలని సూచించారు.వేసవిలో కీలకమైన మార్చి నుంచి మే వరకు తాగునీరు, పశు గ్రాసం అందుబాటులో ఉంచడం, కరువు ప్రభావానికి ఎక్కువగా గురయ్యే వర్గాలను ఆదుకోవడం వంటి అంశాలపై సదస్సులో చర్చకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రముఖులను ఎంపిక చేసి, సంబంధిత సంస్థలు, దౌత్య మార్గాల ద్వారా వారిని ఆహ్వానించాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రతిపాదిత ఆహ్వానితుల్లో రాజేంద్ర సింగ్, సునీతా నారాయణ్, సద్గురు, నార్వే మాజీ పర్యావరణ మంత్రి ఎరిక్ సోల్హెమ్ ఉన్నారు. పర్యావరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సినీనటి దియా మీర్జాను సదస్సు పరిచయ కార్యక్రమానికి ఆహ్వానించే అవకాశాన్ని పరిశీలించాలని మంత్రి కోరారు.కేంద్ర మంత్రులు, దేశీయ రాజకీయ, పర్యావరణ రంగాల ప్రముఖులతో పాటు నార్వే, డెన్మార్క్, స్వీడన్ తదితర దేశాల రాయబారులను ఆహ్వానించే ప్రతిపాదన ఉంది. చర్చలకు తమ అనుభవంతో తోడ్పడగల, సదస్సుకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురాగల వ్యక్తులకు ఆహ్వానాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు.హరిత పెట్టుబడులపై ప్రత్యేక చర్చవాతావరణ సమస్యలకు పరిష్కారాలను అందించే వ్యాపారాలు, పెట్టుబడి అవకాశాలపై సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. వాయు కాలుష్య నియంత్రణ, పునరుత్పాదక ఇంధనం, వాతావరణ చర్యలకు నిధుల సమీకరణ, జల సంరక్షణ, హరిత సాంకేతికతలు, సుస్థిర మౌలిక వసతులు, వ్యర్థాల నుంచి సంపద సృష్టి వంటి అంశాలను ఈ చర్చల్లో భాగం చేయాలన్నారు.భూగర్భజలాల పునర్భరణ, క్షీణించిన భూముల పునరుద్ధరణ, సూక్ష్మ సేద్యం, నేల సంరక్షణ, తక్కువ నీటితో ఉద్యాన పంటల సాగులో విజయవంతమైన నమూనాలను సదస్సులో ప్రదర్శించాలని సూచించారు. మణికొండలో ఓ నివాస సముదాయం చేపట్టిన భూగర్భజలాల పునర్భరణ కార్యక్రమాన్ని, కాన్హా శాంతివనంలో చేపట్టిన మొక్కల పెంపకం, నేల సంరక్షణ పనులను ఉదాహరణలుగా ప్రస్తావించారు.నవంబరు 28న క్షేత్రస్థాయి సంప్రదింపులువాతావరణ మార్పులతో నేరుగా ప్రభావితమవుతున్న ప్రజల అనుభవాలు, అవసరాలు సదస్సు చర్చల్లో ప్రతిబింబించేలా నవంబరు 28న క్షేత్రస్థాయి సంప్రదింపుల సమావేశం నిర్వహించాలని మంత్రి ప్రతిపాదించారు. వివిధ వర్గాలకు చెందిన సుమారు 100 మంది ప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానించాలని సూచించారు.రెండు రోజుల సదస్సుకు ప్రతిపాదనఅంతర్జాతీయ సదస్సును రెండు రోజులపాటు నిర్వహించి, పరిమిత సంఖ్యలో సమావేశాలతో ప్రధాన అంశాలపై లోతైన చర్చకు అవకాశం కల్పించాలని మంత్రి సూచించారు. కరువు, ఎల్ నినో సన్నద్ధతతో పాటు నీటి భద్రత, వాతావరణ మార్పులను తట్టుకునే చర్యలు, అటవీ విస్తరణ, ఎడారీకరణ నివారణ వంటి అంశాలను సదస్సు కార్యసూచిలో చేర్చాలని పేర్కొన్నారు.

అమెరికా ఇమిగ్రేషన్ విధానాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన స్టీఫెన్ మిల్లర్ కీలక ప్రకటన చేశారు. మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ.. దేశంలో నేరాలకు పాల్పడే అక్రమ వలసదారులను ఏరివేసే ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం మిల్లర్‌ను వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా అధ్యక్షుడు నియమించిన సంగతి తెలిసిందే.

అమెరికాకు చరిత్రలోనే భారీ వెనుకడుగు: ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ప్రతికూల ఫలితాలు రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల ఫలితాలతో అమెరికా.. చరిత్రలోనే భారీ వెనుకడుగు వేసిందని పేర్కొన్నారు. తన హయాంలో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్ కూడా.. ఈ ఎన్నికల ఫలితాల కారణంగా ఒక్క రోజులోనే 3 ట్రిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసిందని చెప్పారు. కానీ ఏమాత్రం భయపడాల్సిన అవసరం

ఛ్ఛ్.. వలసదారులపై కఠినంగా వ్యవహరించా..

లేదని.. తాము తిరిగి పుంజుకుంటామని, గతంలో కన్నా మరింత గొప్పగా, బలంగా తయారవుతామని 'ట్రూత్ సోషల్' వేదికగా ధీమా వ్యక్తం చేశారు.

ఒప్పందం కుదిరి, హర్మూజ్ తిరిగి తెరుచుకుంటే ఇరాన్‌పై దాడులు ఉండకపోవచ్చు: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):మధ్యంతర ఎన్నికల్లో ఓటమికి దారితీసిన పలు అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్‌పై మళ్లీ దాడులు పునఃప్రారంభించకపోవచ్చని తాజాగా చెప్పారు. ప్రస్తుతం యుద్ధాన్ని ముగించేలా ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. అదే సమయంలో యుద్ధం చేసే ఆప్షన్‌ను కూడా తన వద్ద ఉంచుకున్నట్లు హెచ్చరించారు. "ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో ఒప్పందం కుదిరి, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే.. మళ్లీ ఆ దేశంపై దాడులు జరిగే అవకాశం చాలా తక్కువ. అదే సమయంలో చర్చలు విఫలమైతే మళ్లీ దాడులకు వెనకాడబోం. మా వద్ద మూడు విమాన వాహక నౌకలు సిద్ధంగా ఉన్నాయి. గంటల వ్యవధిలో ఇరాన్‌లో 38 వంతెనలను ధ్వంసం చేయగలం" అని ట్రంప్ వెల్లడించారు. ఇటీవల ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం కోసం పలు ప్రయత్నాలు జరిగాయి ఆ ప్రయత్నాలు జరుగుతున్నప్పుడే అమెరికా దాడులు చేసింది. ఇటీవల మధ్యంతర ఎన్నికల్లో యూఎస్ కాంగ్రెస్‌లో డెమోక్రాట్లకే ఆధిపత్యం లభించింది. వారు ఉభయసభల్లో పట్టు సాధించడంతో ఈ యుద్ధాన్ని త్వరగా ముగించాలని రాజకీయంగా ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందన వచ్చింది. ఇరాన్ యుద్ధం ముగించడంలో ఖతార్ మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఘర్షణల ముగింపులో కొత్త ప్రతిపాదనలు చేస్తోంది. ఇలాంటి సమయంలో ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ థానీతో సోమవారం ట్రంప్ భేటీ కానున్నారు.

88 రోజులు గడిచినా ప్రొరోగ్ ప్రకటనేది?

ముగిసినా.. నేటి వరకు దీనిపై ముగింపు ప్రకటనేదీ రాలేదు. అంటే వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ఆర్టికల్ 85(1) కింద జారీ చేసిన ఉత్తర్వులు ఇప్పటికీ అమల్లో ఉన్నట్లే లెక్క. సమావేశాలు ఇంకా ముగియలేదని దీని అర్థం. రాష్ట్రపతి మళ్లీ 85(1) కింద పిలుపు ఇవ్వాల్సిన అవసరం లేకుండానే ఎప్పుడు కావాలంటే అప్పుడు సమావేశాలు నిర్వహించే అధికారం పార్లమెంటరీ వ్యవహారాలశాఖకు ఉంటుంది. మహిళా రిజర్వేషన్ల అమలు కోసమే కేంద్రం ఈసారి పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేయలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 నుంచి అమలు చేసేందుకు వీలుగా తేనున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు కోసం కేంద్రం త్వరలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నియోజకవర్గాల బిల్లును ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. సరిపడా సంఖ్యాబలం లేక నాడు ఆమోదం పొందలేదు. ఇది ఆమోదం పొందితే.. లోక్‌సభలో సభ్యుల సంఖ్య 543 నుంచి 850కి పెరుగుతుంది. కాగా.. గతంలోనూ పార్లమెంట్ పలుమార్లు ఇలా ప్రొరోగ్ అవకుండా సుదీర్ఘకాలం కొనసాగిన సందర్భాలున్నాయి. 2008లో నాటి యూపీఏ ప్రభుత్వంపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు జులై 21, 22న లోక్‌సభ రెండు రోజుల పాటు సమావేశమైంది. ఆ తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ ప్రొరోగ్ అవలేదు. అనంతరం అక్టోబరు 17న తిరిగి సమావేశాలను ఏర్పాటు చేశారు. 1987లో 76 రోజులు, 1989లో 54 రోజులు, 2006, 2013లో 49 రోజులు, 1963లో 41 రోజుల పాటు పార్లమెంట్ ప్రొరోగ్ అవకుండా కొనసాగింది. ఈ సారి మాత్రం పాత రికార్డులను బద్దలు కొట్టింది.

డీలిమిటేషన్ బిల్లు నెగ్గించుకోవడం కోసమే ప్రొరోగేషన్ ఆలస్యం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా ఇంకా సెషన్‌ను ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. మోదీ ప్రభుత్వం, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రమాదకరమైన, వినాశకరమైన డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవడం కోసమే ప్రభుత్వం ఈ జాప్యం చేస్తోందని మండిపడింది. లోక్‌సభలో ఎలాగైనా అక్రమ పద్ధతిలో మూడింట రెండొంతుల మెజారిటీని సంపాదించడానికి అమిత్ షాకు సమయం ఇవ్వడానికే 88 రోజులైనా సెషన్‌ను ప్రొరోగ్ చేయలేదని ఆరోపించింది. ఈ మేరకు జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత ఆరు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీకి నాలుగు సార్లు లేఖలు రాశారని జైరాం రమేశ్ తెలిపారు. అయినా ప్రధాని మోదీ అందుకు మొండిగా నిరాకరిస్తున్నారని ఆరోపించారు. భారత పార్లమెంటరీ విధానాలపై ప్రామాణిక గ్రంథమైన 'కౌల్ అండ్ శక్ధేర్' 8వ సంచికలోని 192వ పేజీలో లోక్‌సభ నిరవధిక వాయిదాకు, సమావేశాల ప్రొరోగ్‌కు మధ్య సాధారణంగా 2-4 రోజుల వ్యవధి ఉంటుందని వెల్లడించారు. కానీ అదే పేజీలోని ఫుట్ నోట్ 53లో సెషన్ ప్రొరోగ్ గరిష్ఠ వ్యవధి 28 రోజులుగా ఉందని, అది కూడా 2015 నాటి వర్షాకాల సమావేశాలకు సంబంధించినదని స్పష్టం చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



లక్ష్మణచందా, నవంబర్ 9 (జనం సాక్షి): లక్ష్మణచందా మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన రైతు పుట్టి గంగాధర్ (50) ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. పార్‌పెల్లి గ్రామానికి చెందిన పుట్టి గంగాధర్, తండ్రి నరసయ్య, గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నవంబర్ 7వ తేదీన మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో తన ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. అనంతరం వాంతులు చేసుకుంటుండగా గమనించిన ఆయన పెద్ద కుమారుడు వెంటనే నిర్మల్ పట్టణంలోని తిరుమల నర్సింగ్ హోమ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో గంగాధర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైతు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మెమోలకే పరిమితమైన మైనారిటీ సంక్షేమ దినోత్సవం

ఏటా ఉత్తర్వులు.. ఆచరణలో మాత్రం శూన్యం

- నవంబర్ 11న నిర్వహణకు మరోసారి మెమో జారీ
- అధికారిక వేడుకలకు నోచుకోని మౌలానా ఆజాద్ జయంతి
- ప్రభుత్వానికి వినతులు చేసినా మారని తీరు
- రేవంత్ సర్కార్‌పై మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్ పాషా ఆగ్రహం



హైదరాబాద్ (జనంసాక్షి) : మైనారిటీల సంక్షేమంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ ప్రకటనలకే పరిమితమవుతోంది. ఏటా మెమోలు జారీ చేయడం తప్ప క్షేత్రస్థాయిలో అధికారికంగా వేడుకలు నిర్వహించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర మైనారిటీ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తాజాగా మెమో జారీ చేసినట్లు మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా తెలిపారు.ప్రతి ఏటా మెమోలు జారీ చేస్తూ చేతులు దులుపుకోవడం కాకుండా, అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా వేడుకలు నిర్వహించేలా శాశ్వత ఉత్తర్వులు జారీ చేయాలని గత నెలలో ప్రభుత్వానికి లేఖలు రాయడంతోపాటు సీఎం ప్రజావాణిలోనూ వినతిపత్రం అందించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించడం లేదని విమర్శించారు.గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయగా, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఆ స్ఫూర్తిని కొనసాగించడం లేదని యాకుబ్ పాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. మైనారిటీల పట్ల చిన్నచూపు వీడి, మెమోలకే పరిమితం కాకుండా ఆచరణలో చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు.

కేశాపూర్ కామును గుట్టపై మళ్లీ భూదందా!

- 42 ఎకరాల గుట్ట భూమిపై కన్నేసిన రియల్టర్లు ఎవరు?



ఎల్కతుర్తి (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశాపూర్ గ్రామ శివారులోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన కామును గుట్ట భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గుట్ట భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలు, సరిహద్దుల వివాదాలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఈ భూవివాదం మళ్లీ తెరపైకి రావడంతో అసలు గుట్ట భూముల పరిస్థితి ఏమిటి? రెవెన్యూ రికార్డుల్లో ఎవరి పేర్లు ఉన్నాయి? క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాల వెనుక వాస్తవాలు ఏమిటి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సర్వే నంబర్ 448లో కామును గుట్టతో కలిపి సుమారు 42 ఎకరాల భూమి, సర్వే నంబర్ 449లో మరో 11 గుంటల భూమి ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఈ భూములకు సంబంధించిన యాజమాన్య హక్కులు, పట్టా వివరాలు, ప్రభుత్వ భూమి స్వరూపంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఈ భూముల విషయంలో కొందరు రియల్టర్లు, పట్టాదారుల మధ్య లావాదేవీల ప్రయత్నాలు జరిగాయని, గుట్ట భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని అప్పట్లో ఆరోపణలు రావడంతో గ్రామస్తులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినట్లు తెలిపారు. కామును గుట్ట భూముల వ్యవహారంపై గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్డీఓ వెంకటరెడ్డి దృష్టికి గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంటున్నారు. అప్పట్లో అధికారులు విచారణ చేపట్టి, ప్రభుత్వ భూముల విషయంలో అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలు, ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. అప్పటి పోలీసు అధికారులు కూడా గుట్ట ప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణలకు పాల్పడవద్దని సూచించినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుతం మళ్లీ అదే భూముల వ్యవహారం తెరపైకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఆక్రమ బోర్లు తొలగించండి

- హైడ్రా ప్రజావాణికి 36 ఫిర్యాదులు

హైదరాబాద్ (జనంసాక్షి) : చెరువుల చెంత అక్రమ బోర్లను వెంటనే తొలగించాలని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సొంత అవసరాలకు అనేట్టు కొంతమంది ట్యాంకర్లు పెట్టుకుని.. రాత్రి పూట అక్రమ దందా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బోర్లతో నీళ్లను తోడేసి గృహవసారాలకు నీరందకుండా చేస్తున్నారని ఆరోపించారు. అలాగే రహదారులను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని పలువురు వాపోయారు. ఫిల్మ్‌నగర్ చెరువు పరిసరాల్లోని కౌషర్ కాలనీలో 30 ఫీట్ల రహదారిపై అక్రమ కట్టడాలు వస్తున్నాయని వాటిని తొలగించి దారి చూపాలని అక్కడి నివాసితులు హైడ్రాను కోరారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ విలేజ్ సర్వే నంబరు 23లో 2.38 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని .. ప్రహరీలు నిర్మించుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మియాపూర్, శ్రీ లక్ష్మీనగర్ కాలనీలోని నాయనమ్మకుంట లేక్ పరిసరాల్లో ఆక్రమణలు బాగా జరుగుతు న్నాయని వెంటనే హైడ్రా రంగంలోకి దిగి ఫెన్సింగ్ వేసి కాపాడాలని కోరారు. శేరిలింగంపల్లి నెక్నాంపూర్ విలేజ్ సర్వే నంబరు 31లో బాపు హిల్స్ కాలనీలో రహదారిని ఆక్రమించి ఇళ్లు, వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ విలేజ్, గాయత్రి హిల్స్ కాలనీలో నివాసాల మధ్య టపాసుల దుకాణంతో పాటు.. స్టాక్ పాయింట్ నిర్వహిస్తున్నారని అక్కడి స్థానికులు ఫిర్యాదు చేశారు. కీసర మండలం తుమ్మలకుంట చెరువు నుంచి భారీ మొత్తంలో బోర్ల ద్వారా నీటిని తోడేసి అమ్ముకుంటున్నారని.. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలు కూడా జరుగుతున్నాయని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

జిల్లాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు

మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు వారి జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ఈ హాస్పిటళ్లలో మౌలిక సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్య సేవలు, అవసరమైన వైద్య సిబ్బంది, డయాగ్నస్టిక్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రోగులు చిన్న చిన్న సమస్యలకు కూడా హైదరాబాద్‌కు, మెడికల్ కాలేజీ హాస్పిటళ్లకు వెళ్లే పరిస్థితి తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. సెక్రటేరియట్‌లో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పునర్వ్యవస్థీకరణపై సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడారు. డీఎస్‌హెచ్ పునర్వ్యవస్థీకరణపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా రూపొందించిన అధ్యయన నివేదికలోని ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. డీఎస్‌హెచ్ పరిధిలోని హాస్పిటళ్లలో ఇటీవలే 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేశామని, అవసరమైన మేర నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టామని మంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాల ఫలితాలు ప్రజలకు అందాలంటే ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఏ హాస్పిటల్‌లో ఏ స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి? ఇంకా ఏయే విభాగాల్లో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవసరం ఉంది? ఏయే వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాల్సి ఉంది? అనే అంశాలపై హాస్పిటల్ వారీగా సమగ్ర సమీక్ష చేపట్టాలని ఆదేశించారు. స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నప్పటికీ అవసరమైన పరికరాలు, సిబ్బంది లేక వైద్య సేవలు అందించలేని పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. 30 పడకలు, 50 పడకలు, 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన హాస్పిటళ్లకు వాటి స్థాయికి అనుగుణంగా వైద్య సేవల పరిధిని నిర్ణయించాలని మంత్రి సూచించారు. సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాల్సిన స్పెషాలిటీ విభాగాలు, వైద్య సేవలు, పడకలు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, ఇతర సదుపాయాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని సెకండరీ హెల్త్ కేర్ హాస్పిటళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ప్రతి హాస్పిటల్‌లో అవసరమైన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, మందులు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది, మంజూరై పోస్టులు, ఐపీహెచ్‌ఎస్ ప్రమాణాల ప్రకారం అవసరమైన సిబ్బంది సంఖ్యను పోల్చి చూసి, లోటుపాట్లను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న పోస్టులను అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడంతో పాటు, అదనంగా అవసరమైన పోస్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించిన మంత్రి, రాష్ట్రస్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పరిపాలనా బాధ్యతలు ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలోని హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. హాస్పిటళ్లలో రోగులకు ఎదురవుతున్న సమస్యలు, వైద్య సేవల్లో లోటుపాట్లు, సిబ్బంది అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రముఖ అంకాలజిస్ట్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేశ్ దత్ ఎక్కా, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్. చొంగ్తు, ఆర్థికశాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ, ఆస్మి డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బగూడలో ఘోర అగ్నిప్రమాదం

- ఇల్లు బూడిదవడంతో రోడ్డున పడ్డ కుటుంబం
- నగదు, దాచుకున్నబంగారం వెండి బుగ్గిపాలు
- ఆదుకోవాలని కన్నీరుమున్నీరవుతున్న బాధితుడు మోహన్



సిర్పూర్ టి నవంబర్ 09 (జనంసాక్షి): మండలంలోని దుబ్బగూడ గ్రామంలో సోమవారం ఒక కుటుంబం అగ్నిప్రమాదం కారణంగా సర్వస్వం కోల్పోయి రోడ్డున పడింది. దుబ్బగూడ గ్రామానికి చెందిన ఎలుములే మోహన్ ఇల్లు, ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయి పూర్తిగా కాలి బూడిదైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. ఇంట్లో నుండి అకస్మాత్తుగా మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై, సమయస్ఫూర్తితో స్పందించి మంటలను ఆదుపు చేయడంతో, పక్కనే ఉన్న ఇతర ఇళ్లకు మంటలు వ్యాపించకుండా చేయడం వలన పెద్ద ముప్పు తప్పింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రాణనష్టం తప్పింది. మోహన్ పిల్లలు హాస్టల్‌లో ఉండి చదువుకుంటుండగా, భార్యాభర్తలిద్దరూ ఉదయాన్నే వ్యవసాయ పనుల కోసం వెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మోహన్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ, అటు డ్రైవర్ గా చేసుకుంటూ కష్టపడి జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో జరిగిన అగ్నిప్రమాదం వారిని కోలుకోలేని దెబ్బ తీసింది. ఇంట్లో దాచుకున్న బంగారం, వెండితో పాటు, వసరాల కోసం అప్పుగా తెచ్చుకున్న రూ.2 లక్షల నగదు, భార్య పొదుపు చేసుకున్న డబ్బులు మొత్తం 5 లక్షలు వరకి కలిపోయాయి. ఇంట్లో ఉన్న ఏ ఒక్క వస్తువూ మిగలలేదు. ఒంటిమీద ఉన్న బట్టలు తప్ప మాకు ఏమీ మిగల్లేదు. పూర్తిగా రోడ్డున పడ్డామని, బాధిత కుటుంబ కన్నీరుమున్నీరవుతూ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక ఎస్సై వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును, కాలిపోయిన ఇళ్లను ఆయన నిశితంగా పరిశీలించారు. బాధితుడు మోహన్ కుటుంబ సభ్యులతో పాటు, స్థానికులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని, ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్థిక సహాయం చేయాలని బాధిత కుటుంబం దీనంగా వేడుకుంటోంది. స్థానిక అధికారులు వెంటనే స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అగ్గికి పూలదుకాణాలు మసి

- పూర్తిగా దగ్ధమైన పూల దుకాణాలు.. లక్షల్లో ఆస్తి నష్టం..
- రోడ్డున పడ్డ నిరుపేద పూల వ్యాపార కుటుంబాలు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి పట్టణంలోని గణేష్ చౌక్ వద్ద దీపావళి పండుగ రోజున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పండుగ పూట బాణాసంచాలు కాల్చడం వల్ల జరిగిందా, లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా తెలియదు కానీ ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల్లో పూల దుకాణాలకు వ్యాపించడంతో నాలుగు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దుకాణాల్లో నిల్వ ఉంచిన పూలు, పూల అలంకరణ సామగ్రి, ఇతర వ్యాపార వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. కళ్లముందే తమ జీవనాధారం మంటల్లో కాలిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఏళ్ల తరబడి పూల వ్యాపారాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఈ అగ్నిప్రమాదం తీరని నష్టాన్ని మిగిల్చింది. రోజువారీ వ్యాపారంతో కుటుంబాలను పోషించుకుంటున్న వారు ఒక్కసారిగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, వ్యాపార సామగ్రి క్షణాల్లో బూడిద కావడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ వారు సకాలంలో చేరుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది త్వరగా చేరుకొని ఉంటే కొంతమేరైనా నష్టాన్ని నివారించే అవకాశం ఉండేదని వాపోతున్నారు. అయితే అప్పటికే మంటలు తీవ్రంగా వ్యాపించి నాలుగు దుకాణాలు పూర్తిగా కాలిపోయాయని పేర్కొంటున్నారు. ఈ ప్రమాదంతో జీవనాధారం కోల్పోయిన పూల వ్యాపార కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలించి, నష్టపరిహారం అందించడంతోపాటు తిరిగి వ్యాపారాలు ప్రారంభించుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పూల వ్యాపారంతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమకు ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు..

పేదలకు కడుపునిండా నాణ్యమైన ఆహారం

- ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



కాటారం నవంబర్ 9 (జనం సాక్షి) : పేదలకు కడుపునిండా నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం కాటారం మండలం మేడిపల్లి గ్రామంలో గుండ్ల రమ ఇంట్లో నిర్వహించిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధిదారుల కుటుంబానికి కలుగుతున్న ప్రయోజనాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుని కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి, కలెక్టర్, ఎస్పి సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పేదల కడుపు నింపడంతో పాటు వారికి నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ధనవంతులు తినే బియ్యం నేడు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పేదలు తింటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పండుగ రోజు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారితో కలిసి భోజనం చేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. భోజనం ఎంతో రుచిగా ఉందని, సన్న బియ్యం నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల రాజ్యమని, ప్రతి పేద కుటుంబంలో ఆనందం నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యం తమ కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని, నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నందుకు మంత్రి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, గృహ నిర్మాణ శాఖ పిడి శ్రీకాంత్, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యులు దండు రమేశ్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని తిరుమల, సర్పంచ్ ప్రవల్లిక, సింగిల్ విండో చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య..



దస్తూరాబాద్, నవంబర్ 9 (జనంసాక్షి): దస్తూరాబాద్ మండలంలోని మున్యాల్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. అప్పుల బాధతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఎస్ ఐ సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మున్యాల్ గ్రామానికి చెందిన గాజుల భూమేష్ (20), తండ్రి రత్నయ్య కుటుంబ సభ్యులు సుమారు రెండేళ్ల క్రితం సోదరి వివాహం నిమిత్తం రూ. 7 లక్షల వరకు అప్పు చేశారు. ఆ అప్పు తీర్చేందుకు భూమేష్ ఏడాది క్రితం ఉపాధి కోసం బ్రహ్మాయిన్ వెళ్లి, ఇటీవల దసరా పండుగకు స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఇప్పటివరకు సుమారు రూ. లక్ష మాత్రమే చెల్లించామని, మిగిలిన అప్పు ఎలా తీర్చాలో అంటూ తరచూ కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడని తల్లి లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో నవంబర్ 9న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో తెలిపింది.మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ఎస్‌డిఆర్ ఎఫ్ కానిస్టేబుల్ విజయ్



వరంగల్ ఎంజీఎం నవంబర్ 9 (జనంసాక్షి): వరంగల్ చింతల్ బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వృద్ధుడిని సకాలంలో ప్రథమ చికిత్స అందించి, ప్రాణాపాయం నుండి తప్పించిన ఎస్డిఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 4వ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ (పిసి -348) పి.విజయ్.ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన పిసి విజయ్, తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్న బాధితుడికి తొలుత మానసిక ధైర్యాన్ని (మోరల్ సపోర్ట్) అందించారు. అనంతరం, బాధితుడి శరీరం నుండి అవుతున్న తీవ్ర రక్తస్రావాన్ని అత్యంత నైపుణ్యంతో అదుపు చేశారు. ప్రమాద సమయాల్లో అత్యంత కీలకమైన శ్వాసనాళాన్ని (ఎయిర్‌వే) తనిఖీ చేసి, బాధితుడి శ్వాస సజావుగా సాగేలా చూశారు. ఈ విధంగా బాధితుడి పరిస్థితిని పూర్తిగా స్థిరపరిచిన (స్టెబిలైజ్) అనంతరం, తదుపరి మెరుగైన ఉన్నత వైద్య సంరక్షణ కోసం బాధితుడిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు.

పేరు మార్పిడి

నా పాత పేరు న్యాతరి రూతు (భర్త: న్యాతరి నారాయణ, ఇ.నెం. 22, ఇందిరమ్మ కాలనీ, నిజాంపేట్, బాచుపల్లి మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా). ఆధార్ కార్డు ఆధారంగా నా పేరును న్యాతరి ఇందిర భర్త న్యాతరి నారాయణగా మార్చుకున్నాను. ఇకపై నా పేరు న్యాతరి ఇందిరగా చలామణి అవుతుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 నవంబర్ 2026

ప్రాణం కన్నా లాభమే ముఖ్యమా?

సంపాదకీయం

క్యాన్సర్ అనే మాట వినగానే ఇంట్లో నిశ్శబ్దం ఆవహిస్తుంది. ఆ తర్వాత మొదలయ్యేది వైద్యం కోసం పోరాటం కన్నా, డబ్బు కోసం పోరాటం. ఇల్లు తాకట్టు పెట్టేవారు, పొలం అమ్ముకునేవారు, బంధువుల వద్ద చేయిచాచేవారు ఎందరో. ఇలాంటి నేపథ్యంలో 1,364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలు తగ్గి, రోగులకు ఏటా రూ.3,540 కోట్లు ఆదా అవుతుందన్న వార్త ఊరట కలిగించేదే. కానీ ఆ ఊరటతో పాటు ఒక ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇంతకాలం ఈ భారాన్ని రోగులే ఎందుకు మోయాల్సి వచ్చింది?

670 బ్రాండ్ల ధరల్లో 50 శాతానికి మించి, కొన్ని మందుల్లో ఏకంగా 96.45 శాతం వరకు తగ్గింపు సాధ్యమైందంటే, ఇంతకాలం వసూలు చేసిన ధరల్లో ఎంత అనవసరపు లాభం దాగి ఉందో అర్థమవుతోంది. ప్రాణం కోసం పోరాడుతున్న మనిషి నిస్సహాయతను పెట్టుబడిగా మార్చుకోవడం వ్యాపారం కాదు, దోపిడీ. మందు కొనకపోతే మరణమే మిగులుతుందని తెలిసినవారికి, ఎంత ధర చెబితే అంత చెల్లించక తప్పదు. అలాంటి వారి జేబులు ఖాళీ చేయడం మానవత్వానికే మచ్చ.

137 రకాల క్యాన్సర్ ఔషధాలపై ట్రేడ్ మార్జిన్లను పరిమితం చేయడం ఆహ్వానించదగిన నిర్ణయమే. కానీ నిబంధన రాయడం ఎంత ముఖ్యమో, అది అమలవుతున్నదో లేదో చూడటం అంతకన్నా ముఖ్యం. ధరల జాబితాలను దుకాణాల్లో, ఆసుపత్రుల్లో, వెబ్‌సైట్లలో ప్రదర్శించాలన్న ఆదేశం కాగితాలకే పరిమితమైతే ప్రయోజనం శూన్యం. హెల్ప్‌లైన్ నంబర్ ఇచ్చి ఫిర్యాదు చేయమని చెప్పడం మంచిదే. కానీ చికిత్స మధ్యలో ఉన్న రోగి, ఆందోళనలో ఉన్న కుటుంబం ధరల పట్టికలు పట్టుకుని తిరగడం, ఉల్లంఘనలను పట్టుకోవడం ఎంతవరకు సాధ్యం? నిఘా బాధ్యత ప్రభుత్వానిదే కావాలి, బాధితులది కాదు.

అసలు ప్రశ్న ఇంకా లోతైనది. ఆరోగ్యం ప్రాథమిక హక్కు అని రాజ్యాంగం చెబుతుంది. జీవించే హక్కులో గౌరవప్రదమైన వైద్యం కూడా భాగమే. అయినా ప్రాణాంతక వ్యాధి సోకిన పేదవాడికి దేశంలో సరైన వైద్యం దక్కాలంటే, చేతిలో డబ్బు ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఉచిత వైద్యం అందించలేని వ్యవస్థలో, ఆ వ్యవస్థ నీడలో బతికే పౌరుడు తాను ఈ దేశ పౌరుడినని గర్వంగా ఎలా చెప్పుకోగలడు? పన్నులు కడుతూ, ఓట్లు వేస్తూ, చివరికి ప్రాణం నిలబెట్టుకోవడానికి అప్పుల పాలవడం పౌరహక్కుల ఖ్యాతికి విరుద్ధం.

ధరలు తగ్గించడం ప్రభుత్వం చేయాల్సిన పనుల్లో మొదటి అడుగు మాత్రమే. జనరిక్ మందులు అందరికీ అందుబాటులోకి రావాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స, పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా లభించాలి. మందుల ధరలపై శాశ్వత, పారదర్శక నియంత్రణ ఉండాలి. అతిగా వసూలు చేసిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యంపై ఖర్చును భారంగా కాక, దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలి.

మందుల కంపెనీలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. పరిశోధనకు, తయారీకి ఖర్చవుతుందన్నది నిజమే. కానీ లాభానికీ దోపిడీకీ మధ్య గీత గీసుకోవాల్సింది వారే. ఒక్క ఆదేశంతో సగానికి పైగా ధరలు తగ్గగలిగాయంటే, ఇంతకాలం ఆ గీత ఎక్కడ ఉందో ప్రశ్నించక తప్పదు.

ప్రాణం విలువ ధరపట్టికలో ఉండకూడదు. ఒక దేశం గొప్పతనం దాని ఆకాశహర్మ్యాల్లో, లెక్కల్లో కాదు, అత్యంత బలహీనుడిని అది ఎలా చూసుకుంటోందన్న దానిలో ఉంటుంది. ఆ ప్రమాణంలో మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఎప్పుడు?

జై కిసాన్ అంటారు.రైతే రాజు అంటారు.ఆచరణలో మాత్రం ఎమ్మెల్యేలు, మంత్రులు,ముఖ్య మంత్రులు,ప్రధాన మంత్రి, ప్రభుత్వ యంత్రాంగం (భ్యూరాక్రసీ) ప్రజలకు రాజు లాగా వ్యవహరిస్తూ సుఖ సంతోషాలను అనుభవిస్తున్నారు.రైల్వే, బొగ్గు, విద్యుత్ , ఆర్టీసీ మొదలగు ప్రజా రవాణా,ఉత్పత్తి, ఉత్పాదక పారిశ్రామిక సంస్థలు నిరంతరాయ ఉత్పత్తి గురించి అహర్నిశలు శ్రమిస్తారు.అలాగే రైతులు ఖరీఫ్ ,రబీ సీజన్ లకు ముందే ప్రణాళిక బద్ధంగా,వర్షాభావ పరిస్థితులకు అనుకూలంగా సాగుచేసి పంటలు పండించి ఆకలిని తీర్చుచున్నారు. పరిశ్రమలలో కార్మికులు ప్రివెంటీవ్ మేయింటనెన్స్, రోటీవ్ మేయింటనెన్స్ ప్రక్రియల ద్వారా నిరంతరాయ ఉత్పత్తికి పాటుపడి ప్రజలకు సౌకర్యాలను కల్పిస్తున్నారు.అలాగే ప్రధాన మంత్రి,ముఖ్య మంత్రులు కూడా తమ విధులను సక్రమంగా నిర్వహించి సమయానుకూలంగా ప్రజలకు సేవలు చేయాలి.కాని సేవలు చేయడం లేదు. జవాబుదారీగా వ్యవహరించడం లేదు.ఎందుకంటే? పాలకులకు పనుల విభజన లేదు.విధులు సక్రమంగా నిర్వహించకపోతే క్రమశిక్షరాహిత్యం కింద చర్యలు తీసుకునే రాజ్యాంగ వ్యవస్థ, చట్టం లేదు.అందుకే "అహం బ్రహ్మశ్రీలురై, రాజులై ప్రజలను యిబ్బందులకు గురిచేస్తున్నారు.



తెలంగాణలో ఖరీఫ్ (వాన కాలం)సీజన్ వరి పంటలు అక్టోబర్ చివరి నుండే కోతలు ప్రారంభమైనవి.ఇప్పటికే పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు.వ్యవసాయం అంటే వ్యయప్రాయసం అయింది.వాడెవడో ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చిన రైతుని ఉద్దేశించి ఇంకా నీవు చావలేదా? అని నవ్వి అగౌరవ పర్చినాడు. అట్టి దురహంకార ఎమ్మార్వో చర్యను ఏ కమీషన్, ఏ కోర్టు కూడా సుమోటోగా తీసుకుని కనీసం మందలించ లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా సకాలంలో విధాన పరమైన నిర్ణయాలు లేక వరి ధాన్యం రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోసిన వరి ధాన్యాన్ని నిల్వచేసుకునే సదుపాయం, అరబెట్టుకునే సౌకర్యాలు లేక తప్పని పరిస్థితులలో మధ్య దళారులకు అమ్ముచున్నారు.

మార్కెట్ లో కిలో బియ్యం ధర రూ .95 అమ్ముచున్నారు.కాని క్వింటాల్ వరి ధాన్యానికి రూ.2200 లకే కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఇఎ)ఏటా రెండుసార్లు ఖరీఫ్ ,రబీ సీజన్ లకు వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తారు. భారత ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరుగుతాయి. చాల కాలంగా తెలంగాణలో ఐకెపి (ఇందిరా క్రాంతిపథకం)సెంటర్ ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నవి.గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్ఇఆర్పీ) అధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా నిర్వహించబడే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియ గురించి రైతులు ఎదురు చూస్తున్నారు. గ్రామ స్థాయిలో రైతులు తమ పంటలను విక్రయించు కోవడానికి ఐకెపి(ఇందిరా క్రాంతి పథం) సెంటర్‌ల వలన రైతులకే కాకుండా దేశ ప్రయోజనాలు కూడా ఉన్నవి. నిత్యావసర వస్తువుల చట్టం 1955 సెక్షన్ 3 ప్రకారం భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిన అధికారాలను అనుసరించి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్స్, డీలర్లు మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ""లేవీ కింద 75 శాతం "ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా" (ఎఫ్ సిఐ)కు పంపిణీ చేయాలి.ఈ మిల్లింగ్ లెవీ పథకం రైతులకు ప్రయోజనం చేకూర్చడంతో పాటుగా "నేషనల్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్" (ఎన్ పీడీఎస్)ద్వారా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ ఆక్ట్ 2013 ప్రకారం చౌకధరల దుకాణాల్లో /ఫెయిర్ ప్రైస్ షాప్స్ లలో ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుంది.అలాగే కరువు కాటకాలను ఎదుర్కోవడానికి ఆహార భద్రత గురించి నిల్వ చేయడం జరుగుతుంది.ఇక రైస్ మిల్లర్స్, డీలర్లు 75 శాతం లెవీ బియ్యం కింద "ఎఫ్ సిఐ"కి ఇవ్వగా మిగిలిన 25 శాతం బియ్యాన్ని జిల్లా కలెక్టర్ లకు సమాచారం ఇస్తూ బహిరంగ మార్కెట్ లోను,యితర రాష్ట్రాల్లోను అమ్ముకునే అవకాశం ఉంది.కాని రైతులకు మాత్రం ధాన్యం కొనుగోలులో రూపొందించిన విధానాలు కఠినంగా ఉన్నవి. ప్రభుత్వ యంత్రాంగం నిర్ధారించిన నాణ్యత, ప్రమాణాలు ఆకర్బనం/ఇన్ ఆర్గానిక్ మరియు సేంద్రీయత/ఆర్గానిక్ 1.0 శాతం ఉండాలి. దెబ్బతిన్న, రంగు మారిన,మొలకెత్తిన, వీవిల్డ్ ధాన్యాలు 3.0 శాతం, అపరిపక్వమైన, కుంచుకు పోయిన, ముడుచుకున్న ధాన్యాలు 3.0 శాతం, దిగువతరగతికి వచ్చిన ధాన్యాలు 7.0 శాతం, తేమ17.0 శాతం పరిమితులను విధించారు. వడ్ల నుండి వచ్చిన బియ్యం తీపిగా, పొడిగా, ఆరోగ్యంగా మంచి ఆహార విలువ, ఏక రీతి రంగు,మంచి పరిమాణం కలిగి ఉండాలి.అలాగే రైతులు ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే అధికార యంత్రాంగం అందుబాటులో తప్పకుండా ఉండాలి.

2025 -2026 లో తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 147 లక్షల టన్నుల వరి ధాన్యం పండింది. భారత్ లో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి. బియ్యం ఎగుమతులలో ప్రపంచంలోనే భారత్‌కు అగ్రస్థానం ఉంది.2024-2025లో బియ్యం ఎగుమతి ద్వారా 12.47 బిలియన్ డాలర్లకు పైగా(రూ.1,04,000 కోట్లు)విదేశీ మారకాన్ని ఆర్జించింది. 2026 ఏప్రిల్ నుండి అగస్ట్ మధ్య కాలంలో రూ.45,739 కోట్ల ఆదాయాన్ని పొందింది. రైతుల వ్యవసాయం వలన ప్రజలకు ఆహార భద్రతతో పాటుగా ఎగుమతుల ద్వారా కూడా విలువైన విదేశీ మారకంతో దేశాభివృద్ధి జరుగుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయ రంగానికి, రైతులకు సమయానుకూలంగా ముందస్తుగా, ప్రణాళిక బద్ధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నారు.

ఖరీఫ్ (వాన కాలం)సీజన్‌లో పండిన వరి యితర ధాన్యాలకు కనీస మద్దతు ధరలతో కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఎక్యూ), నాన్ ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ నిర్ణయం, తూకంలో కోతలు లేకుండా,సత్వర పైకం చెల్లింపులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక సదుపాయాల ఏర్పాట్లు కూడా చేయాలి. ఐకెపి కేంద్రాలలో కూడా రెవిన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు" కస్టోడియన్స్"గా విధులను నిర్వహింపచేసి రైతులకు సంరక్షకులుగా ఉండాలి. డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ (డీఆర్ డిఎ),జిల్లా జాయింట్ కలెక్టర్ లు, ఆర్డీఓలు, ఎమ్మార్వోల పర్యవేక్షణలను సాగించాలి. రోజు వారిగా పౌర సరఫరాల కమీషనర్ వీడియో సమావేశాలను నిర్వహించుచూ పురమాయించాలి. రైతులకు వరి ధాన్యం నింపుకోవడానికి గోనే సంచులను, వర్షం నుండి ధాన్యం తడవకుండా టార్పాలిన్ లను అందుబాటులో ఉంచాలి. లోడింగ్ అన్‌లోడింగ్ సౌకర్యాలను, కొనుగోలు కేంద్రాల్లో జాప్యాన్ని మొదలగు కష్ట నష్టాలను విన్నవించుకోవడానికి " హెల్ప్ లైన్ " నంబర్ ను ఇచ్చి ఫోన్ చేసే రైతులకు సహకరించే విధంగా ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ వ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

కృతజ్ఞతలతో మీ భవదీయుడు



మేరుగు రాజయ్య
సెల్ 9441440791.

స్వర్గం -నరకం

జేబులో గాంధీ
మనసుకు శాంతి
చేతిలో బ్రాందీ
పోతుంది అశాంతి...
గాంధీ
బ్రాందీ
ఉంటే
బతుకు జిగేల్
బాధలు పరార్...
నేడు రెండు రాజ్యం
చేస్తున్నాయి
నేడు రెండు సంఘ
మూలాలను
నాశనం
చేస్తున్నాయి...
హద్దులు దాటితే
నరకం
హద్దుల్లో ఉంటేనె
స్వర్గం

రేడియమ్
9291527757

అందెశ్రీ కలం.. తెలంగాణ ఉద్యమ గళం

ప్రముఖ ప్రజాకవి అందెశ్రీ ప్రథమ వర్ధంతి (నవంబర్ 10) సందర్భంగా..



ప్రజల జీవితాన్ని అక్షరాల్లో ఆవిష్కరించడం, ప్రకృతి సౌందర్యాన్ని కవిత్వంలో పలికించడం, మానవ సంబంధాల్లోని ఆర్ద్రతను పాటల్లో ప్రతిబింబించడం, పల్లె జీవనంలోని అనుభూతులను ప్రపంచానికి పరిచయం చేయడం అందెశ్రీ ప్రత్యేకత. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి పాటలోనూ తెలంగాణ మట్టి పరిమళం, ప్రజల జీవన సంఘర్షణ, ప్రకృతిపై ప్రేమ కనిపిస్తాయి. అందుకే ఆయన ప్రజాకవిగా, ప్రకృతి కవిగా, తెలంగాణ సాహితీ శిఖరంగా గుర్తింపు పొందారు. తెలంగాణ ఉద్యమానికి అక్షరాయుధమైన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జూలై 18న ప్రస్తుత సిద్దిపేట జిల్లా రేబర్తిలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. పాఠశాల విద్యకు దూరమై పశువుల కాపరిగా జీవనం సాగించారు. అనంతరం తాపీపని చేస్తూ జీవితాన్ని కొనసాగించారు. అక్షరజ్ఞానం లేని స్థితి నుంచి స్వయంకృషితో చదవడం, రాయడం నేర్చుకుని ఆశుకవిగా ఎదగడం ఆయన జీవితంలోని అసాధారణ పరిణామం. ఆశువుగా పాటలు పాడుతూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. 'పల్లె నీకు వందనాలమ్మో' అంటూ గ్రామీణ జీవన సౌందర్యాన్ని కీర్తించారు. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అంటూ ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు క్షీణిస్తున్న తీరును ప్రశ్నించారు. జనజీవనంలోని బాధలు, ప్రకృతి అందాలు, సామాజిక మార్పుల ఆకాంక్షలను తన పాటల్లో ప్రతిధ్వనించిన అందెశ్రీ గతేడాది నవంబర్ 10న తుది శ్వాస విడిచారు.

తెలంగాణ రాష్ట్ర గీతానికి పునాది వేసిన కవి.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అందెశ్రీ పాత్ర ప్రత్యేకమైనది. 2003 మార్చి 2న కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ధూంధాం కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక గీతం అవసరమనే ఆలోచన నుంచి 'జయ జయహే తెలంగాణ' పాటకు రూపకల్పన జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆ పాట ఒక ప్రాంతపు ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని, చారిత్రక అస్తిత్వాన్ని ప్రతిధ్వనించింది. వందేమాతరం భారత స్వాతంత్ర్యోద్యమంలో స్ఫూర్తిగీతంగా నిలిచినట్లే, జయ జయహే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచింది. అలాగే ప్రజాకవి గద్దర్‌తో పాటు పలువురు ఉద్యమ కళాకారుల బాటలో అందెశ్రీ తన అక్షరాన్ని ఉద్యమ ఇంధనంగా మార్చారు. విప్లవ చిత్రాల దర్శకుడు ఆర్. నారాయణమూర్తి సినిమాలకు పాటలు రాశారు. 'బతుకమ్మ' చిత్రానికి మాటలు అందించారు. తెలంగాణ ధూంధాం వేదికలపై తన పాటలతో ఉద్యమానికి ఊపిరి పోశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'జయ జయహే తెలంగాణ' గీతానికి రాష్ట్రగీతంగా గుర్తింపు లభిస్తుందని ప్రజలు ఆశించారు. కానీ నాటి ప్రభుత్వంలో ఆ గుర్తింపు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో అందెశ్రీ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించడం ఒక సానుకూల పరిణామం. ఇది ఆయన సాహిత్య ప్రతిభకు, తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవకు లభించిన గుర్తింపు.

కవిత్వం బహుజన రాజ్యాధికార దిక్సూచి కావాలి.

అందెశ్రీకి అనేక పురస్కారాలు, గౌరవాలు లభించాయి. అయినప్పటికీ ఆయన జీవిత ప్రయాణాన్ని పరిశీలించినప్పుడు ఒక విస్తృతమైన సామాజిక ప్రశ్న మన ముందుకొస్తుంది. ఇది అందెశ్రీ ఒక్కరి జీవితానికి మాత్రమే పరిమితమైన ప్రశ్న కాదు. గద్దర్‌తో పాటు అనేకమంది దళిత, బహుజన కళాకారుల జీవితాల్లోనూ ఇలాంటి వైరుధ్యాలు కనిపిస్తాయి. అణచివేతను అనుభవించిన సమాజాల నుంచే గొప్ప సాహిత్యం, విప్లవ గీతాలు, సామాజిక చైతన్య ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కానీ ఆ సృజనాత్మక శక్తిని రాజకీయ ఆధిపత్య వర్గాలు తమ అవసరాలకు ఉపయోగించుకున్నారు. కానీ ఆ సాహిత్యం లక్ష్యమైన సమానత్వం, సామాజిక న్యాయం అసంపూర్ణంగానే మిగిలిపోయింది. అణగారిన వర్గాలు తమ రాజకీయ అధికారాన్ని సాధించుకున్నప్పుడే తమ సాహిత్యానికి, సంస్కృతికి, ఆత్మగౌరవానికి సంపూర్ణ గుర్తింపు, సామాజిక న్యాయానికి నిజమైన అర్థం లభిస్తాయి.

సాహిత్యం సమాజాన్ని ప్రశ్నించగలదు. పాట ప్రజలను కదిలించగలదు. కవిత్వం చైతన్యాన్ని రగిలించగలదు. కానీ ఈ చైతన్యం సంఘటిత శక్తిగా, రాజకీయ ప్రాతినిధ్యంగా, రాజ్యాధికారంగా మారనంతకాలం అణగారిన వర్గాల విముక్తి సంపూర్ణం కాదు. కావున నేడు తెలంగాణ ఉద్యమంలో లేవనెత్తిన భాష, యాస, సంస్కృతి వంటి ఉపరితల అంశాల ఉచ్చులో పడవద్దు. ఇవన్నీ ఇప్పటివరకు బహుజన ఉద్యమాలను దారి తప్పించి, అగ్రవర్ణ ఆధిపత్య రాజకీయాలకు ఊపిరిపోశాయి. ఈ క్రమంలో నికార్సైన అణగారిన వర్గాల స్వశక్తి విముక్తి ఉద్యమాలకు కవులు, కళాకారుల కలం తోడుగా నిలవాలి. అదే సాహిత్యానికి సామాజిక సార్థకత.. అదే నిజమైన విముక్తి!



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

పన్నుల భారం ప్రజలపై- ప్రయోజనాలు ఎవరికి!?



ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల చేతుల్లో ఉంటుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ నేటి రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ప్రజలు ఓటు వేసే యంత్రాలుగా, రాజకీయ నాయకులు అధికార చక్రవర్తులుగా మారుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో పేదల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అంటూ హామీల వర్షం కురిపించే రాజకీయ పార్టీలు..అధికారం చేపట్టాక ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారంలో ఎంతవరకు చిత్తశుద్ధి చూపుతున్నాయనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవైపు సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుంటే: మరోవైపు పేద, మధ్యతరగతి ప్రజలు నిత్యావసరాల ధరలు, పన్నుల భారం, నిరుద్యోగం, విద్యా వైద్య ఖర్చులతో సతమతమవుతున్నారు. స్వాతంత్ర్య ఫలాలు, ఆర్థిక, సామాజిక,రాజకీయ, స్వేచ్ఛా- సమానతలు ఎవరి పాలవుతున్నట్లు!?.ఇన్ని వైరుధ్యాల మధ్య ప్రజాస్వామ్య ప్రయోజనాలు సామాన్యుడికి అందుక పోవడం అనేదే,అసలైన సమస్య.ఇన్నేళ్ల స్వాతంత్ర్యంలో పరిష్కరించుకోలేని విధానాలపై ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

పన్నుల భారం ప్రజలపై.. ప్రయోజనాలు సంపన్నులకా!?

ప్రజాస్వామ్య దేశంలో పన్నుల వసూళ్లు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు. ఆ ఆదాయాన్ని ప్రజా సంక్షేమం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, పేదరిక నిర్మూలనకు వినియోగించాలి. సంపన్నుల ఆర్థిక స్థాయికి అనుగుణంగా న్యాయబద్ధమైన పన్నుల విధానం అమలై, సమాజంలోని అట్టడుగు వర్గాలకు అవకాశాలు కల్పించాలి. కానీ మన దేశంలో ప్రత్యక్ష పన్నులతో పాటు పరోక్ష పన్నుల భారం సామాన్యుల కొనుగోలు శక్తిపైనా ప్రభావం చూపుతోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల పేద, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను కుదేలు చేస్తోంది.

ప్రభుత్వానికి ప్రజలు చెల్లించే ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం, యువతకు ఉపాధి, రైతులకు గిట్టుబాటు ధరలు అందించడమే పన్నుల వసూళ్లకు నిజమైన సార్థకత. సామాన్యుడు తన పిల్లలను చదివించడానికి, అనారోగ్యానికి వైద్యం చేయించుకోవడానికి అప్పులపాలవుతుంటే అభివృద్ధి ఫలాలు ఎవరికి అందుతున్నాయనే ప్రశ్న సహజంగానే ఉత్పన్న మవుతుంది. సంపద సృష్టి ఎంత ముఖ్యమో, ఆ సంపద ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమంగా చేర్చడం పాలకుల బాధ్యత, ప్రశ్నించడం పౌరుల హక్కు. సమ్మిళిత అభివృద్ధి సాధించేలా విధానాలు రూపొందించడం అంతే ముఖ్యం. ఇదే నాటి సమరయోధులు ఆశించిన లక్ష్యం.

ఉచిత పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమేనా!?

ఎన్నికల వేళ ఉచిత హామీలు రాజకీయ పార్టీలకు ప్రధాన ప్రచార అస్త్రాలుగా మారుతున్నాయి. సంక్షేమ పథకాలు పేదలకు తక్షణ ఆర్థిక ఉపశమనం కలిగిస్తాయనడంలో సందేహం లేదు. అర్హులైన పేదలకు ఆహారం, పింఛన్లు, విద్యుత్తు, గృహ సదుపాయాలు, ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అయితే సంక్షేమం పేరుతో నిరంతరం ఉచిత పథకాలపైనే ఆధారపడే పరిస్థితి ఏర్పడితే పేదరిక నిర్మూలన లక్ష్యం నెరవేరదు?.పేదవాడికి ఉచితంగా వస్తువులు ఇవ్వడం కంటే వాటిని కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత కల్పించడం శాశ్వత పరిష్కారం. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు అందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేసి పేద పిల్లలకు సంపన్నుల పిల్లలతో సమానమైన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి తేవాలి. యువతకు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉచిత పథకాలు అవసరమైన వారికి భరోసాగా ఉండాలి కానీ ప్రజల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యామ్నాయంగా మారకూడదు. ప్రభుత్వాలు సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత పాటించాలి. అప్పులు చేసి పథకాలు అమలు చేయడం కంటే ఆదాయ వనరులను పెంచి, ప్రజాధనాన్ని పారదర్శకంగా ఖర్చు చేయడం ముఖ్యం.

నాయకుల భవిష్యత్తు కోసం..ప్రజల మధ్య విభేదాలు!?

రాజకీయాలు ప్రజాసేవకు వేదిక కావాలి. కానీ ఎన్నికల వేళ రాజకీయాల్లో ధనబలం, కులబలం, మతబలం, వ్యక్తిగత ప్రభావం పెరుగుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తరతరాలుగా ఆస్తులు కలిగినవారు రాజకీయాల్లోకి రావడం తప్పు కాదు. అయితే ప్రజాప్రతినిధుల ఆస్తుల పెరుగుదల, ఆదాయ వనరులు, ఎన్నికల ఖర్చులు, ఆర్థిక లావాదేవీలపై పారదర్శకత ఉండాలి. ప్రజా జీవితంలో ఉన్నవారు తమ ఆస్తుల వివరాలకు, ప్రజాధన వినియోగానికి జవాబుదారీగా ఉండాలి.


మరోవైపు రాజకీయ నాయకుల కోసం సామాన్య ప్రజలు పరస్పరం శత్రువులుగా మారుతున్న దృశ్యాలు బాధాకరం. మా పార్టీ, మీ పార్టీ అంటూ కుటుంబాల్లోనూ, స్నేహితుల మధ్యా విభేదాలు పెంచుకోవడం వల్ల ఎవరికి ప్రయోజనం? ఎన్నికల్లో గెలిచిన నాయకులు పదవులు అనుభవిస్తుంటే, కార్యకర్తలు, అభిమానులు మాత్రం వ్యక్తిగత విభేదాలతో సంబంధాలను దెబ్బతీసుకుంటున్నారు. నాయకుల రాజకీయ భవిష్యత్తు కోసం సామాన్యులు తమ కుటుంబ ప్రశాంతతను కోల్పోవాల్సిన అవసరం ఏముంది?.

రాజకీయ అభిమానం వ్యక్తిగత స్వేచ్ఛ. కానీ అది అంధాభిమానంగా మారకూడదు. నాయకుడు ఏ పార్టీకి చెందినవాడైనా ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కును పౌరులు వదులుకోకూడదు. పార్టీలు మారవచ్చు, నాయకులు మారవచ్చు, ప్రభుత్వాలు మారవచ్చు. కానీ ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావాలి. ప్రజాస్వామ్యంలో నాయకులు ప్రజలకు సేవకులే తప్ప,ప్రజలు నాయకులకు బానిసలు కారు. పౌర సమాజం చైతన్యవంతులై నప్పుడే ఈ తీరు మారుతోంది.

ఓటు వేసిన చేతులే పిడికిలి బిగించి ప్రశ్నించాలి..!

దేశాభివృద్ధి అంటే కొద్దిమంది సంపన్నుల ఆస్తులు పెరగడం కాదు.. కోట్లాది సామాన్యుల జీవితాల్లో వెలుగులు నిండడం. పేదవాడికి నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, ఆత్మగౌరవంతో జీవించే అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన సంక్షేమ రాజ్యం ఆవిష్కృతమవుతుంది. ప్రభుత్వాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు.. ప్రజాధనానికి జవాబుదారీతనం కోరడం పౌరుల హక్కు, బాధ్యత. నాయకుల కోసం కొట్టుకోవడం కాదు.. ప్రజా సమస్యల కోసం కలిసికట్టుగా పోరాడాలి. వ్యక్తుల పట్ల అభిమానం కంటే వ్యవస్థల పట్ల బాధ్యత, పార్టీల పట్ల విధేయత కంటే ప్రజల పట్ల నిబద్ధత ముఖ్యం.

గుర్తుంచుకోండి.. నాయకులు సంపన్నులవుతున్నారా, ప్రజలు స్వావలంబులవుతున్నారా? అనేది కొలమానం కావాలి. ఓటు వేసిన చేతులే పిడికిలి బిగించి ప్రశ్నించే గొంతులుగా మారినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన సార్థకత!




మేకిరి దామోదర్ (మేదాజీ)
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

శాస్త్రీయ అధ్యయనం లేకుండా డేటా సెంటర్ల మోజు : ప్రజల ప్రయోజనాలకు ముప్పు!

నీరు, విద్యుత్తు, భూమి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తే అభివృద్ధి ఎలా అవుతుంది? డిజిటల్ విప్లవం, కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తరణకు డేటా సెంటర్లు అవసరమే. కానీ వాటి అవసరం పేరుతో ప్రజల ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్తు, పర్యావరణ భద్రతను ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమర్థనీయం? ప్రస్తుతం అమెరికా, ఐరోపా దేశాల్లో డేటా సెంటర్ల విస్తరణపై ప్రజలు, పర్యావరణవేత్తలు, మేధావులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 2026 నవంబర్‌లో నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ నిర్మాణ ప్రాంతంలోకి ప్రవేశించి మరీ కార్యకర్తలు నిరసన తెలిపారు. అమెరికాలో 42 రాష్ట్రాల్లో 142 నిరసన కార్యక్రమాలు నిర్వహించడం ఈ వ్యతిరేకత తీవ్రతకు నిదర్శనం. నీటి కొరత, విద్యుత్తు వినియోగం, పర్యావరణ విధ్వంసం, స్థానిక ప్రజలకు అత్యవసరమైన ప్రయోజనాలే ఈ ఆందోళనలకు ప్రధాన కారణాలు.

అయితే ఈ అంతర్జాతీయ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన భారత ప్రభుత్వాలు, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మాత్రం డేటా సెంటర్లను ఆకర్షించడంలో పోటీ పడుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రాలు, వేలాది ఉద్యోగాలంటూ ప్రకటనలు గుప్పిస్తున్నాయి. కానీ ఈ పెట్టుబడుల వెనుక దాగి ఉన్న పర్యావరణ, ఆర్థిక, సామాజిక వ్యయాల గురించి మాత్రం తగినంత చర్చ జరగడం లేదు.నిజానికి ఈ డేటా సెంటర్ల వల్ల వేలాది ఉద్యోగాలు ఇంత వరకు ఎక్కడా రాలేదు. అవి అన్నీ ఆటోమేషన్ తో నడుస్తాయి. చాలా పరిమిత చిన్న పాటి ఉద్యోగాలే లభిస్తాయి అని ఇప్పటి వరకు విదేశాల్లో ఏర్పడిన డేటా సెంటర్ల అనుభవం తెలుపుతుంది.

డేటా సెంటర్లు సాధారణ కార్యాలయాలు కావు. వేలాది సర్వర్లు నిరంతరం పనిచేస్తూ అపారమైన విద్యుత్తును వినియోగిస్తాయి. వాటి నుంచి వెలువడే వేడిని తగ్గించేందుకు భారీ శీతలీకరణ వ్యవస్థలు అవసరం. ముఖ్యంగా నీటితో శీతలీకరణ చేసే కేంద్రాలు రోజుకు లక్షల లీటర్ల నీటిని వినియోగించవచ్చు. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా ప్రకారం, 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఒక భారీ డేటా సెంటర్ ప్రత్యక్ష, పరోక్ష అవసరాల కోసం రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల నీటిని వినియోగించాలి. భారతదేశంలో 2025 నాటికి డేటా సెంటర్ల వార్షిక నీటి వినియోగం సుమారు 15,000 కోట్ల లీటర్లకు చేరిందని కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ) అధ్యయనం వెల్లడించింది. 2030 నాటికి ఈ వినియోగం రెట్టింపునకు మించవచ్చని అంచనా.



భారతదేశంలో ఇప్పటికే అనేక నగరాలు భూగర్భజలాల కొరతతో సతమతమవుతున్నాయి. హైదరాబాద్‌లో వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగునీరు, తాగునీరు అందక ప్రజలు వలస వెళుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ డేటా సెంటర్లకు నీటిని ఎక్కడి నుంచి సరఫరా చేస్తారు? భూగర్భజలాలను తోడితే భవిష్యత్తులో పరిసర గ్రామాల పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నలకు ప్రభుత్వాలు స్పష్టమైన సమాధానం చెప్పాలి. ప్రపంచ వనరుల సంస్థ (డబ్ల్యూఆర్ఐ) 2026 అధ్యయనం ప్రకారం, భారతదేశంలోని సగానికి పైగా డేటా సెంటర్లు నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లోనే ఉన్నాయి.

విద్యుత్తు పరిస్థితి మరింత ఆందోళనకరం.

మిగితా తరువాయి సంచికలో..



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

జిల్లా కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష

రూ.2 వేల జరిమానా విధింపు.. హైకోర్టు సంచలన తీర్పు

- కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు ఆగ్రహం
- అఫిడవిట్‌లో తప్పుడు వివరాలపై ధర్మాసనం మండిపాటు
- శిక్ష అమలుపై నాలుగు వారాల స్టే జారీ



రంగారెడ్డి, నవంబర్ 9 (జనంసాక్షి): కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన కేసులో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు సంచల్లో తీర్పు ఇచ్చింది. ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. శిక్షతో పాటు రూ.2,000 జరిమానా కూడా విధిస్తూ జస్టిస్ కె. లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ ఊరటనిచ్చారు.

గడువు దాటినా స్పందించని అధికారులు..

అబ్దుల్లాపూర్ మెట్ మండలం తుర్కయంజాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 536, 537, 657, 658 లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చట్టం 1908 లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించాలని బాధితులు పి.శివలీల, పి.వెంకటేశ్వర్లు కోరారు. 2022 ఆగస్టులో అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని, వారి వినతిని పరిశీలించి రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించాలంటూ బాధితులు దరఖాస్తు చేసుకొన్నారు. 60 రోజుల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో హైకోర్టు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. నిర్ణీత గడువులోగా అధికారులు స్పందించకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు విచారణ జరిపి, 2026 ఫిబ్రవరి 26న, జూలై 8న బాధితుల దరఖాస్తులను తిరస్కరించినట్లు న్యాయస్థానం గుర్తించింది.

అఫిడవిట్‌లో పచ్చి అబద్ధాలు..

ఈ కేసు విచారణ సందర్భంగా కలెక్టర్ సమర్పించిన అఫిడవిట్‌పై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 21న జరిగిన విచారణకు ఆర్డీవో, తహసీల్దార్ హాజరైనట్లు కలెక్టర్ పేర్కొన్నప్పటికీ, అందుకు సంబంధించిన రికార్డుల్లో వారి సంతకాలు లేకపోవడాన్ని న్యాయస్థానం ఎత్తిచూపుతూ వాటిని పచ్చి అబద్ధంగా అభివర్ణించింది. అలాగే, సర్వే నంబర్ 537ను నిషేధిత జాబితా నుంచి తొలగించి 536, 657, 658 సర్వే నంబర్లను మాత్రం ఎందుకు కొనసాగించారో వివరణ ఇవ్వలేకపోవడంపై ప్రశ్నించింది. ఒకే తరహా భూముల విషయంలో భిన్నమైన నిర్ణయాలు తీసుకోవడానికి కారణమేంటని అధికారులను ప్రశ్నించింది. ఈ నిర్ణయాల వెనుక ఉన్న కారణాలను స్పష్టంగా వివరించాలని పేర్కొంది.

కోర్టు ఆదేశాల అమలు తప్పనిసరి..

గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు సరైనవా? కాదా? అనే అంశంతో సంబంధం లేకుండా, అవి అమలులో ఉన్నంతవరకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాటించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలపై కలెక్టర్‌కు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, పలుమార్లు అవకాశాలు ఇచ్చినా ఆదేశాలను నిర్ణీత సమయంలో అమలు చేయలేదని ధర్మాసనం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సమర్పించిన వివరణను తోసిపుచ్చిన హైకోర్టు కోర్టు ధిక్కరణ కింద ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. అయితే తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం న్యాయస్థానాల ఆదేశాలను గౌరవించి, నిర్ణీత గడువులోగా అమలు చేయాల్సిందేనన్న అంశాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

మైలార్‌దేవ్‌పల్లిలో రెండు గోదాముల్లో అగ్నిప్రమాదం

- రూ. 1 కోటి పైనే ఆస్తినష్టం
- పారిశ్రామికవాడలో ప్లాస్టిక్, ప్లైవుడ్ గోదాములు దగ్ధం
- మరోచోట డెకరేషన్ గోదాంలో అగ్నిప్రమాదం



రాజేంద్రనగర్, నవంబర్ 9(జనంసాక్షి) : మైలార్‌దేవ్‌పల్లి పారిశ్రామికవాడలో ఆదివారం సాయంత్రం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో రెండు గోదాములు అగ్నికి ఆహుతయ్యాయి. తొలుత ప్లాస్టిక్ గోదాంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న ప్లైవుడ్ గోదాముకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. పోలీసులు గోదాముల్లో పనిచేస్తున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ప్లాస్టిక్, ప్లైవుడ్ గోడౌన్లలో విలువైన వస్తువులు దగ్ధమైనట్లు ప్రాథమిక అంచనా. మొత్తం రెండు గోడౌన్లో కలిపి సుమారు రూ.1 కోట పైనే ఆస్తినష్టం జరిగినట్లు ఇన్స్పెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. అగ్నిప్రమాదానికి బాణాసంచా కారణమా లేక షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

డెకరేషన్ గోదాంలో అగ్నిప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలోని ఓ డెకరేషన్ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు వెనుక టైర్ కింద పడి విద్యార్థి మృతి

మరో విద్యార్థికి స్వల్ప గాయాలు

హయత్ నగర్, నవంబర్ 9 (జనం సాక్షి) : రోడ్డు ప్రమాదంలో 19 ఏళ్ల విద్యార్థి దుర్మరణం చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మరో విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం తుంబాయ్ తండాకు చెందిన కాట్రోత్ శంకర్ కుమారుడు అరుణ్ (19), తన స్నేహితుడు సందీప్‌తో కలిసి హయత్‌నగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఎల్బీనగర్‌కు షాపింగ్‌కు వెళ్లి తిరిగి హయత్‌నగర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 9.20 గంటల సమయంలో ఆటోనగర్ సమీపంలోని రాయల్ ఓక్ షోరూమ్ ఎదుట స్టీల్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే, మారుతీ షోరూమ్ వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో అరుణ్ నడుపుతున్న బైక్ అదుపుతప్పి పక్కనే వెళ్తున్న గుర్తుతెలియని బస్సు వెనుక టైర్ కింద పడింది. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న సందీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి కాట్రోత్ శంకర్ ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడి.. తొమ్మిది మేక పిల్లలు బలి

- బంట్వారం మండల కేంద్రంలో ఘటన
- కాపరి కుటుంబానికి తీరని నష్టం



బంట్వారం నవంబర్ 09 జనం సాక్షి : బంట్వారం మండలంలో వీధి కుక్కల దాడితో ఓ పేద మేకల కాపరి కుటుంబానికి తీరని నష్టం వాటిల్లింది. బంట్వారం మండల కేంద్రానికి చెందిన బండమీది రాజు తండ్రి పెంటప్ప మేకల పెంపకాన్ని వృత్తిగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వీధి కుక్కలు మేకల మందపై దాడి చేయడంతో తొమ్మిది మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబానికి ఈ ఘటన తీవ్ర ఆవేదనను మిగిల్చింది. ఒకేసారి తొమ్మిది మేక పిల్లలను కోల్పోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. సంబంధిత అధికారులు ఘటనపై విచారణ జరిపి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించాలని బాధిత కుటుంబం కోరుతోంది. మరోవైపు గ్రామంలో వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావంపై కళాజాత ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచన



హైదరాబాద్ సిటీ, నవంబర్ 09 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలకు నీరు, విద్యుత్ పొదుపు వినియోగంపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా కళాజాత ప్రదర్శన లు నిర్వహిస్తున్నారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశాల మేరకు జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ క్రమంలో సోమవారం సికింద్రా బాద్ మండలం బన్సీలాల్‌పేటలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీరు, విద్యుత్‌ను అవసరానికి తగినంత మాత్రమే వినియోగించుకోవాలని కళాకారులు పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను వీక్షించారు. జిల్లాలోని ముఖ్య కూడ ళ్లు, లేబర్ అడ్డాలు, బస్తీలు, పాఠశాలలు, కళాశాల లు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నారు. నీరు, విద్యుత్ వృథాను అరికట్టి పొదుపుగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించనున్నారు. ఈ కళాజాత ప్రదర్శనలో కళాకారులు బాలు, ఫ్రాన్సిస్, స్పందన, జోష్ణ, స్వర్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రిటైల్ వ్యాపారులకు నేరుగా బియ్యం సరఫరా

- కిలో కేఎన్ఎం బియ్యం రూ.62, జెఎస్ఆర్ బియ్యం రూ.74
- లభ్యతపై వ్యాపారులు ఆందోళన చెందద్దు
- జిల్లా రేషనింగ్ అధికారి శ్యామ్ ప్రసాద్ లాల్

హైదరాబాద్ సిటీ, నవంబర్ 9 (జనం సాక్షి) : హైదరాబాద్ జిల్లాలోని రిటైల్ వ్యాపారులందరికీ నేరుగా బియ్యం సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు సంసిద్ధత వ్యక్తం చేశారని జిల్లా రేషనింగ్ అధికారి జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు.ప్రస్తుత మా ర్కెట్ పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని సోమవారం విడుదల చేసిన ప్రకటన లో పేర్కొన్నారు. నిర్దేశించిన ధరల ప్రకారం కిలో కేఎన్ఎం బియ్యం రూ.62, జెఎస్ఆర్ బియ్యం రూ.74 చొప్పున సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు ముందుకు వచ్చారని తెలిపారు. రిటైల్ వ్యాపారు లు బియ్యం కోసం హోల్‌సేల్ వ్యాపారులు, బ్రోకర్లు లేదా మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అవసరమైన పరిమాణంలో మిల్లర్ల నుంచి నేరుగా బియ్యం అందించేందుకు శాఖ సమన్వయం చేస్తుందని వెల్లడించారు. బియ్యం కొనుగోలు చేయదలచిన రిటైల్ వ్యాపా రులు తమ దుకాణం పేరు, చిరునామా, జీఎస్టీ నంబర్, అవసరమైన బియ్యం రకం(కేఎన్ఎం/జెఎస్ఆర్), కావాల్సిన పరిమాణం, మొబైల్ నంబర్ వివరాలను సంబంధిత జిల్లా పౌరసరఫ రాల అధికారులకు సమర్పించాలని సూచించారు. వ్యాపారుల నుంచి ఇండెంట్లు సేకరించి, రైస్ మిల్లర్ల ద్వారా నేరుగా దుకాణాలకు బియ్యం సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.బియ్యం నిల్వలు, సరఫరా విషయంలో రిటైల్ వ్యాపారులు ఆందోళన చెందవద్దని, అనవ సరంగా ముందస్తు నిల్వలు చేసుకోవద్దని జిల్లా రేషనింగ్ అధికారి సూచించారు. వినియోగదారు లకు నిరంతరాయంగా బియ్యం అందుబాటులో ఉండేలా పౌరసరఫరాల శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

నర్సప్పగూడకు డబుల్ రోడ్డు కల సాకారం!

- రూ.7 కోట్లతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన
- ఏళ్ల నిరీక్షణకు తెర.. గ్రామస్థుల్లో హర్షం
- గతంలో శంకుస్థాపనకే పరిమితమైన పనులు
- ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే చొరవ
- భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు దూరం



నందిగామ, నవంబర్ 9 (జనంసాక్షి): నర్సప్పగూడ గ్రామస్థుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో నందిగామ నుంచి అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ మీదుగా చేగూరు (తిమ్మాపూర్-చేగూరు రహదారి) వరకు డబుల్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ పనులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఈ రహదారిని మంజూరు చేసి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో గ్రామస్థుల నిరీక్షణ కొనసాగింది.

ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

గత ఎన్నికల ప్రచారంలో నర్సప్పగూడకు డబుల్ రోడ్డు నిర్మిస్తానని వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గం సింగిల్ రోడ్డుగా ఉండటంతో ఇరువైపులా ఉన్న పరిశ్రమలకు వచ్చే ట్రక్కులు, లారీల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో కొన్ని వాహనాలు రోడ్డు పక్కన వ్యవసాయ పొలాల్లో బోల్తాపడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. డబుల్ రోడ్డు నిర్మాణంతో ప్రయాణ సమయం ఆదా కావడంతోపాటు ప్రమాదాలు తగ్గుతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొన్న ఆటో..

మహిళ మృతి మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

హయత్‌నగర్, నవంబర్ 9 (జనం సాక్షి) : రోడ్డుపై ఎలాంటి సూచికలు, హెచ్చరికలు లేకుండా నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన లారీని ఆటో ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సుమారు 6:50 గంటల సమయంలో భాగ్యలత నుంచి పెద్ద అంబర్‌పేట్ వైపు స్క్రాప్ సామానుతో ఆటో వెళ్తోంది. ఆటోలో యడవల్లి పద్మ (26), రెవెల్లి దుర్గమ్మ ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో సంగం హోటల్ సమీపంలో ఎలాంటి ఇండికేటర్లు, తగిన హెచ్చరికలు లేకుండా రోడ్డుపై నిలిపి ఉంచిన లారీ ను ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యడవల్లి పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. రెవెల్లి దుర్గమ్మకు భుజం వద్ద తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్‌కు కూడా రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నీలాద్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలి తరపున యడవల్లి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు చేపట్టి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

మెగా రైతు మేళాకు తరలిన రైతులు, మహిళలు



శామీర్ పేట, నవంబర్ 9(జనం సాక్షి) : మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో - 2026 కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు, మహిళలు సోమవారం తరలి వెళ్లారు. కొడంగల్ నియోజక వర్గం, దుద్యాల మండలం, హకీంపేట గ్రామంలో నిర్వహిస్తున్న మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో - 2026 కార్యక్రమానికి శామీర్‌పేట మండల ంలోని రైతులు, మహిళలు సుమారు 100 మంది రెండు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి రమేష్‌లు బస్సులను జెండా ఊపి పంపించారు. ఇందులో భాగంగా రైతులు, మహిళ లు, వివిధ వ్యవసాయ,అనుబంధ రంగాలకు సంబంధించిన స్టాళ్లను సందర్శించి, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం, పథకాలు, యంత్ర పరికరాల గురించి అవగాహన పొందడంతో పాటు ముఖ్యమంత్రి పాల్గొని సభలో వీరు పాల్గొంటారని జిల్లా వ్యవ సాయ అధికారి చంద్రకళ తెలిపారు. రైతులతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, అర్చన, డిఆర్డిఏ సిబ్బంది నాగశ్రీ, పోలీస్ సిబ్బంది తరలి వెళ్లారు.

అధికారి తప్పుడు నివేదికతో అక్రమ నిర్మాణానికి అనుమతులు

- ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు
- సెక్షన్ అధికారి ఇచ్చిన తప్పుడు నివేదికతో తలలు పట్టుకున్న డిసి, ఏసిపి






మల్కాజిగిరి నవంబర్ 9 (జనంసాక్షి) : కళ్ల ముందే నిబంధనలకు తిలోదకాలిచ్చి మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణంపై కొరడా ఝళిపించాల్సిన అధికారే ముడుపుల మత్తులో కళ్లు మూసుకున్నారు. మూడు ఫ్లోర్ల భవనం దర్జాగా కనిపిస్తున్నా, పై అధికారులకు మాత్రం అక్కడ ఏ నిర్మాణమూ లేదు, కేవలం ఖాళీ స్థలం మాత్రమే ఉంది అంటూ పచ్చి అబద్ధాలతో నివేదిక ఇచ్చి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణానికి అధికారిక ముద్ర వేయించారు. మల్కాజిగిరి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న ఈ దారుణ బాగోతం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో ఓ వ్యక్తి సుమారు ఆరు నెలల క్రితం భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తుతో పాటు సమర్పించిన ధ్రువపత్రాలు సరిగా లేకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు 'షార్ట్‌ఫాల్' కింద తిరస్కరించారు. అధికారులు అనుమతి నిరాకరించినా యజమాని ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని, ఎలాంటి అనుమతులు లేకుండానే ఏకంగా ఇంటి యజమాని మూడు ఫ్లోర్ల భవనాన్ని నిర్మించేశారు.ఇంతవరకు బాగానే ఉన్నా, అక్రమ నిర్మాణానికి చట్టబద్ధత కల్పించేందుకు యజమాని నెల రోజుల క్రితం సరికొత్త నాటకానికి తెరలేపారు. అక్కడ ఇప్పటికే మూడు అంతస్తుల భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ, కేవలం ఖాళీ స్థలం ఓపెన్ ప్లాట్ మాత్రమే ఉందని, స్టిల్ట్ ప్లస్ 3 అంతస్తుల నిర్మాణానికి అనుమతి కావాలంటూ అవసరమైన పత్రాలను జతచేసి మళ్లీ దరఖాస్తు చేశారు. ఈ మధ్యనే మల్కాజిగిరి సర్కిల్ కు ఇన్చార్జిగా వచ్చిన సెక్షన్ అధికారి మేఘన దరఖాస్తు పరిశీలనలో భాగంగా ఫీల్డ్ వెరిఫికేషన్ కు వెళ్లి నిబంధనలను గాలికొదిలేశారు. కళ్ల ముందే మూడు అంతస్తుల భవనం కనిపిస్తున్నా, అక్కడ ఎలాంటి నిర్మాణం జరగలేదని, ఖాళీ ప్లాట్ మాత్రమే ఉందని రికార్డుల్లో తప్పుడు సమాచారం నమోదు చేశారు. సదరు అధికారి ఇచ్చిన నివేదికను గుడ్డిగా నమ్మిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు ఫైలును డిప్యూటీ కమిషనర్‌కు పంపగా, ఆమె క్లియరెన్స్ ఇస్తూ భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేశారు. అప్పటికే అక్రమంగా లేచిన భవనానికి అధికారులు అనుమతులు ఎలా జారీ చేస్తారంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి అధికారి ఇంటి యజమాని ఇచ్చిన ముడుపులకు లొంగి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్కడ ఖాళీ స్థలం ఉందట..?

డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తాన, టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాసరావును జనంసాక్షి వివరణ కోరగా.. అక్కడ ఖాళీ స్థలం ఉందని సెక్షన్ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం పది రోజుల క్రితమే అనుమతులు ఇచ్చామనీ తెలిపారు. నిర్మాణంలో ఉన్న బిల్డింగుకు అనుమతులు ఇవ్వడం తప్పు, తాము స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయలేదని అన్నారు. సెక్షన్ అధికారి ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే ఫైలును ముందుకు పంపామని చెప్పారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన అధికారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల ప్రకారం చర్యలు తీసుకొని అక్కడ జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేస్తామని తెలిపారు.

పంచాయతీ నిధుల లెక్కలపై విచారణ ఏదీ?



కార్యదర్శులపై వరుస ఫిర్యాదులు.. అధికారుల మౌనంపై విమర్శలు

- పెద్దమల్లారెడ్డిలో లక్షల నిధుల దుర్వినియోగం ఆరోపణలు
- అసంపూర్తిగా విచారణ జరిగిందంటున్న గ్రామస్థులు
- భిక్కనూరు, జంగంపల్లి పంచాయతీలపైనా ఫిర్యాదులు
- కలెక్టర్ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

భిక్కనూరు నవంబర్ 09 (జనంసాక్షి):

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో పంచాయతీ కార్యదర్శులపై ప్రజల నుంచి ప్రజావాణిలో వరుసగా ఫిర్యాదులు వస్తున్న చూచి చూడనట్లు వ్యవహరించడం జిల్లా స్థాయి పంచాయతీ అధికారులకు వెన్నతో పెట్టిన విద్యాగా వారికి అలవాటు అయింది.గ్రామాల అభివృద్ధికి ప్రజల నుంచి చెల్లించిన ప్రతి రూపాయి, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటు ఆర్థిక వనరులు గ్రామ అభివృద్ధికి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసే అభివృద్ధి నిధులు దారి మళ్లినట్లు ప్రజల నుంచి పలురకాల ఫిర్యాదులు. ఒక సందర్భంలో స్వయంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించడంతో వచ్చిన జిల్లా అధికారి విచారణ అసంపూర్తిగా చేయడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందనంగా మారింది.

లక్షల రూపాయల నిధుల దుర్వినియోగంపై విచారణ ఎక్కడ?

మేజర్ గ్రామపంచాయతీ పెద్దమల్లారెడ్డి పాలకవర్గ సభ్యులు పంచాయతీ కార్యదర్శికి సంబంధించిన విధి నిర్వహణలో నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారి విచారణకు రాగ వాటిపై తీసుకున్న చర్యలు ఇప్పటివరకు కనుకు మీద ఊసే లేదు అన్న విధానంలో విచారణ జరుగుతుంది. ఈవిధానంలో అధికారుల తీరుపై గ్రామ ప్రజలు యువకులు చర్చిస్తున్నారు.ఈవిషయంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి. విచారణలో జరిగిన వాస్తవాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటూ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు యువకులు కోరుచున్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పర్యవేక్షణ ఎప్పుడు

భిక్కనూరు మండలంలో మేజర్ గ్రామపంచాయతీ భిక్కనూరు, జంగంపల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శుల తీరుపై గతంలో ఇప్పుడు వస్తున్న ఫిర్యాదులపై గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఫిర్యాదులన్నింటిని పరిశీలించి అవసరమైతే ప్రత్యేక విచారణ చేపట్టి. ఆరోపణలు వాస్తవాలు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు, యువకులు, ఫిర్యాదుదారులు కోరుచున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందిస్తుందా? లేక ప్రజల ఫిర్యాదులు చెత్తబుట్టలకు పరిమితం అవుతాయా? ప్రజలు వేచి చూడాల్సిన పరిస్థితి ఇంతేనా.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 నవంబర్ 2026

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- 630 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు
- 412 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ
- మంత్రి వివేక్ వెంకటస్వామి

నర్సాపూర్, నవంబర్ 9 (జనం సాక్షి) : పేద, నిరుపేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.సోమవారం నర్సాపూర్ మండలం తుజ్జాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గుడిసెల్లో నివసిస్తున్న అత్యంత నిరుపేద కుటుంబాలకు



సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా 630 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకాల కింద 412 మంది లబ్ధిదారులకు రూ.4,12,47,792 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం జీరో విద్యుత్ బిల్లులు, సన్నబియ్యం పంపిణీ, నూతన పింఛన్లు, మహాలక్ష్మి పథకంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. ఏటీసీ కేంద్రాల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లికి వరం కళ్యాణలక్ష్మి

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకం వరంగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కొన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు.అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, హౌసింగ్ పీడీ మాణిక్యం, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథక కూలీలకు ఎల్‌నినోపై అవగాహన



మల్దకల్, నవంబర్ 9 (జనంసాక్షి) : మండల పరిధిలోని సద్దలోనిపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా ఆదేశాలమేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలో సోమవారం ఎల్ నినో ప్రభావం తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించారు.రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని, కూరగాయల పెంపకం చేయాలని గ్రామ రైతులకు సూచించారు.వివిజిరామ్ జీ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పనులు చేస్తున్న గ్రామ ప్రజలకు ఇంకుడు గుంతల నిర్మాణం జల సంరక్షణనీటి పొదుపు విద్యుత్ పొదుపు వృధా చేయకుండా వినియోగించుకోవాలని కోరారు.మూగ జంతువుల కోసం గ్రామ పరిసర ప్రాంతాలలో మరియు రైతుల పొలంలో దగ్గర నీటి తొక్కిన ఏర్పాటు చేయాలని కళాకారుల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ ఉద్యోగ కళాకారులు హజరత్,కేశవుడు, రాహుల్ ప్రజలను చైతన్యపరిచారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబర్ 9 (జనంసాక్షి) : రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కొడంగల్‌లో నిర్వహిస్తున్న మెగా రైతు మేళాకు మక్తల్ నియోజకవర్గం నుంచి రైతులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. లింగంపల్లి గ్రామం నుంచి రైతుల బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అన్నదాతలకు అండగా నిలవడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇలాంటి మేళాల ద్వారా ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రైతులకు చక్కటి అవగాహన కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల అధ్యక్షులు, నాయకులు, రైతు తదితరులు పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో అక్రమ వెంచర్ల దందా..

- అనుమతులు లేకుండానే స్థలాల విక్రయాలు..?
- నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న పంచాయతీ అధికారులు
- వెంచర్ల యజమానులకు అధికారుల అండదండలా..?
- ప్రజావాణి ఫిర్యాదులకు స్పందన కరువు
- నిబంధనలు బేఖాతర్.. అధికారుల మౌనం

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 9 (జనం సాక్షి) : కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో ప్రైవేటు వెంచర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) నుంచి ప్రాథమిక అనుమతులు మాత్రమే పొందిన రెండు వెంచర్లలో పూర్తిస్థాయి అనుమతులు రాకముందే నిర్మాణ పనులు, స్థలాల విక్రయాలు



కొనసాగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఓ వెంచర్‌లో అనుమతులు లేకుండానే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వెంచర్‌లో స్థలాల విక్రయాల కోసం కరపత్రాలు సిద్ధం చేయడంతో పాటు ఇప్పటికే సుమారు 50 శాతం స్థలాలు విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అక్రమాలపై గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పంచాయతీ అధికారులు కేవలం రెండు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసుల తర్వాత కూడా పనులు కొనసాగుతుండటంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి రెండు వెంచర్ల అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు నోటీసులతోనే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందా? లేక కలెక్టర్ జోక్యంతోనైనా చర్యలు ఉంటాయా? అన్నది వేచి చూడాలి మరి..

పేదల బతుకుల్లో వెలుగులు కాంగ్రెస్‌తోనే సాధ్యం

- గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం

కోహెడ, నవంబర్ 9 (జనంసాక్షి) : మండలంలోని వింజపల్లి గ్రామంలో పారునంది శంకరవ్వ నూతన ఇందిరమ్మ ఇళ్లును ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. దీపావళి వేడుకల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు పారునంది శంకరవ్వ కి నూతన బట్టలు పెట్టీ శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో క్రాకర్స్ కాల్చి బాణసంచా పేల్చి మంత్రి పొన్నం ప్రభాకర్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 10 సంవత్సరాల తర్వాత ఇందిరమ్మ ఇళ్లు పేరు తో పేదలకు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షలు ఇస్తున్నాం అర్హత ఉన్న చాలా మంది ఉన్నప్పటికీ మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పుడు 2000 ఇళ్లు మంజూరు అయ్యాయి.లబ్ధిదారుల ఎంపిక లో అత్యంత పేద వారికి అర్హత ఉన్న వారికి అందిస్తున్నాం. గత 10 ఏళ్లలో ఇల్లు ఇవ్వకపోవడం వల్లే అర్హత కలిగిన వారి సంఖ్య పెరిగి పోయింది. ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు జరుపుకోవడం జరిగింది. అర్హత లేకుండా ఇళ్లు ఇవ్వడానికి లేదు పేదల్లో పేదలకు ఇల్లు ఇస్తామమన్నారు. ఇటీవల వింజపల్లి గ్రామానికి అవార్డు పొందిన



సర్పంచ్ శుభాకాంక్షలు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కోసం గ్రామం నుండి భూమి ఇచ్చిన వారికి ధన్యవాదాలు. గౌరవెల్లి ప్రాజెక్ట్ తో సస్య శ్యామలం చేస్తాం. మొదటి దశలో మంజూరైన 3500 ఇందిరమ్మ ఇల్ల లో ఇప్పటికే 2500 పైగా ఇళ్లు పూర్తయ్యాయి. త్వరలో రెండో దశ ఇల్లు మంజూరు చేస్తున్నాం. అలాగే పెండింగ్ లో ఉన్న ఇల్లు కూడా వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిడివో మహిపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో తెలంగాణకు ఖోఖో క్రీడలో స్వర్ణమే లక్ష్యం

- మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబర్ 9 (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి, జాతీయ స్థాయిలో వారికి మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా క్రీడలకు తెలంగాణ క్రీడాకారులను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.మక్తల్ గ్రౌండ్‌లో ఖేలో ఇండియా ఎంపికల్లో భాగంగా ఖో ఖో క్రీడాకారులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు కల్పించిన వసతులు, శిక్షణ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడాకారులతో, జిల్లా క్రీడా శాఖ అధికారి వెంకటేష్ తో మాట్లాడి వారి సాధన, శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మక్తల్‌లో ఖో ఖో క్రీడకు సంబంధించి మొత్తం మూడు ఎంపిక శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, మొదటి శిబిరం ఈ నెల 1వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. ఈ మూడు శిబిరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన మొత్తం 15 మంది క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 11 నుంచి ప్రారంభం కానున్న ఖేలో ఇండియా క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు అత్యుత్తమ



ప్రతిభ కనబరచాలని మంత్రి ఆకాంక్షించారు. ముఖ్యంగా ఖో ఖో విభాగంలో తెలంగాణ జట్టు స్వర్ణ పతకం సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో చాటాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ, మెరుగైన వసతులు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించే సత్తా తెలంగాణ యువతకు ఉందన్నారు. క్రీడలను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీయడం ప్రభుత్వ లక్ష్యమని, క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేసి విజయాలు సాధించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు.

కాకతీయుల కాలపు నంది విగ్రహాన్ని కాపాడుకోవాలి

- నిర్లక్ష్యపు నీడలో 800 ఏళ్ల నాటి నంది విగ్రహం
- కాపాడుకోవాలంటున్న పురావస్తు పరిశోధకులు శివనాగిరెడ్డి

మక్తల్, నవంబర్ 9 (జనంసాక్షి) : మక్తల్ మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న జక్లేర్‌లో నిర్లక్ష్యంగా పడి ఉన్న 800 సంవత్సరాల నాటి నంది విగ్రహాన్ని కాపాడుకోవాలని, పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మక్తల్ కు చెందిన వారసత్వ కార్యకర్తలు డా.గవినోళ్ల మహేందర్ రెడ్డి, కలాల్ భాస్కర్ గౌడ్ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన జక్లేర్ లోని కాకతీయుల కాలపు శిధిల త్రికోటాలయాన్ని, ఆంజనేయ స్వామి ఆలయాన్ని, ప్రాంగణాన్ని శిల్పాలను పరిశీలించారు. 13వ శతాబ్దినాటి త్రికూటాలయంలో ఒక ఆలయానికి మాత్రమే శిఖరం ఉందని, మిగతా రెండు ఆలయాలకు శిఖరాలు, రంగ మండపం శిథిలమైందని, ఒక ఆలయంలో ఉమామహేశ్వర విగ్రహం, మరో ఆలయంలో శివలింగం భిన్నమై ఉన్నాయని, ప్రధానాలయం ముందు నాలుగడుగుల ఎత్తు రెండు అడుగుల వెడల్పు గల 23వ జైన తీర్థంకుడైన పార్శ్వనాథుడి విగ్రహం ఉందని. ఈ ఆలయాలు అపురూప శిల్పాలు జక్కిలేరు చరిత్రకు అద్దం పడుతున్నాయన్నారు. ఆంజనేయస్వామి ఆలయం ముందు రోడ్డు పక్కన ముళ్ల కంపల్లో కాకతీయుల కాలపు (13వ శతాబ్ది) నంది విగ్రహం రెండు ముక్కలై, నిర్లక్ష్యానికి గురై ఉందని,



అపురూపమైన ఈ శిల్ప కళాఖండాన్ని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోకి తరలించి, ఒక పీఠంపై నిలబెట్టి చారిత్రక వివరాలు తో ఒక పేరు పలకను ఏర్పాటు చేసి, భద్రపరిచాలని జక్లేర్ గ్రామస్తులకు శివనాగిరెడ్డి అవగాహన కల్పించి, విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, జైపాల్ రెడ్డి, నరిటి ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మక్తల్ పట్టణ అభివృద్ధే ధ్యేయం

మక్తల్, నవంబర్ 9 (జనంసాక్షి) : మక్తల్ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 3వ వార్డులో కేశవ నగర్ నుంచి దండు వరకు రూ. 2.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న రహదారి, పంతెన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత



గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పట్టణంలో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగు పంట కాలువలను పరిశీలించిన సబ్ కలెక్టర్



సిర్గాపూర్, నవంబర్ 9 (జనం సాక్షి) : సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ శివారులోని నల్లవాగు ప్రాజెక్ట్ పంట కాలువలను నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆదివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పంట కాలువల నిర్మాణ పనులు, పూడిక తొలగింపు, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే అంశాలపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలువ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి గ్రామంలోని ప్రధాన సమస్యలు, సాగునీటి ఇబ్బందులు, రోడ్లు, తాగునీరు తదితర అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సిర్గాపూర్ తహసీల్దార్ కిరణ్ కుమార్, శ్రీ వర్ధన్, మల్లేశం, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహలక్ష్మితో సొంతింటి కల సాకారం

- అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి అమలు
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి

న్యాల్‌కల్, నవంబర్ 9 (జనం సాక్షి) : నాడు స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ గృహలక్ష్మి" పథకాన్ని ప్రారంభించిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం ద్వారా ఎంతో ప్రయోజనం సమకూరుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి స్పష్టం తెలిపారు. "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాల్లో భాగంగా.. ఆదివారం న్యాల్ కల్, హద్నూర్ గ్రామాల్లో ఇటీవలి నూతనంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్లలో.. దీపావళి సంబరాలను నిర్వహించారు. న్యాల్ కల్ లో 5 ఇండ్లు, హద్నూర్ లో 2 గృహాల్లో.. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలను పంచారు. ఎంపీఓ ధనరాజ్ పర్యవేక్షణలో మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు" నిర్వహించారు. ఇందిరమ్మ 6 గ్యారంటీల పథకాల్లో భాగంగా.."ఇందిరమ్మ గృహలక్ష్మి" పథకం ద్వారా ఇంకను అర్హులైన లబ్ధిదారులు పార్టీలకు అతీతంగా నిర్మించు కోవచ్చని మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు.

మండలానికి 692 ఇండ్లు మంజూరు

మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు గాను గృహలక్ష్మి పథకం ద్వారా 692 ఇండ్లు మంజూరయ్యాయని, ఈపాటికే 181 ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి, పూర్తిస్థాయిలో బిల్లులను అందించడం జరిగిందన్నారు. దాదాపు మరో 400 ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, కొనసాగుతున్న మేరకు త్వరితగతిన బిల్లులను చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల పరిరక్షణలో ఇండ్ల నిర్మాణాల పనులు చెరుకుగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్,



అధికార కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, తిరుపతి రెడ్డి, గిరీష్ రావు జోషి, చంద్రప్ప, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ కుమార్, హద్నూర్ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, భద్రు స్వామి, అంజి, యూనిస్ ఖాన్, నూర్ అలీషా, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పాముల భయం..

- అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు



తాండూర్, నవంబర్ 9(జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా తాండూర్ మండల పరిధిలోని మాదారం గ్రామపంచాయతీలో గల 9వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు భయాందోళనల మధ్య గడుపుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో మరియు లోపలికి తరచూ పాములు వస్తుండటంతో ఇక్కడికి వచ్చే చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయానికి గురవుతున్నారు. చిన్నారులు ఆటలాడుకునే స్థలంలో, కూర్చునే గదుల్లో పాములు దర్శనమిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడం, పారిశుధ్య లోపం కారణంగానే పాములు నక్కి ఉంటున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. చిన్నారుల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన సమస్యపై ఐసీడీఎస్ అధికారులు మరియు ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను శుభ్రం చేయించి, పాములు రాకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, చిన్నారులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని గ్రామస్థులు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మనస్తాపం

- పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



తాండూర్, నవంబర్ 09(జనం సాక్షి) : కుటుంబంలో తరచూ జరుగుతున్న ఆస్తి గొడవల వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన తాండూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. తాండూర్ ఎస్సై ప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం... తాండూర్ మండలానికి చెందిన ఇడిదినేని నాగయ్య (55, వృత్తి: కూలి), అతని భార్య పద్మల మధ్య గత కొంతకాలంగా ఆస్తి విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే సోమవారం (నవంబర్ 09) తెల్లవారుజామున సుమారు 01:30 గంటల ప్రాంతంలో భార్యాభర్తల మధ్య మళ్లీ తీవ్రస్థాయిలో వివాదం చెలరేగింది. కోపోద్రిక్తుడైన నాగయ్య భార్య పద్మను కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి.ఇంట్లో ప్రతిరోజూ ఇలాగే గొడవలు జరుగుతున్నాయని తీవ్ర మనస్తాపానికి, ఆవేదనకు గురైన నాగయ్య.. క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, ప్రథమ చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే నాగయ్య మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు. తమ తండ్రి నాగయ్య మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని, శవ పంచనామా నిర్వహించి చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమార్తె పున్నపురెడ్డి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తాండూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

41 రైస్ మిల్లులపై కేసులున్నా..

బకాయిల వసూళ్లలో జాప్యమెందుకు?

- ప్రభుత్వ సొమ్ము రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్



నిర్మల్ బ్యూరో, నవంబర్ 9 (జనంసాక్షి) : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి డిఫాల్టర్లుగా మారిన రైస్ మిల్లర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని భైంసా, ముధోల్, లోకేశ్వరం, బాసర, సారంగాపూర్, నర్సాపూర్-జి, లక్ష్మణచాంద, ఖానాపూర్, నిర్మల్, మామడ, కడెం, దస్తురాబాద్ తదితర మండలాలకు చెందిన 41 రైస్ మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉన్నాయని తెలిపారు. వీటిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో ఐపీసీ, బీఎన్ఎస్, అత్యవసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. కేసులు నమోదైనప్పటికీ ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లలో, తదుపరి చర్యల్లో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిఫాల్ట్ మిల్లులపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ బకాయిలను తక్షణమే వసూలు చేయాలని, బాధ్యులపై చట్టపరమైన, పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి



మహాదేవపూర్, నవంబర్ 8 (జనంసాక్షి): దీపావళి పండుగ వేళ లక్ష్మీదేవి పూజకు ఏర్పాట్లు చేసుకుంటున్న ఓ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. మర్రి ఆకుల సేకరణ కోసం చెట్టు ఎక్కిన వ్యక్తి ప్రమాదవ శాత్తు పైనుంచి కిందపడి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపో యారు. వివరాల్లోకి వెళ్తే. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ట్రస్సర్ కాలనీకి చెందినఅన్నపూర్ణ హోటల్ నిర్వాహకుడు జైన సదానందం (56) ఆదివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మరో ఐదుగురితో కలిసి ఎడపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి మర్రి ఆకుల సేకరణ కోసం వెళ్లారు. దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీదేవి పూజకు మర్రి ఆకులతో విస్తర్లు తయారుచేసి నైవేద్యం సమర్పించేందుకు ఆకులు తెంపుతున్న క్రమంలో సదానందం ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. పవిత్రమైన దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాల్సిన సమయంలో సదానందం మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. పండుగ వేళ ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సదానందం మృతి వార్త తెలుసుకున్న గ్రామస్థులు, పలువురు ప్రముఖులు ఆయన స్వగృహానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అగ్ని ప్రమాదానికి ఇల్లు దగ్ధం



మహాదేవపూర్, నవంబర్ 9 (జనంసాక్షి): సూరారం గ్రామంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురై ఇల్లు తో పాటు ఇంట్లో ఉన్నటు వంటి వడ్రంగి యంత్రాంగాలు పూర్తి గా కాలిపోయిన సంఘటన సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామమంతా దీపావళి సంబరాలు జరుపుకొని తెల్లవారు నుండి లక్ష్మీదేవి ఆశీర్వాదంతో శుభదినం ప్రారంభమైతుంది అనుకుని నిద్రించారు గ్రామస్తులు. కానీ అదే గ్రామానికి చెందిన వంగల శేఖర్ కూడా దీపావళి పర్వదిన కార్యక్రమాన్ని జరుపుకొని తెల్లవారికి లక్ష్మీదేవి ఆశీస్సులతో తమ రోజు ప్రారంభమైతుంది అనుకున్న వారిలో శేఖర్ ఒకడు, కానీ శేఖర్ కు అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా భారీ మంటలు చెలరేగడం, తన పనులు చేసుకునే సామాగ్రి అంతా మంటల్లో కాలిపోవడం చూస్తున్న ఆ కుటుంబం తట్టుకోలేని బాధలు ఆ రాత్రి అనుభవించింది, చూస్తుండగానే ఇల్లు తో పాటు ఇంట్లో ఉన్న వడ్రంగి యంత్రాలు పూర్తిగా ఖాళీ బూడిద కావడం జరిగింది, సుమారు ఇల్లు యంత్రాలు కలుపుకొని మూడు లక్షల రూపాయల నష్టం ఆ పేద కుటుంబానికి వాటిల్లింది. ప్రమాదంలో పూర్తిగా కాలిపోవడంతో శేఖర్ కుటుంబం రోడ్డున పడేలా చేసింది. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరినారు.

వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

- వైద్య రంగానికి 9 కోట్ల రూపాయల డిఎంఎఫ్ నిధులు మంజూరు
- 4 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు
- 2 నూతన అంబులెన్స్ లను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- కార్డియాలజిస్టు నియామకంతో పాటు క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 9 (జనంసాక్షి) : జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలోనే ఆదర్శ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరు చేసిన 2 నూతన అంబులెన్సులను మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్, ఆర్.ఎం.ఓ. శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాణేష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... గత ఏడాది కాలంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) నిధుల నుంచి వైద్య రంగానికి 9 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన వైద్య పరికరాలకు మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. వెంటిలేటర్ల కొరతను అధిగమించేందుకు 10కి పైగా నూతన వెంటిలేటర్లను కొనుగోలు చేయడం జరిగిందని, మాతా శిశు ఆసుపత్రి కోసం 4, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కోసం 6 చొప్పున మొత్తం 10 వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే 4 కోట్ల రూపాయలకు పైగా విలువైన వైద్య పరికరాల కొనుగోలు పూర్తయిందని, అదనంగా 4.2 కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా, త్వరలోనే మరిన్ని ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు మెరుగైన శస్త్రచికిత్స సేవలు అందించేందుకు సుమారు 80 లక్షల రూపాయల వ్యయంతో 2 ల్యాపరోస్కోపీ యూనిట్లను కొనుగోలు చేయడం జరుగుతుందని, వీటి ద్వారా తక్కువ రక్తస్రావంతో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. హెచ్ఐవి, హెపటైటిస్-బి వంటి హైరిస్క్ రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు మాతా శిశు ఆసుపత్రిలో ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించిన నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన వైద్య పరికరాలు, శస్త్రచికిత్స సదుపాయాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని, ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయవలసిన పరిస్థితులు తగ్గించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో రోజుకు సుమారు 1 వేయి 700 నుంచి 2 వేల మంది వరకు అవుట్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వచ్చే ఏడాది సర్జరీ, అనస్థీషియా తదితర విభాగాలలో పి.జి. సీట్లు, భవిష్యత్తులో సూపర్ స్పెషాలిటీ కోర్సులు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. కార్డియాలజిస్టు నియామకంతో పాటు క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. లక్షెట్టిపేట ఆసుపత్రిలో ప్రస్తుతం రోజుకు కనీసం 300 మంది నుంచి 500 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారని, సీజన్‌లో రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని తెలిపారు. వైద్య కళాశాల, ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి జనవరి 26, 2027వ తేదీ నాటికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి కొత్త భవనంలో వైద్య సేవలు ప్రారంభించే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాను వైద్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ సాగర్ రావు మాట్లాడుతూ ప్రజలకు అత్యంత అవసరమైన రంగాలు వైద్యం, విద్య అని, ఈ రంగాలలో ప్రభుత్వ సేవలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సిబ్బంది పరిమిత వనరులతోనూ అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు మరో 2, 3 నెలలలో పూర్తయితే ప్రస్తుతం ఉన్న సమస్యలలో దాదాపు 50 శాతం పరిష్కారమవుతాయని తెలిపారు. క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు చేసి, కార్డియాలజిస్టును నియమించేలా చర్యలు తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధులకు జిల్లాలోనే మెరుగైన వైద్యం అందించవచ్చని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన ప్రారంభోత్సవాన్ని జనవరి 26వ తేదీన నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత విస్తరించి జిల్లాను వైద్య రంగంలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

మహనీయుల విగ్రహాల తొలగింపు ఆలోచన విరమించుకోవాలి

- దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా



నల్లబెల్లి, నవంబర్ 09(జనంసాక్షి): నల్లబెల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను తొలగించాలన్న ఆలోచనను అధికారులు తక్షణమే విరమించు కోవాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గన్నారపు అఖిల్ మాదిగ మాట్లాడుతూ.. నల్లబెల్లి బస్టాండ్ సమీపంలో కొన్ని సంవత్సరాలుగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను తొలగించాలంటూ నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మహనీయుల విగ్రహాలను తొలగించాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, దళిత సామాజిక వర్గానికి డిపో మేనేజర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహనీయుల విగ్రహాలు సమాజానికి స్ఫూర్తినిచ్చే చిహ్నాలని, వాటి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాలని అన్నారు. విగ్రహాల తొలగింపు విషయంలో అధికారులు పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నాగేళ్లి ప్రకాష్ మాదిగ, గ్రామ కమిటీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు జన్ను ప్రవీణ్ మాదిగ, ఉపాధ్యక్షుడు కనకం భరత్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దండు ప్రవీణ్ మాదిగ, కార్యదర్శి పొడేటి సునీల్ మాదిగ, సీనియర్ నాయకులు పరిగి రత్నం మాదిగ, పరికి కోర్నెల్ మాదిగ, జన్ను జయరావు మాదిగ, బట్టు సాంబయ్య, పొడేటి సాగర్ మాదిగ, మనుగొండ సూర్యపవన్ మాదిగ, నాగేళ్లి అనిల్ మాదిగ, కనకం నవీన్ మాదిగ, నాగేళ్లి ప్రకాష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

- యంత్రాల భద్రత, నిల్వ ఏర్పాట్లపై పరిశీలన



నిర్మల్ బ్యూరో, నవంబర్ 9 (జనంసాక్షి) : ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రపరిచే గోదాంను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో యంత్రాల భద్రత, నిల్వ ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేసి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట మాధవరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారి స్వాతి, తహసీల్దార్ రాజు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



పరకాల, నవంబర్ 09 (జనంసాక్షి): యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పరకాలలో జరిగిన పరకాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల వల్ల క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.పుట్టిన పరకాల గడ్డ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని, నిరుద్యోగ యువత కోసం పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పీపీఎల్ విజేతలకు ఫౌండేషన్ తరపున బహుమతులు స్పాన్సర్ చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్స్ ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, నాగుర్ల వెంకన్న, మోలుగురి భిక్షపతి, మాజీ వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్ లు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ఎమ్మెల్యే గండ్ర

- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ
- కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- సాంబమూర్తి ఆలయంలో ప్రత్యేక పూజలు
- 101 కొబ్బరికాయలు కొట్టిన అభిమానులు



మొగుళ్ళపల్లి, నవంబర్ 09(జనంసాక్షి) : జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. స్థానిక బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి స్థానికులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మొగుళ్ళపల్లిలోని ప్రసిద్ధ శ్రీ సాంబమూర్తి దేవాలయంలో ఎమ్మెల్యే గండ్ర పేరున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ అభిమానులు, నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టి తమ వీరాభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాలకు ఆశాజ్యోతిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నిలుస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో ఎవరికి ఆపద వచ్చినా 'నేనున్నానంటూ' 108 వాహనం కంటే వేగంగా స్పందించే నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడు ఎమ్మెల్యే గండ్ర అని ప్రశంసించారు. భూపాలపల్లిలో గత పాలకులు చేయని అభివృద్ధిని, గత మూడేళ్లుగా రోజుకు 18 గంటల పాటు శ్రమిస్తూ ఎమ్మెల్యే ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజా నాయకుడైన గండ్ర సత్యనారాయణ రావుకు మంత్రివర్గంలో సముచిత స్థానం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్ర కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకు ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన సర్పంచులు, ఉప సర్పంచులు, ముఖ్య కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమకొండలో 'చిప్రిక్స్ ఫార్మా'పై డ్రగ్ కంట్రోల్ అధికారుల మెరుపు దాడి

- లైసెన్స్ లేదు.. నాణ్యతా లేదు.. అర్ధరాత్రి వరకు సాగిన విస్తృత తనిఖీలు
- రూ.15 లక్షల విలువైన అక్రమ ఔషధాల నిల్వలు సీజ్
- ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 9 (జనం సాక్షి) : అనుమతులు లేకుండా, నిబంధనలను తొక్కేసి మందుల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమ నిల్వ కేంద్రం గుట్టు రట్టయింది. నగరంలోని హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలో ఎలాంటి లైసెన్స్ లేకుండా నడుపుతున్న ఒక ఫార్మా నిల్వ కేంద్రంపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు మెరుపు దాడులు జరిపి, రూ.15 లక్షల విలువైన మందులను సీజ్ చేశారు. - నివాస గృహంలో 'అక్రమ' మందుల డెన్ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం సమీపంలో ఉన్న ఓ నివాస గృహంలో 'చిప్రిక్స్ ఫార్మా' డైరెక్టర్ బొబ్బల సృజన్ రెడ్డి గత ఆరేళ్లుగాఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం సాగిస్తున్నాడు. నాణ్యతా ప్రమాణాలు లేని మందులను ఇక్కడ అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్, కమిషన్ చైర్మన్ డాక్టర్ రాధాకృష్ణల దృష్టికి వచ్చింది. వారు వెంటనే ఆధారాలతో సహా హనుమకొండ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు.అర్ధరాత్రి 2 గంటల వరకు ఉత్కంఠ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన అధికారులు డ్రగ్ ఇన్స్పెక్టర్లతో కలిసి రంగంలోకి దిగారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఈ సోదాలు తెల్లవారుజామున 2 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగాయి. ఇల్లు మొత్తం తనిఖీ చేయగా భారీగా పేరుకుపోయిన అక్రమ మందుల నిల్వలు వెలుగు చూశాయి. వీటి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ దాడుల్లో హనుమకొండ డ్రగ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, వరంగల్ డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, భూపాలపల్లి డ్రగ్ ఇన్స్పెక్టర్ పల్లవిలు పాల్గొన్నారు. ప్రజారోగ్యంతో ఆడుకుంటే ఊరుకోం లైసెన్స్ లేకుండా మందులు అమ్మడం, నిబంధనలకు విరుద్ధంగా సబ్-స్టాండర్డ్ ఔషధాలను నిల్వ ఉంచడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని డ్రగ్ కంట్రోల్ అధికారులు స్పష్టం చేశారు. నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సకాలంలో స్పందించి అక్రమ దందాను అరికట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులను, ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన సత్యనారాయణ గౌడ్, డాక్టర్ రాధాకృష్ణ లను అభినందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 నవంబర్ 2026

తాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత

- ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు
- జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 9 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ, కరువు పరిస్థితులు ఏర్పడినా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను జలాశయాలు, చెరువులకు మళ్లించి నీటి నిల్వలను పెంచుతున్నామని పేర్కొన్నారు. వైరా జలాశయం డెడ్‌స్టోరేజీకి చేరుకున్న నేపథ్యంలో రాజీవ్ కాలువ ద్వారా నీటిని మళ్లించి నింపేందుకు చర్యలు తీసుకున్నామని, తద్వారా వైరా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది మండలాలకు తాగునీటి భరోసా కల్పిస్తున్నామని వివరించారు. ఖరీఫ్ 2026 సీజన్‌లో అశ్వాపురం మండలం బి.జి. కొత్తూరు పంప్‌హౌస్ ద్వారా 1,604 గంటలపాటు మోటార్లను నడిపి గోదావరి నుంచి 9.088 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని తెలిపారు. ఇతర పంప్‌హౌస్‌ల ద్వారా కూడా నీటిని వివిధ ప్రాంతాలకు తరలించి ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్, తల్లాడ తదితర మండలాల్లోని నీటి వనరులను బలోపేతం చేసినట్లు వెల్లడించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పరిధిలోని 20 చిన్న నీటిపారుదల చెరువుల్లో మొత్తం 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల గోదావరి జలాలను నిల్వ చేసి 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఏ ఒక్క కుటుంబాన్నీ అభివృద్ధికి దూరం చేయం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పేద కుటుంబాల సమగ్ర అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాల అమలు

మధిర, నవంబర్ 9 (జనంసాక్షి) : పేద కుటుంబాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ఏ ఒక్క కుటుంబాన్నీ వెనుకబడనివ్వబోమని ప్రకటించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారు ముప్పసాని కృష్ణవేణి కుటుంబంతో కలిసి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా దీపావళి వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, ఇప్పటివరకు మంజూరు చేసిన 8 లక్షల ఇళ్లతో ఈ పథకం ఆగిపోదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రారంభమైన ఈ పథకం తెలంగాణలో ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి



సొంత ఇల్లు సమకూరే వరకు కొనసాగుతుందని తెలిపారు. తరతరాలుగా సొంత ఇల్లు లేకుండా జీవించిన అనేక పేద కుటుంబాల జీవితాల్లో ఇప్పుడు మార్పు వస్తోందని చెప్పారు. ఇప్పటివరకు మంజూరు చేసిన 8 లక్షల ఇళ్లలో మొదటి విడతలోనే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, వీటిలో సుమారు 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయి పేద కుటుంబాలు సొంతింటి యజమానులుగా గర్వంగా జీవిస్తున్నాయని వివరించారు. మరో 1.75 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత లేదని, ప్రజా ప్రభుత్వం ఇప్పటికే ఈ పథకం కోసం రూ.40 వేల కోట్లను మంజూరు చేసిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. 65 వేల ఇళ్లకు సంబంధించి తుది బిల్లులు చెల్లించామని, మరో 1.75 లక్షల ఇళ్ల బిల్లులను ఈ నెలాఖరులోగా విడుదల చేస్తామని చెప్పారు. తెలంగాణలో ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండే రోజు ఎంతో దూరంలో లేదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పథకానికి ఎలాంటి పరిమితి లేదని, అర్హులైన పేదలకు మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. పేదలకు ఇళ్లు కల్పించడంతోపాటు వారి సమగ్ర అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తూనే, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80 ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి ఉచితంగా పంపిణీ చేస్తూ ఆహార భద్రత కల్పిస్తున్నామని వివరించారు. పేద కుటుంబాల్లో ఎవరూ వైద్య ఖర్చుల భారం వల్ల ఇబ్బందులు పడకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో పేద కుటుంబానికి రూ.10 లక్షల వైద్య బీమా సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.

నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం

- ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



బూర్గంపహాడ్, నవంబర్ 9 (జనంసాక్షి) : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపహాడ్ మండలంలోని టేకులచెరువు గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు, పట్టాల పంపిణీ ద్వారా వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, బూర్గంపహాడ్ గ్రామ సర్పంచ్ మంద నాగరాజు, లక్ష్మీపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వర రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, పలు గ్రామాలు ఉప సర్పంచ్లు, కాంగ్రెస్ నాయకులు వారాల వేణు, కైపు రోసిరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భజన ప్రసాదు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, తాసిల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, ఏవో శంకర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న సత్తుపల్లి డిపో కండక్టర్ బి.నరేష్

- ప్రయాణికురాలు మరిచిపోయిన పర్సు
- పదివేల రూపాయల నగదు తిరిగి అందజేత



కల్లూరు, నవంబర్ 9 (జనం సాక్షి) : సత్తుపల్లి నుండి ఖమ్మం వెళుతున్న టీఎస్‌ూ4 యు ఈ 2229 బస్సులో ప్రయాణికురాలు కల్లూరు మండలం కొర్ల గూడెం గ్రామానికి చెందిన గుంజి సత్యవతి, బస్సులో మర్చిపోయిన పర్సును అందులో ఉన్న 10,000 రూపాయల నగదును నిజాయితీతో సత్తుపల్లి డిపో కండక్టర్ బి.నరేష్. ప్రయాణికురాలికి అందించారు. సోమవారం ఉదయం వి.యం.బంజర నుండి కల్లూరు కు టిఎస్ ూ4 యు ఈ 2229 ఎక్స్ప్రెస్ బస్సులో గుంజి సత్యవతి ప్రయాణికురాలు ప్రయాణించినారు. బస్సు దిగే సమయంలో తన వద్ద ఉన్న కవర్ బస్సులోనే మర్చిపోయి దిగి ఇంటికి వెళ్ళిపోయినారు. బస్సు కల్లూరు దాటిన తర్వాత టికెట్లు కొట్టేందుకు బస్సు లోపల వెనకకు వెళ్ళగా సీటు కింద కవర్ కనిపించడంతో కండక్టర్ బి. నరేష్ ఈ 826334 గమనించి దానిని ఓపెన్ చేసి చూడగా పర్సులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఆధారంగా ప్రయాణికురాలికి ఫోన్ చేశారు. ఖమ్మం నుండి తిరుగు ప్రయాణంలో కల్లూరు బస్టాండ్ నందు కండక్టర్ కంట్రోలర్ ఆర్.వి. రావు సమక్షంలో పదివేల రూపాయల నగదు తో ఉన్న పర్సన్ ను ప్రయాణికురాలికి అందించడం జరిగినది. తాను పోగొట్టుకున్న పర్సు అందులోనే 10,000 నగదు దొరుకుతుంది అని అనుకోలేదని ఎంతో నిజాయితీతో సత్తుపల్లి ఆర్టీసీ కండక్టర్ బి.నరేష్ తనకు తిరిగి అప్పగించడం పట్ల కండక్టర్ నరేష్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీతో నగదును పోగొట్టుకున్న ప్రయాణికురాలికే అప్పగించడం పట్ల సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కండక్టర్ నరేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. గుంజి సత్యవతి ఆర్టీసీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు

- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క



ఎర్రుపాలెం, నవంబర్ 9 (జనంసాక్షి) : ప్రజాప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం ఎర్రుపాలెంలోని బంజర పెద్ద గోపవరం గ్రామాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొని టపాసులు కాకరపువత్తులు కాల్చి దీపావళి సంబరాలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటా ఆనందం, వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఖమ్మం, చూడా చైర్మన్, పువ్వాళ్ళ.దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, నూతి.సత్యనారాయణ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, వేజెండ్ల.సాయికుమార్, మాజీ ఎమ్మెల్యే, కొండ బాల.కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి తదితరులు,పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



కీసర, నవంబర్ 9 (జనంసాక్షి) : సమాజ ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముప్పా రామారావు అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ముప్పా శ్రీలత, రామారావు పారిశుధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముప్పా రామారావు మాట్లాడుతూ.. ఎండనక, వాననక అహర్నిశలు శ్రమిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి నిస్వార్థ సేవలకు గుర్తింపుగా, పండుగ కానుకలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో శ్రీగంగమ్మ దేవుని గుడి హుండీ చోరీ

- శనివారం అర్ధరాత్రి హుండీ ఎత్తుకెళ్లిన దొంగలు
- ఆలయం పక్కనే ఉన్న పొలంలో పగలగొట్టి పడేసిన దుండగులు
- దీపావళి పండుగ వేళ దొంగతనంపై అవాక్కయిన భక్తులు
- రంగంలోకి దిగి విచారణ చేపట్టిన పోలీసులు



మాడుగులపల్లి, నవంబర్ 9 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కొత్తగూడెం గ్రామంలోని శ్రీ గంగమ్మ దేవుని ఆలయంలో హుండీ చోరీకి గురైన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది స్థానికులు, గ్రామీణులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి అజ్ఞాత వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి గంగమ్మ తల్లి హుండీని ఎత్తుకెళ్లారు ఆలయానికి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలో ఆ హుండీని పగలగొట్టి పడేసి వెళ్లినట్లు గుర్తించారు దొంగలు హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకెళ్లే క్రమంలో, భక్తులు వేసిన కానుకల సొమ్ములో కొంతమేర నగదు హుండీలోనే పడి ఉన్నట్లు తెలుస్తోంది దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు గుడిలో దొంగతనం జరిగిన తీరు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు పండుగ పూట అమ్మవారి గుడిలోనే దొంగతనం జరగడంపై గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని విస్తృత ఎంక్వయిరీ (దర్యాప్తు) చేపట్టారు పొలంలో పడి ఉన్న హుండీని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు ఈ చోరీకి పాల్పడ్డ దొంగలు ఎవరు, ఎంత మొత్తంలో సొమ్ము అపహరణకు గురైందనే పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియాల్సి ఉంది నిందితులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానిక భక్తులు, గ్రామస్థులు కోరుతున్నారు.

గైనకాలజిస్ట్ ప్రతిరోజూ అందుబాటులో ఉండాలి

- వైద్యులు, సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉండాలి
- కలెక్టర్ అంకిత్ ఆదేశం
- రోజు విడిచి రోజు గైనకాలజిస్ట్ విధులకు రావడంపై అసహనం

బూర్గంపహాడ్, నవంబరు 9 (జనంసాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని, వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం బూర్గంపహాడ్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యసేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రోజు విడిచి రోజు విధులకు హాజరవుతున్నారని వైద్యాధికారి వివరించడంతో, వెంటనే జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారికి ఫోన్ చేసి గైనకాలజిస్ట్ ప్రతిరోజూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, మహిళా రోగులకు వైద్యసేవల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి, రక్తపరీక్షల కేంద్రంలో అందుబాటులో ఉన్న పరీక్షలు, నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వైద్యసేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ నిరంతరం పారిశుధ్య చర్యలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, ఆహార తయారీలో పరిశుభ్రత పాటించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం వార్డులో 15 మంది రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు వివరించారు. అనంతరం నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు



పూర్తయ్యే సమయంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. అవసరమైన కార్మికులను పెంచి నిర్మాణ పనులను వేగవంతం చేసి, భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గడ్డం ప్రసాద్, వైద్యులు అమరేందర్ రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 9 (జనం సాక్షి) : స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో డిసెంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో ఖేలో ఇండియా పోటీల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీల నిర్వహణపై ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయస్థాయి పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, సహాయక సిబ్బంది, సాంకేతిక నిపుణులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పోటీ కోసం మొత్తం 134 మంది జిల్లాకు వస్తున్నారని ఇందులో 64 మంది క్రీడాకారులు, 20 మంది సహాయక సిబ్బంది, 20 మంది సాంకేతిక సిబ్బంది, 24 మంది క్రీడా వాలంటీర్లు, ఇతరులు ఉంటారని తెలిపారు. వీరికి అవసరమైన వసతి సదుపాయాల కోసం చెక్‌లిస్ట్ ప్రకారం మొత్తం 74 గదులను ముందస్తుగా బుక్ చేయాలని ఆదేశించారు. క్రీడాకారులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా 22 వాహనాలను ఏర్పాటు చేయాలని, వాహనాలు, హోటళ్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి రామానుజం, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఆర్టీఓ జగదీష్, ఫైర్ అధికారి బి.అజయ్ కుమార్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ వి. రంజిత్, అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో కుక్కలు, కోతుల బెడద

- విద్యార్థుల భద్రతపై ఆందోళన జిల్లా కలెక్టర్‌కు పిపిఎల్ వినతి
- విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి, నవంబర్ 9 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లాలోని సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ స్కూళ్లలో కుక్కలు, కోతుల బెడద పెరుగుతుండటంపై ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరింది. పాఠశాలల పరిసరాల్లో కుక్కలు స్వేచ్ఛగా సంచరిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని సంఘం నాయకులు తెలిపారు. కొన్ని కుక్కల శరీరాలపై చర్మవ్యాధి లక్షణాలు కనిపిస్తూ గాయాల నుంచి రక్తస్రావం జరుగుతున్న పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల పరిసరాల్లో కోతుల సంచారం పెరగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రేమతో తీసుకొచ్చే ఆహార పదార్థాలను కోతులు లాక్కెళ్తున్నాయని తరగతి గదులు, వసతి గృహాల పరిసరాల్లోకి ప్రవేశిస్తుండటంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

పాఠశాలల ఆవరణల్లో కుక్కలు మలవిసర్జన చేయడం వల్ల అపరిశుభ్రత, దుర్వాసన ఏర్పడి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే వసతి గృహాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఇటువంటి ఇబ్బందులు మరింత భారంగా మారుతున్నాయని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి

జిల్లాలోని అన్ని గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సంఘం కోరింది. సంబంధిత మున్సిపల్, గ్రామపంచాయతీ, పశువైద్య శాఖల అధికారుల సమన్వయంతో కుక్కల సమస్యను పరిష్కరించాలని, అనారోగ్యంతో ఉన్న కుక్కలకు వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని విజ్ఞప్తి చేసింది. కోతుల బెడద నివారణకు అటవీశాఖ అధికారుల సహకారంతో తగిన చర్యలు చేపట్టాలని కోరింది. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, భయరహితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ



బాధ్యత అని, చిన్నారుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేసింది. ఈ సమస్యలకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పిపిఎల్) నల్లగొండ జిల్లా అధ్యక్షులు గ్యార యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంటేపాక సుష్మ, రాష్ట్ర కోశాధికారి ఆకులపల్లి శ్రీను, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు.



ఒడుదొడుకులు ఎదుర్కొని లాభాల్లో ముగిసిన సూచీలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి లాభాల్లో స్థిరపడ్డాయి. మూరత్ ట్రేడింగ్‌లో స్వల్ప నష్టాలు ఎదుర్కొన్న సూచీలు.. నేడు మళ్లీ స్వల్పంగా లాభపడ్డాయి. దీంతో నిఫ్టీ తిరిగి 25వేల మార్కును అందుకుంది.సెన్సెక్స్ ఉదయం 81,327.29 పాయింట్ల వద్ద స్వల్ప లాభాలతో (క్రితం ముగింపు 80,999.40) ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 80,519.31-81,339.41 మధ్య చలించింది. చివరికి 107.25 పాయింట్ల లాభంతో 81,106.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 58.25 పాయింట్ల లాభంతో 25,044.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.93గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో ఎస్‌బీఐ, ట్రెంట్, ఎల్‌అండ్‌టీ, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4098 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



మిస్టరీ ప్రొఫైల్.. సీఈఓతో రిలేషన్

: ఎవరీ అలిస్ హువాంగ్

అలిస్ హువాంగ్ టెక్ ప్రపంచంలో ఇప్పుడు ఈ పేరు తెగ వైరల్ అవుతోంది. ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌తో ఆమెకు ఎలా పరిచయం ఏర్పడింది? అసలు ఆమె ప్రొఫైల్ ఏంటి? అనే ఆసక్తి మొదలైంది.చైనా జాతీయురాలైన అలిస్ హువాంగ్ అసలు పేరు హువాంగ్ లీ (ఊబీజీనిణ ఒవ). సింగపూర్‌కి చెందిన మెగా స్పీడ్‌లో టాప్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేశారు. చైనీస్ ప్రైవేట్ ఫండ్ డేటా బేస్‌లో ఆమె వివరాలు లభ్యమయ్యాయి. టీవీ రిపోర్టర్‌గా కెరీర్ ప్రారంభించిన అలిస్.. తొలుత హునాన్ టీవీలో ఆ తర్వాత ప్రభుత్వ ప్రసార సంస్థ సీసీటీవీలో పనిచేశారు. అనంతరం హెచ్‌ఎస్‌బీసీ ప్రైవేట్ బ్యాంకింగ్ డివిజన్ ప్రెసిడెంట్‌కు అసిస్టెంట్‌గా, సిటిక్ సెక్యూరిటీస్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా ఎదిగారు. షాంఘై హెక్సీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఫండ్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ కంపెనీకి చైనీస్ గేమింగ్ కంపెనీ సంబంధం ఉన్నట్లు సమాచారం. మెగాస్పీడ్ కంపెనీ స్థాపించడం వెనక 7బిలీనీజీట ఉన్నట్లు తెలుస్తోంది. 2023లో మెగా స్పీడ్‌ను స్థాపించిన ఆమె అదే ఏడాది దానిని స్విఫ్ట్ డేటాకు విక్రయించారు. కానీ ఆ సంస్థతో సంబంధాలు కొనసాగించారు. ఇప్పుడు ఆ సంస్థ ఎన్విడియాకు ప్రధాన వ్యాపార భాగస్వామిగా ఉంది. మెగాస్పీడ్ గత రెండేళ్లలో 4.8 బిలియన్ డాలర్ల విలువైన ఎన్విడియా చిప్‌లను కొనుగోలు చేసింది.

మిస్టరీ ప్రొఫైల్..

ఇదిలా ఉంటే.. అలిస్ గురించి తాను ఎప్పుడూ వినలేదని హునాన్ టీవీ ఎగ్జిక్యూటివ్ ఒకరు వెల్లడించారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. మరోవైపు సీసీటీవీ వెబ్‌సైట్‌లో ఆమె ప్రొఫైల్ ఏదీ లభించలేదని పేర్కొన్నట్లు తెలిపింది. దాంతో ఆమె ప్రొఫైల్ మిస్టరీగా మారింది. ఇప్పుడు చైనా స్పైగా అలిస్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అసలు ఈమెకు జెన్సన్ హువాంగ్ (ఔలతిటతిజీ అఱా ఏవనిబవని ఊబీజీనిణ)తో ఎప్పుడు పరిచయం ఏర్పడింది, అది ఎంతకాలం కొనసాగిందనే దానిపై స్పష్టత లేదు. 2024లో తైపీ (తైవాన్)లో వీరిద్దరు తొలిసారి కెమెరాలకు చిక్కారు.



'చాయ్' నుంచి 'సోర్స్ కోడ్' వరకు..

కార్పొరేట్ చరిత్రలో గూఢచర్యం కొత్తేం కాదు..! చైనీస్ 'గూఢచారి'తో అమెరికా చిప్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):హువాంగ్ అనైతిక బంధం టెక్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ ఘటనతో 'పారిశ్రామిక గూఢచర్యం వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. శత్రువులను ఆర్థికంగా కుంగదీసేందుకు ఇదో బలమైన ఆయుధం. కొన్నిసార్లు ఇది బాధిత దేశాల ఆధిపత్యాన్ని, బలాబలాలను తారుమారుచేసిన సందర్భాలూ చరిత్రలో ఉన్నాయి. 'ది గ్రేట్ ఇండియన్ రాబరీ', 'సబ్‌మెరైన్ కుంభకోణం' వంటి ఘటనలే ఇందుకు ఉదాహరణ..! భారతీయులకు 'టీ' అలవాటు చేసింది బ్రిటిషర్ల అన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ 'చాయ్' పేటెంట్ హక్కులు మాత్రం బ్రిటన్‌వి కాదు. 19వ శతాబ్దంలో చైనా నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ ఈ వ్యాపారాన్ని దొంగిలించింది. ఇందుకోసం గూఢచర్యానికి పాల్పడింది. అప్పట్లో తేయాకు వ్యాపారానికి చైనా గుత్తాధిపత్యం వహించింది. ఆ దేశం నుంచి కొనుగోళ్లను ఆర్థిక భారంగా భావించిన బ్రిటన్.. టీ పరిశ్రమ రహస్యాలను తెలుసుకునేందుకు స్కాట్లాండ్ వృక్ష శాస్త్రవేత్త రాబర్ట్ ఫార్చూన్‌ను కార్పొరేట్ గూఢచారి వలే చైనాకు పంపించింది. చైనీస్ వ్యాపారి వేషధారణలో ఆ దేశ తేయాకు తోటలకు వెళ్లిన రాబర్ట్.. అత్యంత చాకచక్యంగా దాదాపు 20వేల మొక్కలు, విత్తనాలు, తేయాకు సాగుకు సంబంధించిన వాణిజ్య రహస్యాలను సేకరించారు. నాడు భారత్‌ను పాలిస్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీకి వాటిని అందించారు. అలా తేయాకు సాగు భారత్‌కు చేరింది. అంతేకాదు.. భారతీయులకు తేయాకు పెంచడంపై శిక్షణ ఇచ్చేందుకు కొంతమంది చైనీస్ టీ వర్కర్లను కూడా నియమించుకున్నట్లు పలు అధ్యయనాలు పేర్కొన్నాయి.



అమెరికాకు తెలియకుండా..

1980ల్లో ప్రచ్ఛన్న యుద్ధం చివర్లో చోటుచేసుకున్న తోషిబా-కాంగ్స్‌బర్గ్ కుంభకోణం.. అంతర్జాతీయ వాణిజ్య చరిత్రలోనే అతిపెద్ద ఉల్లంఘనల్లో ఒకటిగా నిలిచింది. జపాన్‌కు చెందిన తోషిబా మెషిన్ కంపెనీ, నార్వేకు చెందిన కాంగ్స్‌బర్గ్ కంపెనీతో కలిసి.. నాటి సోవియట్ యూనియన్‌కు అధునాతన కంప్యూటర్ కంట్రోల్డ్ అజిఅ మిల్లింగ్ మెషీన్ల (ప్రొపెల్లర్లు తయారు చేసే యంత్రాలు)ను విక్రయించింది. దీంతో పాటు న్యూమరికల్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌ను అక్రమంగా ఎగుమతి చేసింది. వాస్తవంగా సోవియట్‌కు ఈ టెక్నాలజీ విక్రయించకూడదనే ఆఅఆఓ (పాశ్చాత్య దేశాల ఎగుమతి నియంత్రణ ఒప్పందం) నిబంధనలను ఉల్లంఘించి జపాన్ ఈ చర్యలకు పాల్పడింది. ఈ యంత్రాలను ఉపయోగించి తయారు చేసిన సోవియట్ సబ్‌మెరైన్‌ల ప్రొపెల్లర్లు మరింత నిశ్శబ్దంగా తయారయ్యాయి. దాంతో పాశ్చాత్య దేశాలు వాటిని గుర్తించడం కష్టమైంది. 1987లో ఈ విషయం బయటపడిన తర్వాత అమెరికా-జపాన్ సంబంధాలు దెబ్బతిన్నాయి. తోషిబా అధికారులపై నాడు అగ్రరాజ్యం కొంతకాలం ఆంక్షలు కూడా విధించింది.

ఐబీఎం వర్సెస్ హితాచీ..

అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబీఎం రహస్యాలను తెలుసుకునేందుకు జపాన్‌కు చెందిన హితాచీ కార్పొరేట్ గూఢచర్యానికి పాల్పడింది. 1982లో ఈ ఘటన జరిగింది. హితాచీకి చెందిన కొందరు ఉద్యోగులు ఐబీఎం కొత్తతరం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లు, సోర్సు కోడ్ గురించిన రహస్య సాంకేతిక పత్రాలు, స్పెసిఫికేషన్లను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం కొన్ని కంపెనీలకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించారు. ఈ గూఢచర్యాన్ని ఎఫ్‌బీఐ అండర్‌కవర్ ఆపరేషన్ నిర్వహించి తెలుసుకుంది. దాంతో ఈ వ్యవహారం బయటపడింది. అనంతరం ఈ కేసు కోర్టుకెక్కగా.. హితాచీ తన నేరాన్ని అంగీకరించి జరిమానా చెల్లించింది.

మరికొన్ని ఘటనలు..

1990ల్లో తైవాన్‌కు చెందిన ఫోర్ పిల్లర్స్ అనే సంస్థ.. అమెరికా తయారీ కంపెనీ అవెరీ డెన్నిసన్‌లో పనిచేసే ఓ రీసర్చ్ సైంటిస్ట్‌ను కొనుగోలు చేసింది. ఆ శాస్త్రవేత్త సాయంతో అమెరికా సంస్థ రహస్య కెమికల్ ఫార్ములాలు, తయారీ ప్రక్రియను సంపాదించింది. ఈ వ్యవహారం బయటపడటంతో అమెరికా ఆర్థిక గూఢచర్య చట్టం కింద దర్యాప్తు జరిపి భారీ జరిమానాలు విధించింది.1997లో జిలెట్ కంపెనీ గూఢచర్యం బారిన పడింది. వాషింగ్టన్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ కంపెనీలో చేరి సరికొత్త షేవింగ్ సిస్టమ్ వాణిజ్య రహస్యాలను తెలుసుకున్నాడు. వాటిని జిలెట్ ప్రత్యర్థి కంపెనీలకు చేరవేశాడు. ఈ వ్యవహారం బయటపడి నిందితుడికి 15ఏళ్ల జైలు శిక్షపడింది.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 5.30	₹ 5.32

బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,52,910 (22 క్యారెట్లు)	₹ 1,66,480 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,05,000

పండగపూట విషాదం

- స్వగ్రామానికి వస్తుంగా రోడ్డు ప్రమాదం
- హుస్నాబాద్ మండలం పందిళ్ల వద్ద కారును ఢీకొన్న ట్రాక్టర్
- అక్కడికక్కడే తండ్రి, కూతురు మృతి.. భార్య, కుమారుడి గాయాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్రాంతి
- పండుగవేళ కొండాపూర్‌లో విషాదం..





చిగురుమామిడి నవంబర్ 09(జనంసాక్షి):
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల బ్రిడ్జి దాటిన తర్వాత పవనసుత మిల్లు సమీపంలో సిద్దిపేట -హుస్నాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ట్రాక్టర్, కారు ఢీకొన్న ఈ ఘోర దుర్ఘటనలో తండ్రి,ఏడేళ్ల కుమార్తె అక్కడికక్కడే మృతి చెందారు. పండుగ వేళ స్వగ్రామానికి వస్తుండగా జరిగిన ఈ ప్రమాదం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపేల్లి శ్రీకాంత్ (33) హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు.కొండాపూర్‌లో ఓ కార్యక్రమానికి భార్య స్వాతి, కుమార్తె మహాన్వి (7),కుమారుడు విహాన్ క్రిష్‌లతో కలిసి ఆయన హైదరాబాద్ నుండి కారులో స్వగ్రామానికి బయలుదేరారు.పందిళ్ల గ్రామం దాటిన తర్వాత పవనసుత మిల్లు సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాద తీవ్రతకు శ్రీకాంత్, ఆయన కుమార్తె మహాన్వి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న శ్రీకాంత్ భార్య స్వాతికి తీవ్ర గాయాలవ్వగా, కుమారుడు విహాన్ క్రిష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమా దంలో ట్రాక్టర్ డ్రైవర్ కాలు కూడా విరిగినట్లు సమాచారం.గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం

సిద్దిపేట - హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన కుమార్తె మహాన్వి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. పండుగ వేళ కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమని, వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ భార్య స్వాతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశిస్తూ, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే బాలుడు విహాన్ క్రిష్ క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. రోడ్డు ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'టెంపుల్' ధరపై వివాదం..

దీపిందర్ గోయల్ సుదీర్ఘ పోస్ట్


న్యూఢిల్లీ(జనంసాక్షి):
జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ కొత్త వెంచర్ 'టెంపుల్' చుట్టూ వివాదాలు కొనసాగుతున్నాయి. కణతిపై అమర్చుకునే ఈ పరికరం మెదడులో రక్త ప్రసరణ, ఒత్తిడి వంటి సంకేతాలను పర్యవేక్షిస్తుందని కంపెనీ ప్రకటించింది. దీంతో ఈ డివైజ్ శాస్త్రీయతను వైద్యులు తప్పుబడుతున్నారు. పైగా ఈ వేరబుల్ పరికరం ధరను రూ.85 వేలుగా ఉంది. దీనిపైనా విమర్శలు రావడంతో దీపిందర్ గోయల్ సుదీర్ఘ వివరణ ఇస్తూ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

'టెంపుల్'ను కేవలం భారతీయుల కోసం మాత్రమే తయారు చేయలేదని దీపిందర్ గోయల్ అన్నారు. దీని ధరను చూసి భారత్‌లో ఒక శాతం కంటే ఎక్కువ అమ్ముడవుతాయని తాను అనుకోవడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ ధర ఎక్కువ ఉందని బాధపడితే క్షమించాలన్నారు. ఈ డివైజ్ తయారీకి అయిన శ్రమకు ఆ ధర సరైనదేనని తాను భావిస్తున్నట్లు తెలిపారు. భారతీయ స్టార్టప్‌గా తాను మద్దతు కోరుకోవడం లేదని, ఆవిష్కరణకు మద్దతివ్వాలన్నారు. ఈ డివైజ్ శాస్త్రీయతపై వస్తున్న విమర్శలకూ గోయల్ బదులిచ్చారు. రాబోయే రోజుల్లో దీని శాస్త్రీయతకు మరిన్ని రుజువులు రాబోతున్నాయని చెప్పారు. రివ్యూలు వచ్చే వరకు వేచి ఉండాలని సూచించారు. డివైజ్‌ను కొనుగోలు చేయాలని తాము బలవంతం చేయడం లేదని విమర్శకులకు బదులిచ్చారు. ఒకవేళ తమ ప్రకటనల్లో అతిశయోక్తులు ఉంటే ప్రపంచవ్యాప్తంగా నియంత్రణపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. టెంపుల్ అనేది కేవలం ఒక ఫిట్‌నెస్ + ంఎ పరికరం మాత్రమేనని చెప్పారు. తాము ఎలాంటి వైద్యపరమైన వాదనలూ చేయడం లేదన్నారు. ఫలానా వ్యాధిని నిర్ధరిస్తుందని గానీ, నివారిస్తుందని గానీ తాము చెప్పడం లేదన్నారు. 'టెంపుల్'కు సోషల్ మీడియా అనేది నియంత్రణ సంస్థ కాదంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శిస్తున్నవారిని తప్పుబట్టారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు..

- లబ్ధిదారుల ఇళ్లలో ఎమ్మెల్యేల సందడి!
- కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొని ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపిన పోచారం

బాన్సువాడ నవంబర్ 9 (జనంసాక్షి):బాన్సువాడ బతుకమ్మ: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ కొత్త వెలుగులు నింపింది. ప్రభుత్వం నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. వారి ఆనందంలో భాగస్వాములై ఆత్మీయంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు బీడీ వర్కర్స్ కాలనీలో జట్ల జ్యోతి?రాజు, చిలివేరి స్వప్న?ప్రవీణ్, కోటగల్లి సంగీతరవికుమార్ కుటుంబాలను, బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామంలో పెంట లలిత?సుదర్శన్, జంగిలి పార్వతి?మోగులయ్య కుటుంబాలను, నస్రుల్లాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో పురం అమృత?శ్రీనివాస్, పురం సవిత?రమేష్ కుటుంబాలను వారి ఇళ్ల వద్దకు వెళ్లి కలుసుకున్నారు.లబ్ధిదారులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. కొత్త ఇంటిలో తొలి పండుగ జరుపుకుంటున్న కుటుంబాల ముఖాల్లో కనిపించిన సంతోషం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నది ఒక గొప్ప కల అని, ఆ కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. సొంతింటి కల నెరవేరిన కుటుంబాలు తమ కొత్త ఇళ్లలో దీపావళి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ప్రజలతో కలిసి పండుగలు జరుపుకోవడం ద్వారా వారి ఆనందాన్ని పంచుకోవడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలితాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. పండుగలు ప్రతి ఇంటా సంతోషం, సౌభాగ్యం నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



గంటకు 14,000కు పైగా పసిడి, వెండి నాణేల కొనుగోళ్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి):
ఇవి కూడా క్విక్ కామర్స్‌లో డెలివరీ పసిడి, వెండి కొనాలంటే ప్రణాళికతో, ఆభరణాల విక్రయశాలలకు వెళ్తుంటారు. అయితే యువతరం మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. క్విక్ కామర్స్‌లో కూరగాయలు తెప్పించుకున్నట్లే, పసిడి, వెండి నాణేలనూ 10 నిమిషాల్లో ఇంటికే డెలివరీ చేయించుకుంటున్నారు. ఈ ఏడాది ఆ ధోరణి మరీ పెరిగింది. ధనత్రయోదశి రోజున జెప్టోలో గంటకు ఒక దశలో 14,000కు పైగా పసిడి, వెండి నాణేలను డెలివరీ చేశామని ఆ సంస్థ సీఈఓ ఆదిత్ పలిచా వెల్లడించడమే ఇందుకు నిదర్శనం.

సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్

- పేదల కండ్లల్లో దీపావళి వెలుగులు
- బహదూర్ఖాన్ పేట్, దుబ్బపల్లి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి సంబరాలలో పాల్గొన్న సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 09 (జనంసాక్షి):
ఇల్లులేని ప్రతిఒక్క కుటుంబానికి స్వంత ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసిందని, ఇళ్లు పూర్తయిన తర్వాత వచ్చిన మొదటి దీపావళి పండుగను లబ్ధిదారులు ఎంతో సంతోషంగా జరుపుకున్నారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ఖాన్ పేట్, దుబ్బపల్లి గ్రామాలలో నరేందర్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి దీపాలు వెలిగించి టపాకాయలు పేల్చి సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లు లేని ప్రతి కుటుంబానికి స్వంత ఇల్లు కట్టిస్తామని చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంజూరు చేయడం జరిగిందని నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇది మొట్టమొదటి దీపావళి పండుగ అని లబ్ధిదారులు ఎంతో సంతోషంగా స్వంత ఇంటిలో దీపావళి పండుగ జరుపుకోవడం అందులో మేము భాగస్వాములం కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బహదూర్ఖాన్ పేట్, దుబ్బపల్లి సర్పంచులు గుర్రం సంధ్య తిరుపతిరెడ్డి, మోతె ప్రశాంత్ రెడ్డి, ఉప సర్పంచులు తప్పట్ల రమేష్ , అలువాల శ్రీకాంత్, సెక్రటరీలు మహేందర్, సుజాత, లబ్ధిదారులు బుర్ర మానస అనిల్, మోతె వెన్నెల, సిరిగిరి స్వరూప, జూబ్లీనగర్, చామన్ పల్లి సర్పంచులు కమల్ గౌడ్, బోగొండ ఐలయ్యతో పాటు వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 నవంబర్ 2026

4.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- కరీంనగర్ నగరంలో పర్యటించిన మంత్రులు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ - మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 8 (జనంసాక్షి) :
కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నగరంలో పర్యటించారు. నగర ప్రథమ పౌరులు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, గ్రంథాలయం చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి నగరంలోని 23, 25,26,46 డివిజన్లలో మొత్తం రూ. 4.50 కోట్ల నిధులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలోని 46 వ డివిజన్ రాంనగర్ లో స్థానిక కార్పోరేటర్ మల్లిఖార్జున్ రాజేందర్ తో కలిసి యూఐడిఎఫ్ కు చెందిన 1.50 కోట్ల అంచనా తో బాక్స్ డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. అనంతరం 25, 26వ డివిజన్ల పరిదిలో స్థానిక కార్పోరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, గంట శ్రీనివాస్ తో కలిసి సుభాష్ నగర్ లోని బుట్టి రాజారామ్ కాలనీ, ముదిరాజ్ కాలనీ, సుభాష్ నగర్ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో యూఐడిఎఫ్ కు చెందిన రూ. 2 కోట్లతో పైపు లైన్ డ్రైనేజీ లు, సీసీ రోడ్ల నిర్మాణం కు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం 23 వ డివిజన్ సీతారాంపూర్ రెడ్డి హాస్టల్ సమీపంలో స్థానిక కార్పోరేటర్ గుమ్మడి రాజ్ కుమార్ తో కలిసి యూఐడిఎఫ్, ఎంజీఎఫ్ కు చెందిన రూ. 1 కోటి నిధులతో మురికి కాలువ పైపు లైన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... పాలకవర్గ సభ్యులు, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నగర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా, నగర అభివృద్ధి కోసం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాకారంతో కరీంనగర్ ను అభివృద్ధి లో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్మెంట్ కు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు తెచ్చి కరీంనగర్ ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దీపావళి వేళ పేకాటరాయుళ్లపై పోలీసుల ఉక్కుపాదం!

- వివిధ గ్రామాల్లో ఏకకాలంలో దాడులు.. 72 మంది పట్టివేత
- రూ.4.93 లక్షల నగదు, 46 సెల్‌ఫోన్లు, 23 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బాన్సువాడ నవంబర్ (జనం సాక్షి) : బాన్సువాడ దీపావళి పండుగ వేళ అక్రమ పేకాట స్థావరాలపై బాన్సువాడ పోలీసులు కొరడా ఝుళిపించారు. పండుగను ఆసరాగా చేసుకుని వివిధ గ్రామాల్లో రహస్యంగా పేకాట నిర్వహిస్తున్న స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న మొత్తం 72 మందిని పోలీసులు పట్టుకున్నారు. బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఈ దాడుల్లో పేకాటరాయుళ్ల నుంచి రూ.4,93,980 నగదు, 46 సెల్‌ఫోన్లు, 23 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహిస్తున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలతో దాడులు చేపట్టడంతో పెద్ద సంఖ్యలో పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పండుగల పేరుతో జూదానికి పాల్పడినా, అక్రమ పేకాట స్థావరాలు నిర్వహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా బాన్సువాడ సీఐ తుల శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రజలు పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వ్యసనాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అక్రమ పేకాట స్థావరాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు




చెట్ల పొదల్లో వ్యక్తి మృతదేహం

గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం

కరీంనగర్, క్రైమ్ నవంబర్ 9 (జనంసాక్షి):
కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసీఆర్ బిల్డింగ్ సమీపంలో చెట్ల పొదల్లో అనంతుల సత్యనారాయణ (46) మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద లభించిన చీటీలోని ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుమారుడు సాయికృష్ణ మృతదేహాన్ని గుర్తించాడు. మృతుడు వడ్రంగి పనిచేసేవాడు. ఆరు నెలల క్రితం ప్రమాదంలో కాలు విరగడంతో పనులు చేసుకోలేకపోతున్నాడు. కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తితో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఉరివేసుకుని ఆత్మహత్య

కరీంనగర్, క్రైమ్ నవంబర్ 09 (జనంసాక్షి) :



వరంగల్ జిల్లాకు చెందిన ఇమ్మడి ముత్తయ్య తన కుమార్తె శ్రావంతి (35) 11 సంవత్సరాల క్రితం కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన కొత్తూరి సంపత్ (42)తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో సంపత్‌కు రెండు వాహనాలతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.8 లక్షల నగదు ఇచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంతకాలం పాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగినప్పటికీ, గత ఆరు నెలలుగా తన తండ్రి వద్ద ఉన్న ప్లాటును విక్రయించి డబ్బులు ఇవ్వాలని భర్త సంపత్ భార్య శ్రావంతిని వేధిస్తూ, తరచూ గొడవపడుతూ శారీరకంగా కొట్టేవాడు. ఈ విషయాన్ని శ్రావంతి తన తండ్రి ముత్తయ్యకు తెలియజేయగా, ఆయన ఇరుకుల్ల గ్రామానికి వచ్చి పెద్దమనుషుల సమక్షంలో సంపత్‌కు నచ్చజెప్పి, కాపురం సజావుగా సాగించాలని సూచించారు. అయినప్పటికీ సంపత్ వేధింపులు కొనసాగించాడు. ఈ క్రమంలో భర్త వేధింపులు తట్టుకోలేక శ్రావంతి ఈరోజు తెల్లవారుజామున ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం ఫోన్ ద్వారా తెలుసుకున్న మృతురాలి తండ్రి ముత్తయ్య వరంగల్ నుంచి వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో తన కుమార్తె మృతదేహాన్ని పరిశీలించారు. తన కుమార్తె మరణానికి భర్త కొత్తూరి సంపత్ వేధింపులే కారణమని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదు అందుకున్న వెంటనే నేను ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అక్కడే ఫిర్యాదు స్వీకరించి ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది. అనంతరం మృతదేహంపై శవ పంచనామా నిర్వహించి, మరణానికి గల ఖచ్చితమైన కారణాలు నిర్ధారించేందుకు పోస్టుమార్టం నిర్వహించడం జరిగింది. తదుపరి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం మృతురాలి తండ్రి ఇమ్మడి ముత్తయ్యకు అప్పగించడం జరిగింది. ప్రస్తుతం నిందితుడు కొత్తూరి సంపత్ పరారీలో ఉన్నాడు. అతని ఆచూకీ కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. నిందితుడిని త్వరలో పట్టుకుని, కేసు దర్యాప్తులో వెల్లడయ్యే ఆధారాల మేరకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతిపత్రం

సన్నపు వడ్లకు మద్దతు ధర ఇవ్వండి.. రైతులను ఆదుకోండి

కథలాపూర్ నవంబర్ 9 (జనం సాక్షి) : జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ క సన్న వడ్లకి 3500 మద్దతు ధర ఇచ్చుట గురించి. జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పక్క ఉమ్మడి జిల్లా గత 20 రోజుల క్రింద నిజామాబాద్ ప్రాంతంలో ఈ సన్న వడ్ల కి సుమారు 4000 నుండి 4200 వరకు కూడా క్వింటాలికి ధర ఇచ్చి కొనుగోలు చేయడం జరిగింది. మరియు మన జగిత్యాల ప్రాంతానికి వరి కోతలు వచ్చేసరికి కేవలం 2600 మాత్రమే ధర రావడం జరుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతాంగాన్ని ఆదుకొని 3500 కి తగ్గకుండా కొనుగోలు చేయాలని విన్నవించుకోవడం జరిగింది. ఎందుకంటే మీరు ప్రభుత్వం చెప్పిన విధంగానే రాష్ట్ర రైతాంగమంతా ఏడు రకాల సన్న వడ్లు మాత్రమే నాటి పంట పండించడం జరిగింది మరియు రవి సిజన్ లో వరి వేయొద్దు అంటున్నారు కాబట్టి ప్రభుత్వ మాట ప్రకారం మేము పాటిస్తున్నాము ఏం లేకున్నా క్వింటాలికి సుమారు 1000 నుండి 1500 వరకు ప్రతి రైతు నష్టపోవడం జరుగుతు ఉంది కావున ఇకనైనా క్వింటాలికి 3500 మద్దతు ధర ఇచ్చి అదనపు బోనస్ కింద కొనుగోలు చేసి ఉన్న పంట నైనా మద్దతు ధర ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాల్సిందిగా తమరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాం అని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు కార్యవర్గం మరియు రైతులు పాల్గొని కలెక్టర్ తెలియజేశారు.

ఎల్‌నినో ముప్పు.. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- తాగునీటి సరఫరాకు పటిష్ఠ కార్యాచరణ : ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్
- అమృత్ పనులను గడువులోగా పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 9 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగి తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సూచించారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఆయన సమీక్షించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అమృత్ పథకం కింద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం సకాలంలో అందేలా చూడాలన్నారు.
పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, కార్పొరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


రైతులతో కలిసి మెగా రైతు మేళాను వీక్షించిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 9 జనం సాక్షి:
రైతాంగ శ్రేయస్సును కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శన కార్యక్రమాన్ని, కొడంగల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతన్నలతో నిర్వహించిన ఆత్మీయ సభను నిజామాబాద్ జిల్లాలోని రైతులు వర్చువల్ విధానంలో వీక్షించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో 80 రైతు వేదికలలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా నవీపేట మండలం జన్నేపల్లి గ్రామంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్థానిక రైతులతో కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి చేసిన ప్రసంగంతో పాటు రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు తదితర అంశాలను రైతులు ఆసక్తితో ఆలకించారు. రైతు మేళాలో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం, నూతన సాగు విధానాలు, అధిక దిగుబడులు సాధించే పద్ధతులు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహం తదితర అంశాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, మార్కెటింగ్ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల నెలకొని ఉన్న ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా రబీలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం కలిగిన ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. జన్నేపల్లి రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, తహసీల్దార్ వెంకట రమణ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో సత్యశోధక్ విద్యార్థి సత్తా


రన్నరప్‌గా నిజామాబాద్ జిల్లా జట్టు.. సిల్వర్ మెడల్ సాధించిన గాదరి అద్వైత్ రెడ్డి



సిరికొండ, నవంబర్ 9 జనం సాక్షి:
రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థి గాదరి అద్వైత్ రెడ్డి ప్రతిభ చాటాడు. నవంబర్ 06 నుంచి 08 వరకు హైదరాబాద్‌లోని సైనిక్‌పురిలో గల భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (గా+ఖీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలుర సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్‌గా నిలిచింది. ఈ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థి గాదరి అద్వైత్ రెడ్డి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించి సిల్వర్ మెడల్ సాధించాడు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా అద్వైత్ రెడ్డిని హైదరాబాద్ ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి జగ్గయ్య, పరిశీలకులు బాబు రావు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి సాధించిన విజయంపై సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలలో అద్వైత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని అద్వైత్ రెడ్డిని అభినందించారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో మానవీయ దృక్పథం

- పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా అధికారులు వారానికోసారి టూర్ డైరీ సమర్పించాలి
- 19న ప్రారంభోత్సవాలకు భవనాలను సిద్ధం చేయాలి
- ఆరు నెలల్లో 4,880 అర్జీలకు పరిష్కారం
- ప్రజావాణికి 92 దరఖాస్తులు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 8 (జనంసాక్షి): ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం వివిధ శాఖల అధికారులతో పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. జిల్లా పంచాయతీ, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్, విద్యుత్, ఆర్టీసీ, ఇరిగేషన్ తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించాలని, పరిష్కరించిన వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం సాధ్యం కాని వాటిపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలన్నారు. మే నుంచి అక్టోబర్ వరకు జిల్లా స్థాయి ప్రజావాణిలో 5,943 అర్జీలు రాగా, 4,880 పరిష్కరించినట్లు తెలిపారు. మరో 1,063 పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం ప్రజావాణి దరఖాస్తులన్నీ పరిష్కరించినట్లు వెల్లడించారు.
అన్ని శాఖల జిల్లా అధికారులు ప్రతివారం తమ టూర్ డైరీలను జిల్లా రెవెన్యూ అధికారికి సమర్పించాలని ఆదేశించారు. వచ్చే వారంలో చేపట్టే క్షేత్రస్థాయి పర్యటనల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, పర్యటనల్లో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంపైనా దృష్టి సారించాలన్నారు. ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, పాఠశాల తరగతి గదుల భవనాలను ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలోనూ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్న భవనాల జాబితాను మండల అధికారులకు అందించాలని పంచాయతీరాజ్ శాఖను సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 92 అర్జీలు అందాయి. వీటిలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 19, గృహ నిర్మాణ సంస్థకు 16, కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 12 వచ్చాయి. ప్రజా సమస్యలపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వచ్చే కథనాలపైనా స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, ప్రజావాణి వివరాలు, ఫొటోలను మీడియాకు సకాలంలో అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లిన ఆర్టిసి బస్సు కారు

తప్పిన పెను ప్రమాదం.. ఇద్దరికి స్వల్ప గాయాలు

గాంధారి, జనంసాక్షి : ఆర్టీసీ బస్సు కారు అదుపుతప్పి బస్సులో ఉన్న 16 మందిలో ఇద్దరు ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని గుడిమెట్ శివారు ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి నుండి బాన్సువాడ వైపు వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 16 మంది ప్రయాణికులతో గుడిమెట్ శివారు ప్రాంతంలోకి రాగానే బస్సు వెనకాలే వస్తున్న మరో కారు బాన్సువాడ వైపు వెళ్తున్న తరుణంలో కారు బస్సును ఓవర్టేక్ చేసే తరుణంలో అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లాయి. ఈ క్రమంలో ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో బాధితులను బస్సులోనే కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇంకా పూర్తి వివరాలు తెలియ చేయాల్సి ఉంది.

ప్రజావాణి ఫిర్యాదులపై స్పందన ఏదీ?

- మూడు నెలలుగా కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లో ఫైల్
- సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పరిష్కారంలో జాప్యం ఎందుకు జరుగుతోందని సమాచార హక్కు పరిరక్షణ సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ ప్రశ్నించారు. కాప్రా మండల పరిధిలోని యూఎల్‌సీ భూములకు సంబంధించిన ఫైల్ మూడు నెలలుగా కలెక్టరేట్‌లోని డి-సెక్షన్‌లో పెండింగ్‌లో ఉండటంపై సోమవారం ప్రజావాణి లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కాప్రా మండల పరిధిలోని సర్వే నంబర్లు 329, 336, 337లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములకు సంబంధించి గతంలో తహసీల్దార్ బి.రాజేష్ జారీ చేసిన నాలా ప్రొసీడిం గ్స్‌ను రద్దు చేయాలని కోరినట్లు గగన్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై ప్రస్తుత కాప్రా తహసీల్దార్ మతిన్ జూన్ 29న జిల్లా కలెక్టర్‌కు వివరణ పంపించినప్పటికీ, అందుకు సంబంధించిన ఫైల్ ఇప్పటికీ డి-సెక్షన్ సూపరింటెండెంట్ వద్దే పెండింగ్‌లో ఉందన్నారు. మూడు నెలలుగా ఫైల్‌ను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ప్రజావాణి నిర్వహిస్తుంటే, సెక్షన్ అధికారులు మాత్రం ఫైళ్లను ఎందుకు పెండింగ్‌లో ఉంచుతు న్నారని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లాలా? లేక జిల్లా కలెక్టరే సెక్షన్ అధికారుల వద్దకు వెళ్లి ఫైళ్లను పరిష్కరిం చాలా? అని నిలదీశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా కాప్రా మండల పరిధిలోని యూఎల్‌సీ భూములను కాపాడాలని, వివాదాస్పద నాలా ప్రొసీడింగ్స్ రద్దు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని గగన్‌కుమార్ కోరారు. ఫైల్ పెండింగ్‌కు బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సమర్పించిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.


ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు: డీఆర్ఓ మాలతి

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మాలతి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 50 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వచ్చే అర్జీదారుల సమస్యలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, అర్జీదారులతో సానుకూలంగా మెలగాలని, సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి ముసుగులో పర్యావరణ విధ్వంసం తగదు!

శాతవాహన వర్సిటీలో అక్రమ తవ్వకాలు, చెట్ల నరికివేతపై విద్యార్థుల ఆందోళన





- రెండు ఎకరాల్లో భారీగా తవ్వకాలు.. మట్టి తరలింపు
- నెమళ్లు, పక్షుల ఆవాసాలకు ముప్పు
- అనుమతులపై సమగ్ర విచారణకు డిమాండ్
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కరీంనగర్ టౌన్, నవంబర్ 9 (జనంసాక్షి):
శాతవాహన విశ్వవిద్యాలయ అభివృద్ధి పనుల పేరుతో పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలు చేపట్టడం తగదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో భారీ తవ్వకాలు, మట్టి తరలింపు, ఏళ్లనాటి చెట్ల నరికివేతపై జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్యాలరీ, న్యాయ కళాశాల, సింథటిక్ ట్రాక్ నిర్మాణాల పేరుతో సుమారు రెండు ఎకరాల్లో పది అడుగులకు పైగా లోతున తవ్వకాలు చేపడుతున్నారని, విలువైన మట్టిని తరలించడంతోపాటు చెట్లను తొలగిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. దీంతో క్యాంపస్‌లో పచ్చదనం, జీవవైవిధ్యం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెమళ్లు, వివిధ పక్షులు, వన్యప్రాణులకు ఆవాసంగా ఉన్న విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రస్తుతం వాటి సంచారం తగ్గిపోయిందన్నారు. తవ్వకాలు, మట్టి తరలింపు, చెట్ల తొలగింపునకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? వాల్టా చట్టం సహా పర్యావరణ నిబంధనలు పాటించారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రకృతిని నాశనం చేస్తూ అభివృద్ధి చేపట్టడం సమంజసం కాదని విద్యార్థులు స్పష్టం చేశారు. భవిష్యత్ తరాల కోసం క్యాంపస్‌లోని చెట్లు, పక్షులు, వన్యప్రాణుల ఆవాసాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూ జేఏసీ చైర్మన్ కారికే మహేష్, ఎస్‌యూ అధ్యక్షుడు కేశవ్, ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ శివాజీ, లక్ష్మణ్ సాయి, ఉపాధ్యక్షుడు శ్రీధర్, లైబ్రరీ ఇన్‌చార్జి శంకర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో ఫుడ్ పాయిజన్ కలకలం..

- 80 మంది నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత
- 16 మందికి ఆసుపత్రిలో చికిత్స..
- హాస్టల్‌లో ఆహార నాణ్యతపై డీఎంహెచ్‌వో తనిఖీలు



చేవెళ్ల, నవంబర్ 9 (జనంసాక్షి) : చేవెళ్ల పట్టణంలోని పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల నర్సింగ్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. హాస్టల్‌లో భోజనం చేసిన సుమారు 80 మంది నర్సింగ్ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 16 మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం వండిన చికెన్‌ను రాత్రి భోజనంలో వడ్డించడంతోనే ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భోజనం చేసిన కొద్దిసేపటికే పలువురు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు కావడంతో ఆందోళనకు గురయ్యారు. ఆదివారం ఉదయం మరికొంతమంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరోవైపు కేరళకు చెందిన కొందరు విద్యార్థినులు గంజిలో చట్నీ కలుపుకొని తినడం వల్లే అస్వస్థతకు గురై ఉండవచ్చని కళాశాల వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఉదయం వండిన చికెన్‌ను రాత్రి భోజనంలో తిన్నామని, ఆ తర్వాతే అనారోగ్య సమస్యలు తలెత్తాయని విద్యార్థినులు చెబుతున్నారు. హాస్టల్‌లో నాణ్యమైన ఆహారం అందించడం లేదని, తాగునీటి నుంచి దుర్వాసన వస్తోందని పలువురు విద్యార్థినులు ఆరోపించినట్లు సమాచారం. ఈ ఘటనతో హాస్టల్‌లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలపై చర్చ మొదలైంది.

హాస్టల్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆదివారం రాత్రి చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం నర్సింగ్ హాస్టల్‌ను సందర్శించి వంటగది, ఆహార పదార్థాలు, వంటకు వినియోగిస్తున్న కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు భోజనం నాణ్యత సరిగా లేదని, తాగునీటి నుంచి దుర్వాసన వస్తోందని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. భోజనం బాగాలేక తినకుండా పారబోస్తున్న పరిస్థితి ఉందని వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత కళాశాల నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

చెరుకు ధర పెంపుపై రైతుల పోరుబాట..

- గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ జీఎంకు వినతి



నాగలిగిద్ద, నవంబర్ 9 (జనం సాక్షి) : చెరుకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ నాగలిగిద్ద, మనూరు మండలాలకు చెందిన చెరుకు రైతులు తమ డిమాండ్‌ను వినిపించారు. ప్రస్తుతం చెల్లిస్తున్న ధరను పెంచి చెరుకు టన్నుకు రూ.4,600/- చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి జనరల్ మేనేజర్ వెంగల్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రోజురోజుకు వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు,ఎరువులు,కూలీల ఖర్చులు, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు.ప్రస్తుత ధరలతో చెరుకు సాగు చేయడం రైతులకు భారంగా మారుతోందని పేర్కొన్నారు. రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించేలా చెరుకు టన్నుకు రూ.4,600/- చెల్లించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కోరారు. రైతుల డిమాండ్‌ను పరిశీలించి తమకు న్యాయం చేయాలని జనరల్ మేనేజర్ వెంగల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మారుతీరావు, విజయ్ కుమార్ స్వామి, విజయ్ కుమార్, ప్రకాష్, జావీద్, శివకుమార్ తదితర చెరుకు రైతులు పాల్గొన్నారు.

పూజారిపై దాడికి యత్నం



వడ్డేపల్లి, నవంబర్ 9 (జనం సాక్షి) : వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్న పకీరప్ప అనే పూజారిపై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు శాంతినగర్ ఎస్సై నాగ శేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దత్తాత్రేయ స్వామి గుడిలో పూజలు నిర్వహిస్తున్న క్రమంలో దీపావళి పండుగ రోజున ఇతర గ్రామంలో ఫోస్టర్ గా పనిచేస్తున్న ఆశీర్వాదం అనే వ్యక్తి దుర్భాషలాడుతూ పూజారిని కొట్టేందుకు చెప్పులు వేసుకొని ఆలయంలోకి వెళ్లడంతో స్థానిక మహిళలు భక్తులు పోలీసులకు సమాచారం అందించారు విషయం తెలుసుకున్న స్థానిక హిందూ సంఘాలు బిజెపి నాయకులు అక్కడికి చేరుకొని దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు గత 40 ఏళ్లుగా చర్చి ఆలయం పక్కపక్కలే ఉంటున్నప్పటికీ ఇలాంటి విద్వేషాలు చల్లరేయలేదని ప్రస్తుతం ఆశీర్వాదం ఈ వ్యక్తి వల్ల స్థానికంగా మత ఘర్షణలు చెలరేగుతున్నాయని ఎక్కడపడితే అక్కడ హిందూ దేవుళ్లను దూషించడం, ఇందులోని కించపరిచే విధంగా మాట్లాడుతున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ ఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జనప్రియ ఆర్‌యూబీ పనులు పూర్తి..

- మోదీ చిత్రపటానికి పాలాభిషేకం
- రూ.6.60 కోట్ల కేంద్ర నిధులతో వంతెన నిర్మాణం పూర్తి
- ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుల కృతజ్ఞతలు



అల్వాల్, నవంబరు 9 (జనంసాక్షి) : జనప్రియ రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) వద్ద నిర్మాణ పనులు పూర్తయి వంతెన ప్రజలకు అందుబాటులోకి రావడంతో అల్వాల్ సర్కిల్ బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలో రూ.6.60 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి, పనుల పూర్తికి సహకరించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎంపీ సహకారంతోనే నిర్మాణ పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వంతెనతో జనప్రియ, సాయినగర్ కాలనీలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకల్లో వెసులుబాటు కలగనుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు చింతల మాణిక్యరెడ్డి, శ్రీనివాస్ వర్మ, మాధవ్, డివిజన్ అధ్యక్షులు మంద విజయ్, కె.అజయ్‌రెడ్డి, అనిల్‌కుమార్, కార్తీక్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దండుగుల వెంకటేష్, మల్లికార్జునగౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, వినయ్‌శంకర్, మల్లికార్జున యాదవ్, రాజిరెడ్డి, గోపి, అజిత్‌సాయి, చరణ్, అనిల్‌రాజు, మొయి సుజాత, పద్మిని, స్రవంతి, ఉష తదితరులతో పాటు జనప్రియ, సాయినగర్ కాలనీల వాసులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత నడుం బిగించాలి

- నషా ముక్త్ భారత్ సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి



హయత్‌నగర్, నవంబర్ 9 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ సైక్లింగ్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. సాగర్ కాంప్లెక్స్, బి.ఎన్. రెడ్డి నగర్ నుంచి ఎల్.బి. నగర్ వరకు నిర్వహించిన ఈ సైక్లింగ్ ర్యాలీలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారకుండా క్రీడలు, వ్యాయామం, సామాజిక సేవ వంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై యువతలో చైతన్యం తీసుకురావాలని ఆయన కోరారు. అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం యువతకు స్ఫూర్తినిస్తూ, నషా ముక్త్ భారత్ నిర్మాణానికి దోహదపడుతుందని ఆకాంక్షించారు.


కార్మికుల సేవలు వెలకట్టలేనివి



రాజేంద్రనగర్, నవంబర్ 9 (జనంసాక్షి) : కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలను ఈ సందర్భంగా అభినందించారు. వారి కృషిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్, కాలనీ సభ్యులు సాగర్, సురేంద్ర, సుజాత, రూప, కోటి, జస్వంత్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం..

- తప్పిన పెను ప్రమాదం
- సకాలంలో స్పందించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది..



ముషీరాబాద్, నవంబర్ 9 (జనం సాక్షి) : ముషీరాబాద్‌లో ఆదివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మహ్మదీయ ఫంక్షన్ హాల్ డౌన్, బెర్బన్ గల్లీ ఎదురుగా ఉన్న ఓ కాంపౌండ్‌లో బాణసంచా పడటంతో మంటలు చెలరేగాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కాంపౌండ్‌లోని పొదల్లో టపాసులు పడటంతో మంటలు అంటుకున్నాయి. అక్కడ ఎండుగడ్డి, పిచ్చిమొక్కలు అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసు బృందం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.
పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి సమన్వయంతో చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. తక్షణమే స్పందించి ప్రమాదాన్ని నివారించిన ముషీరాబాద్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

- 54వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు
- హామీల అమలులో జాప్యంపై ఉద్యమకారుల ఆవేదన



అల్వాల్, నవంబర్ 9 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని పలువురు ఉద్యమకారులు డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, పింఛన్లు, ఆర్థిక సాయం, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాల కల్పనలో జాప్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 54వ రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో కుటుంబాలను, వ్యక్తిగత పనులను పక్కనపెట్టి పోరాడిన అనేకమంది జైలు పాలయ్యారని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని ఉద్యమకారులు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఆర్థిక సాయంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. సోమవారం నాటి దీక్షలో సురేష్ కూర్చోగా, పటోళ్ల సురేందర్‌రెడ్డి, పుట్నాల కృష్ణ, దయాకర్, ముత్యాలు, శ్రీనివాస్‌గౌడ్, రమేష్ తదితరులు సంఘీభావం తెలిపారు.

అర్హులైన ఓటర్లకు మరో అవకాశం

- ఓటరు జాబితాలో పేరు గల్లంతైనా ఆందోళన అవసరం లేదు
- అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో, నవంబర్ 9 (జనం సాక్షి) : ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా గైర్హాజరు, నివాసం మారినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువసార్లు పేర్లు నమోదైనవారిగా గుర్తించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు చేర్చని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత ఓటర్లు తమ వివరాలతో కూడిన ఓటరు నమోదు పత్రాలను తిరిగి పూర్తిచేసి సంబంధిత బూత్ స్థాయి అధికారికి సమర్పించాలన్నారు.ఓటరు నమోదు పత్రాలు అందని వారి జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో నివసిస్తున్నట్లయితే, గతంలో ఓటరు నమోదు పత్రం సమర్పించకపోవడానికి గల కారణాలను వివరిస్తూ నిర్దేశిత అనుబంధం–బి ప్రకటనతో పాటు పూర్తిచేసి సంతకం చేసిన పత్రాన్ని సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా బూత్ స్థాయి అధికారికి స్వయంగా అందజేయవచ్చని పేర్కొన్నారు. లేదా కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా కూడా సమర్పించవచ్చని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటరు నమోదు కాకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నామని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.

న్యాయ అవగాహనతోనే వృద్ధుల హక్కులకు రక్షణ

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ముద్దసిర్
- జడ్చర్ల వృద్ధాశ్రమంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం



జడ్చర్ల, నవంబర్ 9 (జనంసాక్షి) : న్యాయ విజ్ఞానంతోనే ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకోగలరని జడ్చర్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ముద్దసిర్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా సోమవారం జడ్చర్లలోని వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం – 2007ను తీసుకువచ్చిందని తెలిపారు. వృద్ధులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో విజిలెన్స్ తనిఖీలు

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

బోయిన్‌పల్లి, నవంబర్ 9 (జనం సాక్షి) : బోయిన్‌పల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశాల నేపథ్యంలో మార్కెట్‌లో జరుగుతున్న కూరగాయల క్రయవిక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ధరల ప్రకారమే కూరగాయల విక్రయాలు జరపాలని, వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్ యార్డులో అక్రమ వ్యాపారాలు, అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై ఆధారాలతో ఫిర్యాదులు అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రవికుమార్ స్పష్టం చేశారు. లైసెన్స్ లేని వ్యక్తులు మార్కెట్‌లో క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం తమ దృష్టికి వచ్చిందని, వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మార్కెట్ యార్డులో పేరుకుపోతున్న చెత్తాచెదారం వల్ల రైతులు, హమాలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించామని, మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం మంచినీటి ప్లాంట్లు, మరుగుదొడ్ల సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా మార్కెట్‌లో పెరుగుతున్న వాహనాల రద్దీతో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను కూడా త్వరలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 నవంబర్ 2026

డెత్ నుంచి రిక్రూట్ వరకు పక్కా కుట్ర..!

నల్గొండలో నకిలీ కారుణ్య ఉద్యోగం గుట్టురట్టు

- ఉద్యోగి సహా 14 మంది అరెస్ట్.. మరో ఇద్దరు పరార్
- మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పాత్ర
- రూ.13 లక్షలకు బేరం.. రూ.5 లక్షల నగదు, కంప్యూటర్లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం
- రిజిస్టర్ మాయం వ్యవహారంపైనా అనుమానాలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 9 (జనంసాక్షి): ప్రభుత్వ ఉద్యోగంలో ఉండగానే మరణించినట్లు నకిలీ రికార్డులు సృష్టించి, కుమారుడికి కారుణ్య నియామకం ఇప్పించిన భారీ అక్రమ వ్యవహారం పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. జనం సాక్షిలో వెలువడిన కథనంతో కదిలిన యంత్రాంగం.. ఈ వ్యవహారంపై దర్యాప్తును వేగవంతం చేయడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మొదలుకొని మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది వరకు అక్రమంలో భాగస్వాములైనట్లు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో కారుణ్య నియామకం పొందిన ఉద్యోగి సహా మొత్తం 14 మందిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలిస్తున్నారు. రూ.13 లక్షల ఒప్పందంతో సాగిన ఈ వ్యవహారంలో రూ.5 లక్షల నగదుతో పాటు కంప్యూటర్, ప్రింటర్, 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కేసు వివరాలను వెల్లడించారు.

ఉద్యోగం కోసం మరణ తేదీనే మార్చేశారు

శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసిన చామకూరి వెంకటేశ్వర్లు 2025 మే 31న పదవీ విరమణ పొందారు. అనారోగ్యంతో అదే ఏడాది నవంబర్ 17న మరణించారు. అయితే ఆయన పదవీ విరమణకు ముందే మే 28న విధుల్లో ఉండగానే మరణించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారు. ఈ కల్పిత మరణ తేదీని ఆధారంగా చేసుకుని ఆయన కుమారుడు చామకూరి రాజుకు కారుణ్య నియామకం కల్పించేలా కుట్ర పన్నారు. వాస్తవ మరణానికి ముందే మరణించినట్లు చూపించి ప్రభుత్వ ఉద్యోగం పొందేలా పత్రాలన్నీ సిద్ధం చేశారు.



రూ.13 లక్షల ఒప్పందం.. శాఖల మధ్య కుమ్మక్కు

మృతుడి భార్య వసంతతో రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు ఉద్యోగులు ఈ పథకంలో భాగస్వాములయ్యారని గుర్తించారు. తొలుత మృతుడి ఆధార్ కార్డులోని చిరునామాను నల్లగొండ పట్టణంలోని చైతన్యపురి కాలనీకి మార్చారు. ఆ చిరునామా ఆధారంగా మున్సిపాలిటీ నుంచి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందారు. ఇందులో మీ సేవా కేంద్ర నిర్వాహకుడు, మున్సిపల్ వార్డు ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్ర ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ ధ్రువీకరణ పత్రంతో కారుణ్య నియామకానికి దరఖాస్తు చేయగా, వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు అధికారులు తప్పుడు విచారణ నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పత్రాల ఆధారంగానే చామకూరి రాజుకు దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగం కల్పించినట్లు వెల్లడించారు.

రూ.5 లక్షలు, కంప్యూటర్లు స్వాధీనం

నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, ఒక కంప్యూటర్, ఒక ప్రింటర్, 12 సెల్‌ఫోన్లతో పాటు మృతుడు వెంకటేశ్వర్లు ఫొటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్రాల తయారీ, వాటి ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగం పొందే వరకు జరిగిన వ్యవహారంలో మరిన్ని ఆధారాలను సేకరిస్తున్నారు.

మాయం చేసిన అటెండెన్స్ రిజిస్టర్ సంగతేంటి?

ఈ స్కామ్‌లో ఇంకా కొందరి పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దామరచర్ల పీహెచ్‌సీలో కారుణ్య నియామకం పొందిన రాజు సంతకం చేసిన అటెండెన్స్ రిజిస్టర్‌ను మాయం చేసి, దాని స్థానంలో కొత్త రిజిస్టర్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆధారాల తొలగింపునకు ఎవరు సహకరించారు? రిజిస్టర్ మార్పు వెనుక ఎవరున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉద్యోగ నియామకానికి సంబంధించిన రికార్డుల మార్పు, ఆధారాల మాయం అంశాలపై కూడా సమగ్ర విచారణ జరిపితే మరికొందరి పాత్ర బయటపడే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ఈ కోణంలో పోలీసులు దృష్టి సారిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఫిర్యాదుతో మొదలైన దర్యాప్తు

నల్లగొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు నవంబర్ 4న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో డీఎస్పీ కె. శివరామిరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ కె. ఆది రెడ్డి, రూరల్ ఎస్ఐ బి. శివప్రసాద్, టూటౌన్ ఎస్ఐ డి. సైదాబాబు, వన్‌టౌన్ ఎస్ఐలు ఎన్. వెంకట్ నారాయణ, జె. సైదులుతో పాటు ఇతర సిబ్బంది సమన్వయంతో దర్యాప్తు చేపట్టి మోసాన్ని ఛేదించారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, తప్పుడు విచారణ నివేదికల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందిన ఈ వ్యవహారం ఇప్పుడు జిల్లాలో సంచలనం రేపుతోంది. 14 మంది అరెస్టుతోనే ఈ అక్రమాల కథ ముగుస్తుందా? లేక రికార్డుల మాయం సహా ఇతర అంశాలపై విచారణ సాగితే మరిన్ని పేర్లు బయటపడతాయా? అన్నది వేచి చూడాలి.



అరెస్టయిన 14 మంది వీరే..

1. చామకూరి వసంత – మృతుడి భార్య, నకిరేకల్
2. చామకూరి రాజు – మృతుడి కుమారుడు, కారుణ్య నియామకం పొందిన ఉద్యోగి.
3. కంచర్ల జగన్నాధరెడ్డి – సీనియర్ అసిస్టెంట్, పీహెచ్‌సీ శాలిగౌరారం.
4. రాచకొండ వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్‌గౌడ్ – ఒగోడు గ్రామం.
5. డాక్టర్ ఆకుల కృష్ణ సూర్యశిల్ప – మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ శాలిగౌరారం.
6. పనస చంద్రశేఖర్ అలియాస్ చందు – మీ సేవా కేంద్ర నిర్వాహకుడు.
7. కట్ల సతీష్ – కంప్యూటర్ ఆపరేటర్, 12వ బెటాలియన్.
8. ముక్కముయిల శివజనార్ధన్ – వార్డు ఆఫీసర్, నల్లగొండ.
9. ఎన్. ప్రదీప్‌రెడ్డి – శానిటరీ ఇన్‌స్పెక్టర్, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్.
10. పోలె రంజిత్‌కుమార్ – జూనియర్ అసిస్టెంట్, డీఎంహెచ్ఓ కార్యాలయం.
11. నాగిరెడ్డి జితేందర్‌రెడ్డి – ఆఫీస్ సూపరింటెండెంట్, డీఎంహెచ్ఓ కార్యాలయం.
12. మహబూబ్ అలీ – అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, డీఎంహెచ్ఓ కార్యాలయం.
13. గింకల రాకేష్ యాదవ్ – సీనియర్ అసిస్టెంట్, డీఎంహెచ్ఓ కార్యాలయం.
14. తుంగతుర్తి మోహన్‌కృష్ణ – జూనియర్ అసిస్టెంట్, డీఎంహెచ్ఓ కార్యాలయం.





మా దృష్టికి రాగానే కలెక్టర్‌కు సమాచారం ఇచ్చాను

నకిలీ కారుణ్య నియామకపత్రం జారీ విషయంలో ఒకటికి రెండుసార్లు చూసాను. ఇదే విషయమై మా సిబ్బందికి కూడా ఫైల్ ఆపాలని సూచించా. కలెక్టర్ కు కూడా ఫైల్ పంపించాం. పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. మా కార్యాలయంలో ఎవరైనా తప్పుడు కార్యకలాపాలు చేస్తే, డబ్బులు డిమాండ్ చేసినా మా దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- డిఎంహెచ్ఓ, డాక్టర్ రాహుల్

ప్రజాపాలనలో అభివృద్ధి పట్టాలపైకి పాలమూరు

సీఎం రేవంత్ సారథ్యంలో అభివృద్ధికి దిక్సూచిగా కొడంగల్

- పారిశ్రామిక, విద్యా, వైద్య, సాగునీటి రంగాల్లో సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు
- లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఐదు వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్లు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క






వికారాబాద్ బ్యూరో (జనంసాక్షి) : తరతరాలుగా వెనుకబాటుకు గురైన పాలమూరు ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, కొడంగల్‌ను తెలంగాణ రాష్ట్రానికే కీలక పారిశ్రామిక, విద్యా, వైద్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధి కోసం పారిశ్రామిక, విద్యా, వైద్య, సాగునీటి రంగాల్లో సమగ్రంగా పునాదులు వేస్తున్నారని, ఈ కార్యక్రమాలు భవిష్యత్తులో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయని చెప్పారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏర్పాటు చేసిన రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పాలమూరు జిల్లా, అందులోనూ కొడంగల్ నియోజకవర్గం దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైందని, అటువంటి ప్రాంతానికి చెందిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం కొడంగల్ ప్రజల అదృష్టమని అన్నారు. ముఖ్యమంత్రి తన సొంత ప్రాంత అభివృద్ధికి మాత్రమే కాకుండా, ఈ ప్రాంత భవిష్యత్తు తరాల జీవితాల్లో వెలుగులు నింపేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి కార్యరూపం దాల్చిస్తున్నారని ప్రశంసించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేవలం గంట వ్యవధిలో కొడంగల్‌కు చేరుకునేలా రహదారి సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు, ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు అనువైన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందని భట్టి విక్రమార్క వివరించారు. కొడంగల్‌లో 3 వేల ఎకరాలు, పరిగిలో 2 వేల ఎకరాలు, సీతారాంపూర్, చందనవెల్లి ప్రాంతాలను కలుపుకొని సుమారు 5 వేల ఎకరాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి భారీ పెట్టుబడులు తరలివచ్చేలా, పరిశ్రమల స్థాపన ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ముఖ్యమంత్రి ముందు చూపుతో అడుగులు వేస్తున్నారని అన్నారు. పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాకుండా, తరతరాలుగా పేదరికంలో ఉన్న కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి వారి పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పేర్కొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధితో పాటు విద్యారంగానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో సాగునీటి వసతులకు కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృష్ణా నది నుంచి జూరాల ప్రాంతం ద్వారా నీటిని ఎత్తిపోసి మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు సన్నబియ్యం పంపిణీ, 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా పేదల సంక్షేమం, విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కొడంగల్ ప్రాంత ప్రజలతో దీపావళి వేడుకల్లో పాల్గొనడంతో పాటు, వారి జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపేలా వేల కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రివర్గ సహచరుల తరఫున, ప్రజల తరఫున అభినందనలు తెలియజేస్తున్నానని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, భవిష్యత్తు తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి సంకల్పం తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాన్ని సాహితీవేత్తతో భర్తీ చేయాలి

గోరటి వెంకన్న పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో కవులు, రచయితల విజ్ఞప్తి

- ఉద్యమ నేపథ్యం ఉన్న తెలంగాణ సాహితీవేత్తకు ప్రాధాన్యమివ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు విజ్ఞప్తి



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ శాసనమండలిలో ఖాళీ కానున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ సాహితీవేత్తతోనే భర్తీ చేయాలని పలువురు కవులు, రచయితలు, కళాకారులు, బుద్ధిజీవులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉద్యమ నేపథ్యం కలిగిన సాహితీవేత్తకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని, గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం శాసనమండలిలో ఆరుగురు సభ్యులను గవర్నర్ నామినేట్ చేసే అవకాశం ఉందని వారు గుర్తుచేశారు. సాహిత్యం, కళలు, శాస్త్ర, సాంకేతిక, సామాజిక సేవ తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఈ కోటాలో నియమిస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నవంబర్ 14తో బసవరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్, గోరటి వెంకన్న పదవీకాలం ముగియనుందని తెలిపారు. గతంలో గుర్రం జాషువా, వానమామలై వరదాచార్యులు వంటి దిగ్గజ సాహితీవేత్తలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి నామినేట్ అయ్యారని, సి. నారాయణరెడ్డి రాజ్యసభకు నామినేట్ అయ్యారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో సాహిత్య రంగం నుంచి గోరటి వెంకన్నకు ఎమ్మెల్సీగా అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆయన పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఖాళీ అయ్యే స్థానాన్ని మరో తెలంగాణ సాహితీవేత్తతో భర్తీ చేయడం సముచితమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ పదవి ఖాళీగా ఉండటాన్ని వారు ప్రస్తావించారు. ఇటీవల ఎల్‌నినో ప్రభావంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ కవులు, గాయకులు, రచయితలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అస్తిత్వం, ఉద్యమ ఆకాంక్షలను ప్రతిబింబించేలా, ఆంధ్రా వలసవాదాన్ని వ్యతిరేకించే భావజాలంతో పనిచేసిన సాహితీవేత్తకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విజ్ఞప్తి చేసిన వారిలో డా. పసునూరి రవీందర్, డా. సంగిశెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, ప్రసేన్, నాకేశ్వరం శంకరం, సిద్ధార్థ, స్రైబాబ, డా. ఉదారి నారాయణ, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, డా. వెల్దండి శ్రీధర్, డా. కటుకోజ్వల రమేష్, కూకట్ల తిరుపతి, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, మెర్సీ మార్గరెట్, డా. గాదె వెంకటేష్, ఆర్. రత్నాకర్‌రెడ్డి, బైరెడ్డి కృష్ణారెడ్డి, అఫ్సర్, పెద్దింటి అశోక్‌కుమార్, గుడిపల్లి నిరంజన్, గోర్ల బుచ్చన్న, డా. పొన్నాల బాలయ్య, దాసోజు కృష్ణమాచారి, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, సుంకర రమేష్, బిల్లా మహేందర్ తదితరులు ఉన్నారు.

ఏసీబీ వలలో కీసర ఎస్ఐ

రూ.2 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి

- రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసేందుకు డబ్బుల డిమాండ్
- రూ.5 లక్షలు అడిగి.. రూ.2 లక్షలకు ఒప్పందం





మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 09 (జనంసాక్షి) : కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేయడంతోపాటు అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ అధికారులకు పట్టుబడ్డారు. సిటీ రేంజ్-2 ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం నాగారం పరిధిలోని శిల్పానగర్ కాలనీలో వలపన్ని రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేయడానికి, అనుకూలంగా వ్యవహరించడానికి ఎస్ఐ రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడు అంత మొత్తం చెల్లించలేనని చెప్పడంతో చివరకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. నగదు చెల్లించాలంటూ పలుమార్లు ఫోన్ చేసి ఒత్తిడి చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐ లంచం డిమాండ్‌పై బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు నగదు అందజేస్తుండగా ముందస్తు పథకం ప్రకారం దాడి చేసి పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఎస్ఐను అరెస్టు చేశారు. నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరు 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ, ఎక్స్‌లో @TelanganaACB ద్వారా కూడా సమాచారం అందించవచ్చన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కీసర పోలీస్‌స్టేషన్‌లో ఏమి జరుగుతోంది?

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలోనే అవినీతి ఆరోపణలు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోందని కీసర ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్‌స్టేషన్ వరుస ఏసీబీ కేసులతో వార్తల్లో నిలుస్తుండటంపై వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీఐ, ఎస్ఐలపై ఏసీబీ చర్యలు చోటుచేసుకోగా.. తాజాగా మరో ఎస్ఐ లంచం తీసుకుంటూ పట్టుబడటం పోలీస్‌స్టేషన్ పనితీరుపై అనేక సందేహాలు రేకెత్తిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఒకదాని వెంట మరో ఘటన

ఈ ఏడాది ఫిబ్రవరిలో హోంగార్డు నగేష్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 17న కీసర సీఐ, ఎస్ఐలపై ఏసీబీ చర్యలు చేపట్టింది. అక్టోబరు 15న డిప్యూటీ తహసీల్దార్ వ్యవహారం చర్చకు వచ్చింది. తాజాగా నవంబరు 9న ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు స్థానికుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370